రష్యన్ నవంబర్ విప్లవానికి అంకితం

సృజన

9వ జన్మదిన సంచిక

62



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

రష్యన్ నవంబర్ విప్లవానికి అంకితం

62

కృతజ్ఞతలు

కోరిందే తడవుగా ఎందరో రచయితలు, పాఠకులు, అభిమానులు 'సృజన సహాయనిధి'కి ఎంతో ఆప్యాయతతో తమ విరాళాలుఅందజేశారు. వారందరికీ 'సృజన' తన ౮వ జన్మదిన సందర్భంగా కృతజ్ఞతాభివందనములుతెలుపుకొంటున్నది- ముందుముందుకూడా వీరందరి ఆదరాభిమానాలే వేలాది కార్మిక, కర్షక, కష్టజీవుల అండదండలే పెన్నిధిగా విప్లవపు బాటలో తన కర్తవ్యాన్ని మరింత దృఢదీక్షతో కొనసాగించగలదని హామీ యిస్తోంది- విప్లవానికి పునరంకితమవుతోంది- విప్లవం వర్ధిల్లాలి!

— సాహితీ మిత్రులు

150 పైసలు

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

భారతదేశంలో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల దోపిడీ

—"క్రెమ్లిన్‌పై లెనిన్ అంతర్జాతీయ విప్లవపతాక ఎన్నడో చివికి చిరిగిపోయింది...."

" 'రాజకీయ స్వాతంత్ర్య దేశాలకు సహాయం' అనే ముసుగులో సామ్రాజ్యవాద శక్తులు ఆర్థికంగానూ, మిలటరీ రీత్యానూ సంపూర్ణంగా తమపై ఆధారపడే విధంగా ఆయా దేశాలను యేర్పరుస్తున్నారు" —లెనిన్ ఏనాడోచెప్పిన యీ వాస్తవం యివాళ సోవియట్ రివిజనిస్టు సోషల్ సామ్రాజ్యవాదుల ఆచరణలో రుజువవుతున్నది.

ఆగ్నేయ ఆసియాలో సోవియట్ రివిజనిస్టులకు భారతదేశం గొప్ప అమ్మకం మార్కెట్టుగా, ముడివస్తువుల శుద్ధిచేసే కర్మాగారంగా, జనచైనాకు వ్యతిరేకమైన 'బేస్ ఏరియా'గా ఉపయోగపడుతున్నది- 'భారత సోవియట్ మైత్రీ సహకారం' అన్ని దేశాలకు ఆదర్శమని 'ఇండియాకు సోవియట్ సహాయం' 'అద్భుత విజయమ'ని సోవియట్ రివిజనిస్టు ముఠా సిగ్గులేకుండా ప్రపంచమంతా డబ్బావాయించుకొంటున్నది. కాని నిజానికి యీ సోషల్ సామ్రాజ్యవాదులు ఆసియా, ఆఫ్రికాదేశాలలో సాగిస్తున్న తీవ్ర నిరంకుశ దోపిడీ, నయావలసవిధానం, యివాళ దాచేస్తే దాగని సత్యం.

"వలసవాదులు వలసదేశాలను ముడిసరుకు సప్లయిచేసే కేంద్రాలుగామార్చి, అసమాన పెట్టుబడులు, వస్తువుల మార్పిడితో దారుణమైన దోపిడిసాగిస్తారు" ఇవి మార్క్స్‌మాటలు. ఈనాడు 'నయాజారు చక్రవర్తులు' చేస్తున్నపని యిదే. ఇండియా సోవియట్ వ్యాపారం ఎన్నడూ సమాన ప్రాతిపదికమీద జరుగలేదు. సోవియట్ రివిజనిస్టులు ఇండియాకుఎగుమతిచేస్తున్న యంత్రపరికరాలు అంతర్జాతీయమార్కెట్టుధరలకంటె 20% నుండి 30% అధికం. కొన్ని 3 రెట్లు అదనంగాకూడా ఉంటాయి ఇక భారత దేశం సోవియట్ దేశానికి ఎగుమతిచేసే వ్యవసాయసరుకులు, గనుల ముడిఉత్పత్తులు. సోవియట్ రివిజనిస్టులు తమ ఆర్థిక ఆధిక్యతను ఉపయోగించుకొని అంతర్జాతీయ మార్కెట్ ధరకంటె 20 నుండి 30 శాతంవరకు తక్కువధరలకు కొంటారు. ఇట్లా సోవియట్ రివిజనిస్టులు భారతదేశాన్ని దోచుకొని అసాధారణ లాభాలు గడిస్తున్నారు. పైగా, సోవియట్ ఇండియాకు విక్రయించే యంత్రసామగ్రి నాణ్యత తక్కువ. అనేక సందర్భాల్లో చాలాపాతవి, మరమ్మతులు అవసరమైనవి. అత్యంత నష్టదాయకమైనవి- ప్లానువేసి, యంత్రాల సప్లయిచేసి వాటిని అమర్చేవరకూ అంతా సోవియటు రివిజనిస్టుల ప్రత్యక్ష పర్యవేక్షణకిందే జరుగుతుంది-

సోవియట్ రివిజనిస్టుముఠా భారతదేశానికి పెద్దయెత్తున 'అప్పుల'రూపంలో పెట్టుబడులుపెట్టి భారతప్రజల నిర్దాక్షిణ్యంగా దోచుకొంటున్నది ప్రతి భారతపౌరుడు యివాళ అమెరికాకువలెనే సోవియట్ రుణదాతలకు బాకీ పడిపోయాడు- సోవియట్ రివిజనిస్టులు యిస్తున్న ప్రతి 100 రూ.లకు ఆదే సం. భారతదేశం 125 రూ. చెల్లించవలసి వస్తున్నది.

'వ్యాపార అభివృద్ధి' పేరిట సోవియట్ రివిజనిస్టుముఠా భారత విదేశవ్యాపారంపై పట్టును సంపాదించింది— పెద్దమొత్తంలో యంత్రసామగ్రిని దిగుమతిచేసి భారత జాతీయ పరిశ్రమలను దెబ్బకొట్టి ఎగుమతి సరుకులపై యాజమాన్యం సంపాదించి దేశాన్ని పీల్చి పిప్పిచేస్తున్నది. భారత దేశాన్ని తమపై ఆర్థికంగా ఆధారపడేట్టు చేస్తున్నారు. ప్రతి సం. భారత దేశంనుండి పెద్దమొత్తంలో ముడియినుము, జనపనార, ప్రత్తి, ఉన్ని, అభ్రకం యింకా యితర పారిశ్రామిక సరుకులు సోవియట్ రివిజనిస్టు ముఠా లాగేస్తున్నది—

సోవియట్ నయాజారులు భారత ప్రైవేటు పెట్టుబడిదార్లతో చేతులుకలిపి భారత కార్మికవర్గాన్ని పీల్చి అధికలాభాలు గుంజడానికీ వెనుకాడలేదు— ఇలా అంతర్జాతీయతా కార్మికభావాన్ని చిత్రవధచేశారు.

అమెరికా సామ్రాజ్యవాదులతోపాటు సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు ఇండియాపై తమ ఆధిపత్యంకోసం భారత బడా బూర్జువా భూస్వామ్యవర్గాలతో చేతులు కలుపుతున్నారు. భారతదేశ అభివృద్ధి నిరోధకులైన యీ బడాబూర్జువా భూస్వామ్య వర్గాలు సామ్రాజ్య, సోషల్ సామ్రాజ్యవాదుల నమ్మినబంట్లుగా భారతప్రజల సాయుధ విప్లవాలను, కమ్యూనిజాన్ని, చైనాను వ్యతిరేకిస్తున్నారు.

'మిలిటరీ సహాయం' పేరుతో సోషల్ సామ్రాజ్యవాదులు భారత దేశంలో తలెత్తిన ప్రజావిప్లవాల అణచివేసి, ఇండియాద్వారా ఆగ్నేయాసియాలో తన పెత్తనం సాగించడానికి, ప్రపంచ విప్లవకేంద్రమైన జనచైనాను వ్యతిరేకించడానికి పథకాలు అమలుపరుస్తున్నారు. ఇందుకోసం అసంఖ్యాకమైన మిలిటరీ నిపుణులను, సలహాదార్లను సోవియట్ భారత దేశానికి పంపింది. భారత దేశం మిలిటరీబలంతో తూర్పుపాకిస్తాన్‌ను పాకిస్తాన్‌నుండి విడగొట్టడం, సిక్కింను అనుబంధరాష్ట్రంగా మార్చుకోవడం యీ మార్గంలో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల ప్రమేయంతో జరిగిన సంఘటనలే— హిందూ మహాసముద్రంపై ఆధిపత్యం సాగించడానికి రష్యావేస్తున్న ఎత్తుగడలు ప్రపంచం గమనిస్తున్న విషయమే—

చెయిర్మన్ మావో అన్నట్లు "ప్రపంచ విప్లవ ప్రజలు శిక్షించవలసిన అనేక నీచమైన దుర్మార్గాలను, అమెరికన్ సామ్రాజ్యవాదులు, సోవియట్ రివిజనిస్టులు చేశారు—"— సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులకు, అమెరికా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వారివారి దేశాలలోను, ప్రపంచమంతటా నూతన పోరాటదశ ప్రారంభమైంది అన్నిదేశాల విప్లవప్రజలు, ముఖ్యంగా 'మూడవ ప్రపంచ' విప్లవప్రజలు ముందుకువస్తున్నారు సోవియట్ రివిజనిస్టు సోషల్ సామ్రాజ్యవాదుల నిర్దాక్షిణ్యమైన దోపిడీ దౌర్జన్యాలను భారతప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. భారత విప్లవప్రజల, ప్రపంచ విప్లవప్రజల రథచక్రాలకింద సోవియట్ రివిజనిస్టుల సోషల్ సామ్రాజ్యవాదం అణచివేయబడుతుంది.

[పీకింగ్ రివ్యూ నెం. 30, 1969 ఆధారం]

లెనినిజం

ప్రజల నెత్తుటిలో చిగురించిన
తొలి సామ్యవాద రక్తపతాకాన్ని
కంటికి రెప్పలా కాపాడిన లెనిన్!
ఇవ్వాళ నీ స్వప్నాన్ని పాతేసి శవాన్ని పూజిస్తున్నారు
రంగు మార్చకుండా దిక్కుమార్చిన రష్యాపాలకులు–

వర్గపోరాటం చుక్కానిగా నువ్వనడిపిన శ్రామికరాజ్యాన్ని
వర్గసామరస్యం ఊబిలోదించి
సామ్రాజ్యవాద సహజీవన సంకర రాజకీయాల
రంకు సాగిస్తున్నది రివిజనిజం యివ్వాళ

కామ్రేడ్,
కృశ్చెవ్‌వైట్లు నిన్ను పొగిడి చంపామని
స్టాలిన్‌ను పూడ్చి చంపామని
చంకలు గుద్దుకుంటున్నారు–
కాని యివ్వాళ మీరిద్దరూ సోవియట్ ప్రజల ప్రతిఘటనలోనేకాదు
ప్రపంచ పీడిత ప్రజల వర్గపోరాటంలో
ప్రవహిస్తూ వెచ్చగా బతుకుతున్నారు

మావో ఆలోచనా విధానంలో సజీవపోరాట సత్యానివై
శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవం సాగిస్తూ
జనచైనాలో ఎగురుతున్న ఎర్రజెండావు నువ్వు–
భారత ప్రజల పోరాట మార్గాన్ని
నిర్దేశిస్తున్న విప్లవ సిద్ధాంతానివి నువ్వు

కామ్రేడ్! నువ్వు విప్లవశ్వాసతో జీవిస్తున్న నిజానివి; లెనినిజానివి
అందుకే నువ్వు మాకు చరిత్ర పురుషునివికాదు
వర్గపోరాట చరిత్రవు

లెనినంటే విప్లవ తద్దినానికి యిల్లలుక్కునే
రివిజనిజం అలుకుపిడచకాదు
విప్లవానికి పునరంకితమయ్యే సాయుధ పోరాట ఎర్రజెండా.

ఎర్రకోటమీద....

ఎరుపు

ఎగురుతుంది ఎర్రజెండ
ఎర్రకోట మీద
పగులుతుంది పాలకుల
పాడుబడ్డ మేడ. ॥ఎగు॥

నక్సల్‌బరిలో రగిలిన
అరుణారుణ చైతన్యం
అలుముకొంది దేశంలో
అన్ని మూలలందు
చారుధీరుడెగరేసిన
సాయుధ పోరాటజెండ
అందుకొంది అణగిఉన్న
ప్రజాశక్తి నేడు. ॥ఎగు॥

వర్గకసితో కనలుతున్న
పేదప్రజల కోపాగ్ని
ప్రళయంగా మారుతోంది!
పెను జ్వాలగ మండుతోంది!
సమ సమాజ స్థాపనకై
సాగించే సమరానికి
దోపిడి దొరగాళ్ళ నరికి,
సాయుధమై కదుల్తోంది
ప్రజాసేన కదుల్తోంది. ॥ఎగు॥

పల్లెల్లో పారుతున్న
పోరాటపు సెలయేరు
పట్టణాల కలుపుకొని
పరుగులెత్తి సాగుతుంది
తిరుగబడ్డ రైతన్నల
చేతులతో చేయికలిపి,
కార్మికవర్గం తానే
విప్లవాన్ని నడుపుతుంది. ॥ఎగు॥

రక్తకిరణ ప్రభాసితుడు
గెరిల్లా భాస్కరుడు
దోపిడి చీకట్ల చీల్చి
తూర్పున ఉదయిస్తాడు
ఈ దీర్ఘకాల సాయుధ
విముక్తి పోరాటంలో
సత్యమే గెలుస్తాడు
చావకుండ నిలుస్తాడు. ॥ఎగు॥

దోపిడి, పీడనలేని
సుందర నవసమాజం
నిశ్చయంగ వెలుస్తుంది
నిశ్చయంగ వెలుస్తుంది
ప్రతిమొక్కా స్వేచ్ఛగా
చిగురించే ఆ రోజు
ఎంతో దూరంలేదు
త్వరలోనే వస్తుంది. ॥ఎగు॥

ఆహ్వానం

యాత్రిక్

కామ్రేడ్, పోరాటం ఊపిరిగా పవనించిన నీ అక్షరాలు
చీకటిలో వడలిన ఎర్రపూల స్వప్నాలను వెలిగించినయ్
మానవతా అశ్రువుల్లో ఆర్ద్రమైన గుండెమీద
పదును పెట్టిన నీ కసి అంచుమీద నెత్తుటి గంటు
అదే అదే అరుణతార—
మన దారిలో వెలుగుతూ ఆహ్వానిస్తున్నది.

ఏకాంతంలో, ఏటిమీది పోరాటపాట
ఎదురీత సంగీతం వింటున్నాను.

నువ్వు ఒంటరివి కావు
విచ్చుకోనున్న మొగ్గలన్నీ నీ కోసం
స్వచ్ఛమైన హృదయాలు పరచినవి
వాటిని వెలుగుల్లోకి వికసించనీ
నేనూ ఒంటరిని కాను— కటకటాలలో
సీమలులేని శ్రామిక రాజ్యాన్ని
సంకెళ్ళ సవ్వడిలేని స్వేచ్ఛను ఊహించు కుంటున్నాను.
నా ఊహాలు జనం వూపిరితో చిగురించి
ఎర్రజెండా నీడలో ఎదిగినాయని నీకు తెలుసు.

రేపు మనం గెలుస్తామన్న విశ్వాసం
జనం చూపు మన ప్రతీ అడుగునూ
నిశితంగా చదువుతున్నదన్న చైతన్యం
బాధను సైతం
అనుభవైకవేద్యమయిన ఆనందంగా మారుస్తుంది.

జనం గుండెలోని ఆయుధాన్ని, ఎర్రజెండాగా
రక్తం శ్వాసించిన సమరంగా
చరిత్ర మన చేతుల్లో పెట్టింది.

కణం కణం పోరాటం రగిలే స్వభావం
అణువణువూ మార్పును స్పందించే ప్రకృతి
పోరాటం మధ్యలో విరామంలో యీ జెయిలు-
ఆరాటాన్నీ సిగ్గునూ కలిగిస్తున్నది.

ప్రజా యుద్ధంలో కదం తొక్కుతున్న
మనతరం శ్వాసకు తోడు కావాలని
ఈ చీకటి గూట్లో నా నరాలు
లావాలు చిమ్ముతున్నయ్.

పిరికితనంతో మలినమైన బాటల్ని
కడగడానికి మన నెత్తుర్లు ఖర్చుకానీ
భవిష్యత్తరం దారిలో పరచుకున్న బాధల్ని
ఏరి వేయడానికి మనం బాధల్ని వరిద్దాం.
ఏ ఒక్కరి ఆనందం కోసమో వేళ్ళు తెగే
వీణానాదం కాదు
మన పేగులమీద ప్రపంచ ప్రజల
విప్లవ ఆకాంక్షలు మీటుదాం.

ఈ దోపిడీ దుర్గంకింద ఎందరో
మృతవీరులు తమ ప్రాణాలను డైనమైట్లుగా కూర్చారు.
ఈ కోటలోని ప్రతి రాయిలో యింకిపోయిన
కష్టజీవుల కన్నీళ్ళలో రగులుతున్న అగ్ని
ప్రవహిస్తున్నది.
చరిత్ర ప్రసవిస్తున్నది
విప్లవం యీ యుగ శిశువు

ఈ శిశు సూర్యోదయ దరహాసం కోసం
ప్రభంజన శ్వాసకోసం
చీకట్లను తుడిచిపెట్టే ఉరవళ్ళ వరదల పరుగుకోసం

'ఈ బాటలో మన ఊపిర్లు పరుద్దాం'
సాహసం మనపాటకు పల్లవి-
త్యాగాలు మన బాటకు మైలురాళ్ళు-
కంఠంలో నినాదంగా స్వీకరించిన పోరాటమే
ఊహలకు ఇంతగా కాంతినిస్తుంటే
మనం ప్రజల రాజ్యాధికారం శత్తిని నిర్మించే
కొలిమిలో రవ్వలమైతే ఎంత వెలుగు !

మార్క్సిస్టు-లెనినిస్టు కమ్యూనిస్టులమండి

సంతాల్

మార్క్సిస్టు-లెనినిస్టు
కమ్యూనిస్టుల మండి
మావో ఆలోచనల
మార్క్సిజం మనదండి ॥మా॥

నక్సల్‌బరీ మనకు
ఆక్సిజన్ పంచింది
శ్రీకాకుళం మనకు
శక్తినిచ్చిందండి ॥మా॥

రైతాంగ పోరులో
కార్మికుడు తోడుగా
పల్లెలను పట్టుకొని
ఢిల్లీని కొడదాము ॥మా॥

వర్గశత్రువుల బట్టి
మట్టుబెడదామండి
భూస్వాములను భూమి
తవ్వి పాతెడదాము ॥మా॥

సామ్రాజ్యవాదమూ
పతనమవుతుందండి
జనచైన కేంద్రంగ
చచ్చేట్టు కొడదాము ॥మా॥

తుదిసమరమున మనం
నిలిచి ఉన్నామండి
తాడో పేడో తేల్చు
కుందాము రారండి ॥మా॥

"పెట్టుబడిదారీవర్గం, తన్ను నాశనంచేసే ఆయుధాలను సృష్టించుకోడమే కాక, వాటిని చేబట్టిపోరాడగల మనుష్యుల్నికూడా- శ్రామికవర్గాన్ని- సృష్టించుకొంది"

— మార్క్స్-ఎంగెల్స్

వీర భూమి

నిరంజన్

శ్రీకాకుళంరా! వీర శ్రీకాకుళంరా!
వీరయోధులను కన్నగడ్డ
శ్రీకాకుళంరా ! ॥శ్రీ॥

గిరులు తరులు సంపదలు
నిండి యుండెరా...
వంశధార, నాగావళీ
వన్నె తెచ్చెరా-వన్నె తెచ్చెరా ॥శ్రీ॥

అదిగదిగో తీరప్రాంతం
అదేనంట ఉద్దానం
ఉద్దానంకాదురా ఉద్యానవనంరా॥శ్రీ॥

అడవులందు నివసించే
ఆదివాసులేనోయ్
భారత విప్లవ పోరుకు
మూల పురుషులోయ్ ॥శ్రీ॥

వెంపటాపు, కైలాసం
వెలిగించిన జ్యోతిరా
శ్రీకాకుళం చీకట్లను
చీల్చి వెలుగునిచ్చెరా ॥శ్రీ॥

తామాడ గణపతీ
ఉద్దానం బిడ్డరా
త్యాగమూర్తి పంచాదీ
శ్రీకాకుళం వెలుగురా ॥శ్రీ॥

విప్లవకవి పాణిగ్రాహి
కీర్తించిన భూమిరా...
వీరులనూ కన్న గడ్డ
వీర శ్రీకాకుళంరా ॥శ్రీ॥

దేశానికె వెలుగుబాట
శ్రీకాకుళంరా
భావితరం బ్రతుకుబాట
శ్రీకాకుళంరా

అనుసరించరా...
అదే త్రోవరా...
వీరభూమి శ్రీకాకుళం
తెలిసి నడువరా... ॥శ్రీ॥

హెచ్చరిక

గన్ మెన్

విప్లవ వీరులను
చీకటి కొట్లల్లో మూసినంత మాత్రాన
విప్లవం సమసిపోదు

ఒక రోజు
విరిగిన గవాక్షాల సందుల్నుండి
వినబడకపోదు విప్లవ వీరుల
ఆక్రోశం

మీ పగిలిన
గాజుపెంకల్లోనే
కనబడకపోదు విప్లవ వీరుల
ఉగ్రరూపం

మీ ఒళ్ళంతా రక్తపు మరకలు
పడ్తాయి ఖాయం
ఆ ధాటికి తట్టుకోలేక
మలిగిపోతావు తప్పదు—

ఉదయం

రుధిర్

ఈ చీకటి
నన్ను శపిస్తే, శాసిస్తే
వెలుగుకోసం పోరాడుతున్నాను!
ఈ చీకటి
నన్ను దహిస్తే
వెలుగు నిప్పురవ్వను సృష్టిస్తున్నాను!
నే రగిలించిన
ఈ అనలకణం
క్షణం క్షణం దావానలమై
ఈ చీకటిని దహించుకపోదు!
ఎన్ని "మిణుగురులు"
వెలిగి రాలిపోయినా
ఆ కాంతి కణాలు
నా కంటిలో ప్రజ్వరిల్లుతూనే
ఉన్నాయి!
ఎందరి అహూతితో
ఈ వెలుగుదారి నా కందిందో?
వారి ఎఱుపు గమ్యం
నే చేరలేకున్నా
నేనొక ము దడుగైతే చాలు?
నేనొకడ్ని రాలిపోయినా
ఈ ఆకాశం జారిపోదు
ఎన్ని "నక్షత్రాలు" రాలందే,
రేపటి "ఉదయం" ప్రసవించును!

కథ:

ఖరీదుకట్టే షరాబుఃలేడోయ్ !

చైనీస్ మూలం: వాంగ్-యువాన్-ఛెన్
స్వేచ్ఛానువాదం: నెమలూరి భాస్కరరావు

ప్రతినెలా నేను నా పార్టీ సభ్యత్వరుసుం చెల్లించినప్పుడల్లా మా గ్రూప్ లీడర్ నా పేరుకింద నేను చెల్లించిన మొత్తాన్ని జమ వ్రాసుకుంటాడు ఆయన అలావ్రాయటం చూసినప్పుడల్లా, 1934వ సంవత్సరం ఆకురాలుకాలంలో జరిగిన విషయాలన్నీ నా మనోఫలకంమీద గిర్రున తిరుగుతుంటాయి .

ఆ సంవత్సరం ప్రారంభంకావటమే, ఫూకిన్, క్వాంగ్‌టంగ్, క్వాంగ్‌షీపరగణాలకు సంబంధించిన సరిహద్దురాష్ట్రంలో కష్టతరమైన పోరాటాలకు నాంది అయింది. సైన్యంలో సగభాగం ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి జపాన్ దురాక్రమణను అరికట్టటాన్కి అగ్రగామిదళంలో కలిసి ఉత్తరదిశగా వెళ్ళిపోయింది. మిగిలినభాగం ఎర్రసైన్యంతో కలిసి లాంగ్‌మార్చ్‌లో పాల్గొనటాన్కి వెళ్ళిపోయింది. కొమింగ్‌టాంగ్ బందిపోట్లు అనుసరిస్తున్న "చుట్టివేత—అణచివేత—తెల్లభయాల"నుంచి రక్షించుకుంటూ తిరిగిపోరాటం ప్రారంభించటాన్కి మిగిలిన చిన్న చిన్న దళాలు కొన్ని పర్వతాలమీదకు తప్పు

కున్నాయి కామ్రేడ్ "వే-చీ" మా దళాంకు కమిస్సారు. ఆయన సూచనలమేరకు మేము కొండల్లోవుంటూనే, ఆ జిల్లాకు సంబంధించిన అన్నిరహస్య కార్యకలాపాలనూ కొనసాగించసాగాం. శత్రువుమీద మెరుపుదాడులు సాగిస్తూ, స్థానిక పార్టీ శాఖలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోగలిగాం. శత్రువు వెంటనే గ్రహించాడు, మా కాళ్ళు విరగగొట్టాలంటే ప్రజానీకాన్ని మాకు దూరంచేయాలని. "గ్రామాల పునర్ వ్యవస్థీకరణ" పేరుతో ప్రజానీకాన్ని పర్వత పరిసరాలనుంచి చాలా దూరంగా వున్న మైదాన ప్రాంతాలకు బలవంతంగా తరలించేశాడు. శత్రువుయొక్క యీ చర్య మాకు గొడ్డలి పెట్టులా పరిణమించింది. స్థానిక పార్టీశాఖలు విచ్ఛిన్నం కావటమేకాక, ప్రజానీకానికి మేం దూరం అయిపోవటంకూడా సంభవించింది. పోరాటం తిరిగి ప్రారంభించాలంటే, విచ్ఛిన్నమయిపోయిన పార్టీ శాఖల్ని తిరిగి నిర్మాణం చెయ్యటంకన్నా మాకు మరో గత్యంతరంలేదు.

పర్వతాల్లోకి తప్పుకోకముందు నేను స్థావటుగా పనిచేస్తూండేవాణ్ణి. రహస్యంగా నేను సంచరించే ప్రతిచోట ప్రజలు నన్నాదరించి, ఆతిథ్యంయిచ్చి, అన్ని విషయాల్లోనూ నాకు సహాయపడుతూండేవారు. నేను ప్రజల సహకారంతో శత్రువుమీద దాడి చేస్తూ, ఒకటీ అరా వాడి ప్లెటూన్లను నాశనంచేస్తూండేవాళ్ళం. ఏమైనప్పటికీ యిప్పుడు ఆ ప్రజలు మాకు దూరం అయ్యేసరికి జీవితం నిస్సారంగా తయారయ్యింది. మేం ఏమయిపోతామో? అనేదానికన్నా పోరాటం ఆగిపోయినందుకు, ప్రజల కోసం మేము కామ్రేడ్స్‌గా ఏమీ చెయ్యలేని స్థితిలో పడిపోయినందుకూ ఎక్కువగా విచారిస్తూండేవాళ్ళం. ఆ నిస్సహాయస్థితిలో, విసుగుదలలో, అనేక దిక్కుమాలిన ఆలోచనలు చేస్తుండేవాళ్ళం. పరిస్థితులు సహించలేనంతగా మారిపోతూన్న తరుణంలో మా కమిస్సార్ నన్ను పర్వత ప్రాంతానికి దూరంగావున్న స్థానిక పార్టీ శాఖలతో సంబంధాలు ఏర్పాటుచేసుకోవటాన్కి వెళ్ళమని కోరాడు. ఆ సూచన నన్ను అమితంగా ఆనందపరిచింది. నేను చెయ్యాల్సిన పని ఎలాంటిదంటే విడిపోయిన దారాలనన్నింటినీ కలపటం. శత్రువు పన్నిన గ్రామ పునర్‌వ్యవస్థీకరణ పథకంద్వారా పార్టీకీ, స్థానిక శాఖలకూ తెగిపోయిన సంబంధాలను తిరిగి పునరుద్ధరించటం. ఆ విధంగా తిరిగి శత్రువుమీద దెబ్బ తియ్యటం. నేను వెళ్ళవలసిన గ్రామం పర్వతాలకు పదిమైళ్ళదూరానవుంది. దానిపేరు "వైట్-కార్నర్-హాలో" శత్రువు మూడు నాల్గు గ్రామాల్ని కలిపి ఆ ప్రజలందర్నీ తన "గ్రామ పునర్‌వ్యవస్థీకరణ"లో భాగంగా అక్కడికి తరలించాడు. నేను సంబంధం పెట్టుకోవలసిన మనిషి 1931 లో పార్టీ సభ్యురాలిగ చేరిన 21 సంవత్సరాల వయస్సు గల కామ్రేడ్ హుయాంగ్-సిన్ అనే ఆవిడతో. ఆవిడ భర్త ప్రస్తుతం ఎర్రసైన్యంతో పాటు లాంగ్‌మార్చ్‌లో పాల్గొంటున్నాడు. ఆమె తన అయిదు సంవత్సరాల చిన్న

కూతురితోపాటు ఆ గ్రామంలో నివసిస్తోంది. శత్రుపథకంలో ఆమె గ్రామం నాశనమయిపోగా, మిగిలిన గ్రామస్థులతోపాటు ఆమె వైట్-కార్నర్-హాలో లో వుంటోంది. ఆమె పార్టీకోసం నమ్మకంగా పనిచెయ్యగలదనీ, రహస్య నిర్మాణ కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగించగలదనీ మా కమిస్సార్ వే-చీ చెప్పాడు. రహస్య కమిటీలను స్థాపించి, కార్యకలాపాలు కొనసాగించటానికి కావలసిన సూచనలతో, అందుకే ఆవిడదగ్గరకు నన్ను పంపటం జరుగుతోంది. ఆమెనుగురించిన ఈ సమాచారంతోపాటు, ఆమెను గుర్తుపట్టటానికిగాను, ఆమె చెవిమీద నల్ల పుట్టుమచ్చ వున్న విషయాన్ని గురించికూడా మా కమిస్సార్ నాకు చెప్పాడు

నాకు కావలసిన సరంజామా తీసుకుని, మామూలు గ్రామస్థుని వేషంలో చీకటి పడగానే ఆ గ్రామానికి బయలుదేరాను. రెండు గంటలపాటు అడ్డదార్లంటనడిచి నడిచి వైట్ కార్నర్ హాలో చేరుకున్నాను. నేను ఇదివరకు యిక్కడకు వచ్చినప్పుడు ఆ గ్రామం ఎర్రసైన్యం అధీనంలోవుంది. పగలంతా పొలాల్లో కాయకష్టంచేసిన ప్రజలు, రాత్రిపూట హడావిడిగా సమావేశాలు జరుపుకోవటం, రాత్రిపాఠశాలలకు హాజరు అవుతూ చదువుకోవటం, వాయిద్యాలమీద పాటలు పాడుకోవటం; ప్రతివాడూ కోరుకునే జీవకళ వుట్టిపడుతూండేదక్కడ. కానీ యిప్పుడా గ్రామంలో ఎలాంటి కదలికా లేకపోగా, ఒక్క దీపంకూడా లేకుండా చీకటిలో మునిగిపోయి స్మశానంలా కనపడుతోంది. కొమింటాంగ్ సెంట్రీలు అప్పుడప్పుడు అరిచే పహరా హుషార్ శబ్దాలు మాత్రం వినపడుతూన్నాయి. ప్రజల్ని ఇలాంటి కాన్ సెంట్రేషన్ క్యాంపుల్లో పడవేయటం ద్వారా వాళ్ళను జయించేశానని బహుశా శత్రువు విర్రవీగుతూ వుంటాడనుకుంటాను. కానీ నా అభిప్రాయం ఏమిటంటే, జీవకళ లేనట్లు కనిపిస్తున్న ఆ గ్రామం నివురుగప్పిన నిప్పులాంటిది. నేడో రేపో తప్పకుండా ఆ గ్రామం ఉప్పెనలా తిరగబడుతుందనేదిఖాయం. మా కమిస్సార్ చెప్పిన గుర్తులప్రకారం తూర్పువేపునుంచి లెక్కపెట్టుకుంటూ పదిహేనోది పూరింటిదగ్గర ఆగాను విచిత్రమేమిటంటే అంత రాత్రివేళకూడా ఆ ఇంట్లో దీపం వెలుగుతోంది. లోపల్నుంచి ఎవరో కూనిరాగం తీస్తున్నారు. ఆ కంఠస్వరాన్ని బట్టి ఆడమనిషి అని గ్రహించాను. ఆ పాట నాకు బాగా పరిచయం వున్నదే. ఎర్రసైన్యాన్ని గురించి ఆడవాళ్ళు పాడుకునే పాట అది.

ఎర్రదండులోని వాడా!
నా వలపుల రేడా!
శత్రుమూకలతోటి
శక్తితో పోరాడు
చెప్పరానిదేమన్నా
నీకు జరిగిందంటే...

నీ ఆశయాన్ని నేను
కొసవరకూ సాగిస్తా ॥ఎర్రదండు॥

పచ్చికబీడు పొలంకాడ
నేనిచ్చిన వీడ్కోలూ
గుండెల్లో దాచుకోవోయ్
కొండల్ని పిండిచెయ్ ॥ఎర్రదండు॥

పర్రభూముల్లోన
పగలంతా పాటుపడినా
ఎర్రిసేనలో నీ వునికి
ఇస్తుంది ఎంతో తృప్తి ॥ఎర్రదండు॥

ఎంతకాలానికి తిరిగి ఈపాట మళ్ళీ విన్నాను ! ఇలాంటి క్లిష్టసమయంలో ఆ పాట వినటం నాకెంతో మనోధైర్యాన్ని కలిగించింది. ప్రజలు కౌమింటాంగ్‌వల్ల ఎన్నెన్నిబాధలు పడుతున్నా వాళ్ళ హృదయాలు ఇంకా ఎర్రగానే వున్నాయి.

వాళ్ళింకా ఎర్రిసైన్యంగురించే ఆలోచిస్తున్నారు. ఎర్రిజండా రెపరెపలాడుతూ విప్లవించాలనే ఆలోచన వాళ్ళ మనసుల్లో ఇంకా ఉన్నతంగానే వుందనిపించింది నాకు. బహుశా ఆ కూనిరాగంతీస్తున్న మనిషి కామేర్రిడ్ హుయాంగ్-సిన్ కావచ్చు. ఇప్పటికే చాలా పొద్దుపోయింది, పైగా నా కర్తవ్యాన్ని నిర్వహించి తెల్లవారకుండానే ఈ ప్రిదేశాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోవాలినేను. మా కమిస్సార్ చెప్పిన సంకేతం ప్రకారం తలుపుపైభాగంలో రెండుసార్లూ, మధ్యభాగంలో ఒకసారి, క్రిందభాగంలో మూడుసార్లూ తట్టాను. కూనిరాగం ఆగిపోయి హఠాత్తుగా ఆ యింటిని నిశ్శబ్దం ఆవరించింది. నేను మళ్ళీ తలుపుతట్టాను. పాదాలసవ్వడి వినిపించినతర్వాత తలుపుతెరుచుకుంది. నేను లోపలకు ప్రివేశించి ఆగిపోయాను. ఆ యింటిమధ్యలో ఓ ఇద్దరు ఆడవాళ్ళు, మరో ముసలిమగవాడూ ఓ కూరగాయల గంపచుట్టూకూర్చుని తలలువంచుకుని క్యాబేజీ ఆకులు తెంపుతున్నారు. వాళ్ళు నా రాకకు ఏమాత్రిం చలించకపోగా, తలలుకూడా ఎత్తలేదు. నేను సందేహంలోపడిపోయాను. వీళ్ళలో కామేర్రిడ్ హుయాన్-సిన్ ఎవరూ? అని. ఆ పరిస్థితుల్లో నేను ఏమాత్రిం అజాగ్రిత్తగా వ్యవహరించినా, నా ప్రాణాలకే మోసంరావటంకాక, మొత్తం పార్టీ నిర్మాణానికే తీరనినష్టంకలుగుతుంది. "నాకు కావలసిన ఇల్లు ఇదికాదులావుంది!" అన్నాను యధాలాపంగా అన్నట్లు. ఆ మాటకు వాళ్ళుముగ్గురూ తలలుపైకెత్తి నావైపుచూశారు. ఆతృతగా వాళ్ళముఖాలు పరిశీలిస్తున్న నాకంటికి చెవుమీద, పుట్టుమచ్చగల కామేర్రిడ్ హుయాన్-సిన్ కనిపించింది. నా సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ ఆవిడతోఅన్నాను "నన్ను గుర్తుపట్టలేదా

చెల్లాయ్! నీ భర్త దగ్గరనుంచీ నీకు మళ్ళీ ఉత్తరంతెచ్చాను." ఆవిడ వెంటనే గ్రహించేసింది నేనెవరో, చాలా జాగ్రత్తగా పరిస్థితిని ఆకళింపుచేసుకుంటూ మాట్లాడింది. మెరుస్తున్నకళ్ళతో నన్నుచూస్తూ, పరిచయంవున్న పాతమిత్రుడిలా నన్ను ఆదరించేందుకు నాకోసం ఓ పీటవేసింది కూర్చోమని. అంతవరకూ అక్కడేవున్న మిగిలిన ఇద్దరితో "మీరు చెరికాస్త క్యాబేజీ తీసుకువెళ్ళండి. ఊరగాయకుకావలసిన ఉప్పు దొరికిన తర్వాత దాన్నికూడా పంచుకుందాం" అంది. వాళ్ళు నావైపు చిరునవ్వుతోచూస్తూ, కేబేజీ తీసుకొని బయటకువెళ్ళిపోయారు. వాళ్ళను సాగనంపేనెపంమీద బైటదాకావెళ్ళి పరిసరాలుగమనించి లోపలకువచ్చి తలుపుగడియవేసింది కామ్రేడ్ హుయాన్-సిన్. ఆమె తిరిగివచ్చేలోపల నేను ఇల్లంతా పరిశీలనగాచూశాను. మొత్తం రెండుగదుల ఇల్లది. ఓ గోడవార చిన్నగది మొత్తంమీద ఓ అయిదేళ్ళపాప పడుకుని నిద్రపోతోంది. ఆ పాప హుయాన్-సిన్ కూతురు అనుకుంటాను. వంటకు సంబంధించిన మట్టిపాత్రలు ఓ మూలవున్నాయి. ఇంటికప్పు క్రిందభాగంలో బల్లచెక్కలు పరచిన అటకవుంది. దానిమీద కొన్నిసామాన్లు, నాలుగైదు చెరుకుగడలమోపులూ వున్నాయి.

దీపం కొంచెం పెద్దదిచేసి నా ఎదురుగా కూర్చుని మాట్లాడటం ప్రారంభించింది కామ్రేడ్ హుయాన్‌సిన్ "ఇందాక ఇక్కడనుంచి వెళ్లిపోయిన వాళ్లిద్దరూ మన సానుభూతిపరులే. అయినా ఈసారి మీరు యిక్కడకు వచ్చినప్పుడు, ముందుగా బైట గోడకువున్న కన్నంలోంచి లోపలకు తొంగిచూసి ఎవరేనా కొత్త వ్యక్తులు వున్నారేమోనని గ్రహించివస్తే ఏ చిక్కులూ ఏర్పడవు" అంది. మా కమిస్సార్ చెప్పినట్లుకాకుండా ముప్ఫయి సంవత్సరాల రాజకీయానుభవం వున్నదానిలా కనిపించింది నాకంటికామె. జుట్టు వెనక్కిదువ్వి కొప్పుగా మడిచింది. ముఖం బలహీనంగావున్నా, కళ్లుమాత్రం ప్రకాశిస్తూ, జాలి, దయ, పట్టుదల కనిపిస్తున్నాయి. అంతరకూ ఆవేశంవల్ల చెమర్చిన ఆమె కళ్ళను చొక్కాచివరతో అద్దుకుంది. కొద్దిసేపు నిశ్శబ్దంగా వున్న తర్వాత తిరిగి మాట్లాడటం ప్రారంభించింది. "నీకు తెలియకపోదు కామ్రేడ్! పార్టీతో సంబంధం తెగిపోవటం అంత బాధాకరమైన విషయం మరొకటి వుండదు. దారంతెగిన గాలిపటంలా అయిపోయాను, జీవితం నిస్సారంగా తయారయింది. నాచుట్టూవున్న ప్రజలు క్షణం క్షణం కష్టాలలో కూరుకుపోతువున్నారు; ఎర్రసైన్యంకూడా క్లిష్టపరిస్థితుల్లోపడిపోయిందని నాకు తెలుసు: అయినాసరే తిరిగి పోరాటం ప్రారంభించాలనే పట్టుదల నాలో చావలేదు. కానీ ఎలా? పార్టీ కాంటాక్టుకోసం కళ్లు కాయలుకాచేలా ఎదురుచూశాను. ఇప్పుడు మీరు కనిపించారు. నాకు తిరిగి పార్టీతో సంబంధం ఏర్పడింది. మనం బ్రతికున్నంతవరకూ ప్రజలలో చైతన్యం వున్నంతవరకూ, మనం ఏదో

రకంగా తిరిగి ఇక్కడ ఎర్రజెండా ఎగరెయ్యగలం అనే ఆత్మవిశ్వాసం నాకుంది" ఆమె కంఠం భరించరానంత ఆనందంవల్ల వణుకుతోంది. కష్టాలలో యిరుక్కునిపోయిన ఆమెకు మనోధైర్యం కలిగించి పార్టీపని నిర్వహించేలా వప్పించమని మా కమిస్సార్ నాకు మరీ మరీ చెప్పాడు. దృఢమైన ఆవిడ వ్యక్తిత్వం, పోరాటాన్ని తిరిగి కొనసాగించాలనే ఆవిడ వజ్రసంకల్పం, చుట్టూ ఏర్పడివున్న బాధలకు పిసరంతకూడా చెక్కు చెదరకుండా ధైర్యంగావున్న ఆమెకు నేను మనోధైర్యం కలిగించే దేమిటి ? ఇంక డొంకతిరుగుడులేకుండా పార్టీ కమిటీ ఆదేశాలను ఆమెకు చెపుదామనుకుంటూండగా ఆమెమధ్యలో అందుకుని "చూడండి! మిమ్మల్ని కలుసుకున్న ఆనందంలో నేను సర్వం మరిచిపోయాను. ముందు మీకు తినేందుకు ఏమైనా ఏర్పాటుచెయ్యనివ్వ డి !" అంటూ లేచి తీపి బంగాళాదుంప ముక్కలు, క్యాబేజీ వూరగాయ, వుప్పుతో వుడకబెట్టిన క్యారట్ దుంపలు, చిక్కుళ్లు ఓ పళ్ళెంలోపెట్టి నాముందుంచింది.

"పర్వతాలనుంచి మమ్మల్ని ఇక్కడికి తరలించింతర్వాత కొమింగ్‌టాంగ్‌నిఘా ఎక్కువగావుంది అందువల్ల మీకు కొండల్లోకి ఆహారం ఏమీ పంపించలేక పోతున్నాం. మీరు భోజనంచేసి ఎన్నాళ్ళయిందో ఏమో ? నా దగ్గర మీకు పెట్టటాన్కి ఇంతకన్నా మంచి పదార్థాలు ఏమీలేవు" ఆమె కంఠంలో బాధ ధ్వనించింది.

ఆరాత్రి చాలాదూరం నడిచివుండటంవల్ల ఆకలి విపరీతంగావుంది. మాట్లాడకుండా తినటం ప్రారంభించాను. పర్వతాలమీద మాకు ఉప్పు అసలు దొరక్కపోవటంవల్ల, వుప్పుతో ఉడకబెట్టిన ఆ పదార్థాలుచూడగానే నా ప్రాణం లేచివచ్చింది. నానోటికెంతో మధురంగావున్నాయవి అవితింటూన్నంతసేపూ వుప్పుకోసం కరువు వాచిపోయిన పర్వతాల్లోని మిగతా కామ్రేడ్స్ ముఖాలు నాకంటిముందు కదులాడసాగాయి. తింటూనే మా కమిస్సార్ చెప్పిన ఆదేశాలనూ, పథకాలనూ ఆవిడకు వివరించసాగాను. శత్రువునుగురించిన సమాచారం సేకరించటం. భూస్వాములకు కౌళ్లుఇవ్వకుండా ప్రతిఘటించటాన్కి కావలసిన జనాన్ని సమీకరించటంలాంటి విషయాల్లో ఎదురయ్యే సమస్యల్నిగురించి వివరించాను ఆవిడ నేను చెప్పిందంతావింటూ మధ్యమధ్య తన అనుమానాల్ని అడిగి నివృత్తిచేసుకోవటం ప్రారంభించింది. ఆఖర్న నాతో అంది. "తిరిగి కార్యక్రమాలు కొనసాగించాలంటే కమిస్సార్ చెప్పినట్లు కష్టాలుఎదురయ్యేమాట వాస్తవమే. 1929 నుంచి నేను పార్టీకోసం పనిచేస్తున్నాను. కష్టాలుఎదుర్కోవటం ఎలాగో నేర్చుకున్నాను. కాబట్టి దాన్నిగురించి మీరేం ఆలోచించకండి. అన్ని విషయాలూ చక్కబడేలా నేనుచూస్తానుగా" ఆవిడకంఠంలో గొప్ప విశ్వాసం! అప్పగించిన పనికోసం ఎన్నికష్టాలువచ్చినా భరిస్తాను అనే దృఢదీక్ష కనిపిస్తున్నాయి. కోళ్లుకూసే

వరకూ మేం అనేక విషయాలగురించి చర్చించుకున్నాం తెల్లవారకముందే నేను ఆ ప్రదేశాన్నివదిలి వెళ్ళిపోవటం క్షేమంకరనకి బయలుదేరబోయాను. ఆవిడ తన జాకెటులో భద్రంగా దాచివుంచిన ఓ పొట్లం బయటకుతీసింది అందులో ఆవిడ పార్టీమెంబర్‌షిప్‌కార్డూ, రెండు వెండిడాలర్లూ వున్నాయి. వాటిని చేతిలోపెడుతూ ఆవిడఅంది. “నా భర్త లాంగ్‌మార్చ్‌కి వెళ్ళేముందు, ఈ రెండు డాలర్లూ ఇంటిఖర్చుకని యిచ్చి వెళ్లాడు. గత అయిదారునెలలనుంచి పార్టీసంబంధాలు తెగిపోవటంమూలానా నేను నా పార్టీ సభ్యత్వరుసుం చెల్లించలేకపోయాను. వీటికి మన కమిస్సారుకు అందచేయండి. ఈ కష్టకాలంలో కాస్త వుపయోగపడతాయి” వాటిని నేనెలా స్వీకరించను? సభ్యత్వాలు వసూలుచెయ్యమని నాకు ఆదేశాలులేవు. అదీగాక ఆవిడకు నికరాదాయం ఏమీలేదు. ఆవిడ, ఆవిడబిడ్డ ఈ కరువురోజుల్లో బ్రితకాలిమరి. పైగా ఇప్పుడు ఆమెకు అప్పగించబడిన పార్టీ బాధ్యతలు నిర్వహించాలన్నా ఆమెచేతిలో కొద్దోగొప్పో డబ్బు వుండటం అవసరంగూడాను.

“మెంబర్‌షిప్స్ వసూలుచెయ్యమని నాకు ఆదేశాలులేవు కామ్రేడ్. అందువల్ల వీటిని మీదగ్గరే వుండనివ్వండి”అన్నాను. ఆవిడ క్షణంసేపు ఆలోచించి “సరే అలాగే కానివ్వండి. వీటితో వేరే ఏదన్నా చేస్తానులెండి”అంది. ఆవిడమాటల్నిబట్టి తన సభ్యత్వపు బాకీని డబ్బురూపంలోకాక, ఏదేనా వస్తురూపేణా ఇవ్వాలనుకుంటోందని అర్థమయిందినాకు. ఏం మనిషిరాబాబూ! ఈవిడ! ఇన్నికష్టాల్లోకూడా పార్టీమీద ఆవిడ అభిమానం కాస్తకూడా చలించకపోగా, మరింత గట్టిపడింది. నా జీవితంలో నేనిలాంటి వ్యక్తిని ఇంతకుముందెన్నడూ చూడలేదు.........

* * *

ఓ పదిహేనురోజులతర్వాత మాకు తెలిసింది. కాన్‌సెంట్రేషన్ క్యాంపులో వుంటూకూడా ప్రజలు పార్టీ రహస్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని కొమింటాంగ్‌వాళ్ళు గ్రహించినట్లు. అందువల్ల పార్టీశాఖలు దెబ్బతినే అవకాశంవుందికాబట్టి, ఆ పరిస్థితుల్లో ఏంచెయ్యాలో వివరించేందుకుగాను నేను మైట్‌కార్నర్‌హాలోకి బయలుదేరాను, మాకమిస్సార్ సూచనప్రకారం. నేను కామ్రేడ్ హుయాన్-సిన్ ఇంటికి చేరగానే ఆవిడ ఇంతకుముందుచెప్పిన ప్రకారం, గోడకన్నంలోంచి లోపలకు తొంగి చూశాను ఎవరేనా కొత్త మనుష్యులు వున్నారేమోనని. లోపల ఓ చిన్నదీపం వెలుగుతోంది. కామ్రేడ్ హుయాన్-సిన్ వుడకబెట్టిన కూరగాయల్ని శుభ్రపరిచి ఓ గంపలోకి ఎత్తుతోంది. ఆవిడ తన పక్కనేకూర్చున్న కూతురుకి మాయమాటలుచెపుతూ, ఆ కూరగాయలు ముట్టుకోకుండాచెయ్యాలని ప్రయత్నిస్తోంది. “చూడమ్మ బేబీ! వీటిని

నువ్వు ఏమీ ముట్టుకోకూడదు. వీటిని బజార్లోఅమ్మి డబ్బులుతెస్తాను ఆ డబ్బుతో నీకు ఎంచక్కా గౌన్లు, రొట్టెలు కొనిపెడతాను ఏం?" అంటోంది. పసిపిల్లలు పెద్ద వాళ్ళు భరించినన్ని కష్టాలుభరించలేరు. ఆపిల్ల సన్నగా, చిక్కిపోయి, బలహీనంగా కనిపిస్తోంది. బహుశా ఆ పాపతీసుకునే ఆహారంలో నూనెగానీ, వుప్పుగానీ లేకపోవటంవల్లనేమో. వుప్పులో వుడకబెట్టిన ఆ కూరలవంక ఆశగాచూస్తూ పెదిమలు చప్పరిస్తోంది. తల్లిమాటలు ఏమాత్రం వినకపోగా, అవి తనకుకావాలన్నట్లు గౌనూ, జుట్టూ పీక్కుంటోంది. తల్లి తలవంచుకుని పనిచేసుకుంటూండగా ఆ పిల్ల మెల్లిగా రెండు చిక్కుడుకాయలుతీసి ఆతృతగా నోటిలోకుక్కుకుంది. కానీ ఈలోగా కామ్రేడ్ హుయాన్-సిన్ చూడనేచూసింది. ఆ చూపుకు హడిలిపోయి ఆ పిల్లబావురుమని ఏడ్వటం ప్రారంభించింది. అంతవరకూ చూస్తూనిల్చున్న నా హృదయం చివుక్కుమంది. ఇంకొక్క క్షణంకూడా ఆలస్యంచెయ్యకుండా తలుపుతట్టి, లోపలప్రవేశించి, కామ్రేడ్ హుయాన్-సిన్‌తో అన్నాను "మీరలా ప్రవర్తించటం ఏంబాగోలేదు కామ్రేడ్! ఆ కూరలు మీరు అమ్మటానికే తయారుచేసివుండొచ్చు. కానీ ఆ పాప కాసిని తినటంవల్ల మీకు పెద్దగా నష్టంవస్తుందని నేననుకోను. ఆ పిల్లపట్ల మీరంత కఠినంగా ప్రవర్తించటం ఏంబాగోలేదు"అన్న నా మాటలకు ఆమెబాధంగా నిట్టూర్చి సంజాయిషీచెప్పటం ప్రారంభించింది. "బంగారంకన్నా వుప్పు ప్రియంగావున్న ఈ రోజుల్లో ఈ కూరల్ని నేను అమ్మటానికే తయారు చేశాననుకున్నారా? వుప్పుకూరగాయల్ని ఎవరు అమ్ముకుంటారుచెప్పండి! మనపార్టీసభ్యులం కొందరం, మా సభ్యత్వపు బకాయీలు చెల్లించేందుకు వీటిని సమీకరించాం. ఈ విధంగా మీరూ, పర్వతాలలో ప్రజలకోసం అష్టకష్టాలూపడుతున్న కామ్రేడ్స్‌కు సహాయపడాలనుకున్నాం. అందుకే వీటిని వుప్పులోవుడకబెట్టి మీకోసం ఎదురు చూస్తున్నాం" అంది

కొంతసేపు నన్నూ తనబిడ్డనూ మార్చి మార్చి చూస్తూ "ఎంతోకాలం నుంచీ మన పార్టీ వుండటంవల్లా, కొమింటాంగ్ ఘోరకృత్యాలకు బలైపోకుండా ఎంతమంది పసిబిడ్డలు రక్షింపబడ్డారో కొంచెం ఆలోచించండి మీకే అర్థం అవుతుంది. అలాంటి పార్టీకోసం ఈ పిల్లలు ఓ రెండురోజులు భోజనంమానేస్తే కలిగేనష్టం ఏమిటో నాకు చెప్పండి"అంది మళ్ళీ. నేనాశ్చర్యపోయాను ఏమిటీ మనిషి! ఎంత వునాత్తత! ఈ లోపల కామ్రేడ్ హుయాంగ్-సిన్ కూతురు ఏడుపైతే మానేసింది కానీ ఆపిల్లచూపులన్నీ ఆ పదార్థాలమీదే వున్నాయి. నేను వెంటనే ఓ గుప్పెడు చిక్కుడుకాయలు ఆ పిల్లకు అందిస్తూ కామ్రేడ్ హుయాంగ్-సిన్‌తో అన్నాను "మీరేం బాధపడకండి కామ్రేడ్! మన కష్టాలు ఎప్పుడూ వుండేవే. కానీ పసిపిల్లలు! వాళ్ళకేం తెలుసు! నేను భోజనం లేకుండా పదిరోజులైనా ఉండగలను కానీ పసిపిల్లలు బాధపడుతూంటే

మాత్రం చూడలేను... అసలు మనంచేస్తున్న ఈ త్యాగం అంతా ఎవరికోసం? వాళ్లు సుఖంగా వుండాలనేగదా!" నేను మాట్లాడటం పూర్తికాకముందే బైట తలుపు దగ్గర ఎవరిదో పాదాలధ్వని వినిపించింది. తలుపు మెల్లగా చప్పుడుచేస్తూ "త్వరగా తలుపు తెరవండి! ఊఁ! త్వరగా" ఆత్రుతగా పిలుస్తున్నారు. కామ్రేడ్ హుయాంగ్-సిన్ తలుపుతెరిచింది నేను మొదటిసారి ఈ యింటికి వచ్చినప్పుడు హుయాంగ్-సిన్‌తో పాటు కూరలు ఏరుతూ కనిపించిన రెండో ఆడమనిషి బైట రొప్పుతూ నిలబడివుంది. "ఎలా తెలిసిందో ఏమో! కొండల్లోంచి ఎవరో కామ్రేడ్ ఊళ్లోకి వచ్చినట్లు కొమింటాంగ్ వాళ్ళకు తెలిసిపోయింది వెంటనే మీరిక్కడనుంచి వెళ్లిపోండి. ఈవిషయం మిగతా మనవాళ్ళందరికీ చెప్పి జాగ్రత్తగా వుండేలా చూసుకోవాలి. వస్తాను" అంటూ హడావిడిగా వెళ్ళిపోయిందామె ఆ మాటలు వినటంతోటే, కామ్రేడ్ హుయాంగ్-సిన్‌కు ఏ ప్రమాదంరాకుండా వుండేందుకుగాను, వెంటనే ఆ ప్రదేశం విడిచి వెళ్ళిపోవాలనుకున్నాను. కానీ ఆమె నా చెయ్యిపట్టుకుని వారిస్తూ "వాళ్లు గాలింపు ప్రారంభించారంటే ఈగకూడా వూళ్లోంచి బైటకు పోవటాన్కి వీల్లేదు. మీరు బైటకువెళ్ళటం చాలా ప్రమాదం కాబట్టి ఇక్కడే దాక్కోండి" అందామె. నిజమే ఇక్కడే దాక్కోవటం ఉత్తమం! కానీ అనుకోని పరిస్థితులు ఏమన్నా ఎదురయితే, నాతోపాటు ఆమెకూడా చిక్కుల్లో యిరుక్కుంటుంది అది నాకిష్టం లేదు, నా ముఖంలోని భావాలనుబట్టి ఆమె ఆ విషయాన్ని గ్రహించేసినట్లుంది. అప్పటివరకూ దయ వుట్టిపడుతూన్న ఆమెముఖం కఠినంగా మారిపోయింది. "రహస్య కార్యక్రిమాల నిర్వహణకోసం, క్రమశిక్షణ కోసం నేను చెప్పేది మీరు వినక తప్పదు. పార్టీకోసం మీరు బ్రతికితీరాలి" కర్కశంగా అన్నా, ఆవిడ కంఠంలో నాగురించిన ఆదుర్దా ధ్వనిస్తోంది. "ఆ అటకమీదకు ఎక్కి దాక్కోండి. క్రింద ఏంజరిగినాసరే మీరు కదలటాన్కివీల్లేదు. మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాను" అంది హుయాంగ్-సిన్. అప్పటికే బైట కోలాహలం ప్రారంభమయ్యింది. నేను అటకపైకి ఎక్కి బోర్లా పడుకుని, పైన కొన్ని చెరుకుగడలుకప్పుకున్నాను.

ఆటకచెక్కలకువున్న చిన్నసందులోనుంచి క్రిందజరిగేదంతా నాకు కనిపిస్తోంది. కామ్రేడ్ హుయాంగ్-సిన్ ఓ వెదురుజల్లెడ కూరగాయలగంపమీద మూతపెట్టి, తన కూతుర్ని ఎత్తుకుని నా వైపు తిరిగిచెప్పటం ప్రారంభించింది. "మనం ఇప్పుడు చాలా క్లిష్టపరిస్థితుల్లో యిరుక్కున్నాం కామ్రేడ్ ఛాంగ్, వాళ్ళిక్కడికి ఇంకాసేపట్లో వచ్చేస్తారు. వాళ్ళవల్ల నాకేఅపకారంజరిగినా, ఆఖరికి ప్రాణంపోయినా విచారించకండి; ఎందుకంటే నేనుపోయినా ఇంకా ఇక్కడ మన పార్టీనిర్మాణం మిగిలేవుండేలా ఏర్పాటు చేశాను. భూస్వాముల పంటలుస్వాధీనం చేసుకోవటాన్కి కావలసినఏర్పాట్లు అన్నీ

చేసేవుంచాను. ఈసారి మీరిక్కడకు వచ్చినప్పుడు ఇందాకా మనకీవార్త తీసుకొచ్చిన కామ్రేడ్ హుమింగ్‌నుకలుసుకోండి ఆవిడ వూరిచివర ఎడవువైపు నాల్గోపాకలో వుంటోంది. ఆవిడఇంటి మర్రిచెట్టువుంటుంది. అదే మీకుగుర్తు. ఇకపోతే ఏదోవిధంగా మీరీ వుప్పుకూరగాయల్ని పర్వతాలమీదకు చేర్చాలి. మా సభ్యత్వపు బకాయీలక్రింద వీటిని జమకట్టుకోమనిచెప్పండి" అంటూ ఓ క్షణం ఆగి బైటనుంచి వినపడేశబ్దాల్ని జాగ్రత్తగావిని, తిరిగి ప్రారంభించింది. ఈసారి ఆవిడకంఠం చాలా జాలిపుట్టిపడ్తోంది. "మీకు వీలుంటే నాబిడ్డను మీతోపాటు కొండల్లోకి తీసుకుపొండి లేదా ఎవరిరక్షణలో నన్నాపెట్టండి. మన ఎర్రసైన్యం తిరిగివచ్చింతర్వాత బిడ్డను వాళ్ళనాన్నకు అప్పగించండి" ఆమె నిదానంగా మాట్లాడటానిక్కి ప్రయత్నిస్తూన్నా, బాధధ్వనిస్తూనేవుంది. "మరొక్కవిషయం కామ్రేడ్! నా పార్టీకార్డూ, ఓ వెండిడాలరూ ఈ కుండలోదాచాను. వీటిని ఈసారి తప్పకుండా మన కమిస్సార్‌కు అప్పగించండి. రెండుడాలర్లలోనూ ఒకటి ఈ కూరగాయలకు కావలసిన ఉప్పుకోసం ఖర్చుచేశానని చెప్పండిసుమా!" ఆవిడ ఆ మాటలు అంటుండగానే కొమింటాంగ్ బందిపోట్లు ఇంటిముందుకు వచ్చేశారు. వెంటనే ఆవిడ తనబిడ్డను క్రిందకూర్చోపెట్టి, ఆ పిల్ల జడలువిప్పి తిరిగి తాపీగా అల్లటం ప్రారంభించింది. అటకసందులోంచి, ఏమీజరగనట్లు ప్రశాంతంగావున్న ఆమె ముఖం నాక్కనిపిస్తోంది. ఏమిటీమనిషీ? ఎంతధైర్యం! ఎంతత్యాగం! త్యాగాన్ని ఒక్క కమ్యూనిజంమాత్రమే మనుష్యులచేత చేయించగలదనే సత్యం ఈవిడనుచూస్తే నాకు నిజమనిపించింది బైటతలుపు దబదబా బాదుతూన్న శబ్దం అవుతోంది. ఆవిడ మౌనంగాలేచి తలుపుతెరిచింది. నలుగురు బందిపోట్లు త్రోసుకుంటూ లోపలకు ప్రవేశించారు. అందులోవకడు ఆమె కాలరుపట్టుకుని కొండల్లోంచివచ్చిన కమ్యూనిస్టు ఎక్కడోచెప్పమని అడుగుతున్నాడు మొరటుగా. "నాకుతెలియదు" అందావిడ తల అడ్డంగా త్రిప్పుతూ బందిపోట్లు ఇల్లంతా గాలించారు ఒక్క అటకతప్ప; వాళ్ళకు ఏమీ కనపడలేదు. ముగ్గురు బైటకునడచి వాకిలిముందు నిలుచున్నారు. నాలుగోవాడు కూడా వెళ్ళబోతూ ఆగి, కూరగాయలగంపనుచూసి, దాన్ని ఓ తన్నుతన్నాడు. కూరలన్నీ చెల్లాచెదురుగా నేలంతా దొర్లిపోయాయి. తన తుపాకి బాయ్‌నెట్‌తో వాటిని గ్రుచ్చి పరీక్షిస్తూ "ఇవన్నీ నీకెలావచ్చాయ్?" అన్నాడు. "నా స్వంతం" అందామె తొణక్కుండా. తుపాకీమడమతో ఆమెను ఓ పోటుపొడిచి "ఇవన్నీ నీ స్వంతమేనా! ఇన్నిరకాలు! నిజంచెప్పు ఈ వుప్పుకూరగాయలు నువ్వూ నీ మనుష్యులూ కొండలమీద వాళ్ళకోసం తయారుచేశారుకదూ!" అంటూ ఆ బందిపోటు నలుమూలలా పరికించి, బైటవున్న తన అనుచరులకోసం చప్పట్లుచరిచాడు. వాడికి అనుమానంవచ్చింది. అం

దుకేతన అనుచరులచేత రెండోసారి ఇల్లు వెతికించాలని వాడి అభిప్రాయంకాబోలు. ఈసారికనక వెతికితే నేను బైటపడిపోవటంఖాయం అనుకున్నాను. ఈలోగా కామ్రేడ్ హుయాంగ్-సిన్ "నీకన్నివిషయాలూ తెలిసికూడా నన్నడగటం ఎందుకూ?" అంటూ వాడిచేతిలోవున్న కాలర్ విడిపించుకుని ఒక్కపరుగున గుమ్మందాటివెళ్ళి "కామ్రేడ్ ఛెంగ్ దక్షిణదిక్కుగా పారిపో: దక్షిణదిక్కుగా పారిపో" అంటూ ఎలుగెత్తి అరిచింది. బైటవున్న ముగ్గురిలో ఇద్దరు బందిపోట్లు ఆమె అరిచినదిక్కుగా తుపాకులు వూపుకుంటూ పరుగుతీశారు. మిగిలినవాడు ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. వాళ్ళు తిరిగి ఇంటిని గాలించకుండా వుండటంకోసం ఆమె ఆరకంగా అరుస్తూ బైటపడిందని గ్రహించాను. మిగిలిన ఇద్దరూ ఆమెను ఈడ్చుకుపోతున్నారు ఆమెచేస్తున్న అంత గొప్ప త్యాగాన్ని భరించటం నావల్లకాదనిపించింది. ఎవరైతేమాత్రం కొద్దో గొప్పో త్యాగం చెయ్యగల్గుతారు కానీ ఈ మనిషి నా కోసం ప్రాణాలుబలికావించ బోతోందే: ఏమైనాసరే ఆవిణ్ణి ఆ దుర్మార్గులచేతుల్లోంచి రక్షించాలని, అటకమీదనుంచి దూకబోతూండగా ఆమె వెనక్కి తిరిగి, భయంతో గొల్లున ఏడుస్తున్న తన బిడ్డవంకచూస్తూ "పాపా! మంచిగావుంటూ అమ్మ చెప్పినట్లు ప్రవర్తించటం నేర్చుకో." అని బిగ్గరగా అరిచింది ఆ మాటలు నాకాళ్లకు బంధాలు వేశాయి. అటకదిగకుండా బలవంతాన నన్నునేను నిగ్రహించుకున్నాను. ఎంత గొప్ప సమయస్ఫూర్తి! ఆవిడ ఆఖరిసారిగా అరిచిన అరుపు నాచెవుల్లో గింగురు మంటోంది. "అమ్మ చెప్పినట్లు ప్రవర్తించు" అమ్మ అంటే ఆవిడ వాడిన అర్థం కమ్యూనిస్టుపార్టీ అని. పార్టీ నాకిచ్చిన ఆదేశం, ఆ ప్రాంతంలో తిరిగి పోరాటాలను ఆర్గనైజ్ చేయటం. "పార్టీకోసం నువ్వు బ్రతికేతీరాలి" అని ఆవిడ మరోసారి నన్ను హెచ్చరించిందన్నమాట.........

ఆ సాయంకాలం గ్రామంలో పరిస్థితులు చక్కబడ్డతర్వాత అటకదిగి, కామ్రేడ్ హుయాంగ్-సిన్ బిడ్డను ఏడ్వకుండా సముదాయించి ఓ గంపలో కూర్చోపెట్టాను నేలమీద చెల్లాచెదురైపోయిన కూరగాయల్ని మరో గంపలోకి ఎత్తాను. కామ్రేడ్ హుయాంగ్-సిన్ పార్టీ కార్డూ, డాలరూ జేబులో పెట్టుకున్నాను. ఓ బొంగుముక్కకు ఆ రెండు గంపల్ని చెరోవైపునా తాళ్ళతో కావిడిలాకట్టి భుజానవేసుకుని చీకటిలో కొండలవైపు నడవసాగాను.

*　　　　*　　　　*

నేను ఆ గ్రామానికి వెళ్ళిందగ్గరనుంచి ఇప్పటివరకూ జరిగిన సంగతులన్నీ ఏకరువుపెడుతూవుంటే మా కమిస్సార్ వింటూ, కామ్రేడ్ హుయాంగ్-సిన్ కూతురి తల నిమురుతూ విచారంగా వుండిపోయాడు. ఆయనకళ్ళలో శత్రువుమీద విపరీతమైన కసీ పార్టీకోసం బలైపోయిన కామ్రేడ్ హుయాంగ్-సిన్ కోసం విచారం కనిపిస్తున్నాయి.

జేబురుమాలుతో కళ్లు తుడుచుకుని, అలవాటు ప్రకారం మెంబర్‌షిప్ పుస్తకం తెరిచి వ్రాయసాగాడు.

"దీ. 21–10–1934 తేదీన కామ్రేడ్ హుయాంగ్-సిన్ తన సభ్యత్వ రుసుము బకాయిక్రింద చెల్లించిన మొత్తం..........."

అంతవరకూ వ్రాసి ఆగిపోయాడు. ఆ తర్వాత ఆయన కలం మరిముందుకు కదలలేదు. ఆయన ముఖంలో ఎప్పుడోకాని కనిపించని గంభీరత అలుముకుంది. కామ్రేడ్ హుయాంగ్‌సిన్ పార్టీకార్డు వంకా. వెండి డాలరు వంకా. ఆమె పంపిన కూరగాయలవైపు. ఆమె బిడ్డవైపు చూస్తూవుండిపోయాడు. కామ్రేడ్ హుయాంగ్-సిన్ తన సభ్యత్వ బకాయ క్రింద ఎంత మొత్తాన్ని చెల్లించిందో ఆయన ఆ తర్వాత ఎప్పుడూ ఆ వాక్యాన్ని పూర్తి చెయ్యనే లేదు.

నిజమే! గంపడు వుప్పు కూరగాయలకయితే వెలకట్టగలం: కానీ పార్టీకోసం ఆమె చూపించిన విశ్వాసానికి ఏం వెలగట్టగలం? పార్టీకోసం కమ్యూనిస్ట్‌గా ఆవిడ చేసిన త్యాగానికి ఏం ఖరీదుకట్టమంటారు ?

'నయాజారులు' 'పాతజారుల' అభిమానిని తరిమివేశారు

మూలం: "రివల్యూషన్" పత్రిక, అమెరికా - ఆగస్టు 74

ఫిబ్రవరిలో సోవియటు రివిజనిస్టులు అలెగ్జాండరు 'సోల్జెనిత్సేన్' అనే రచయితను తమ దేశం నుండి బయటకు తరిమివేశారు రష్యాలోని పాలనా యంత్రాంగాన్ని సోల్జెనిత్సేన్ అనేక ఉపన్యాసాల్లో 'విమర్శించాడ'ని ఇతనిపైగల ఆరోపణ. దీన్ని ఆసరాగా తీసుకొని, అమెరికా సామ్రాజ్యవాదులు, యూరపులోని వీరి మిలాఖత్‌దారులు సోల్జెనిత్సేనును గొప్ప 'హీరో'గా చిత్రించి ఇటీవల ప్రచారంచేస్తున్నారు. సోల్జెనిత్సేను ప్రతిభ (image) ను పెంచటానికి, ఈ "కమ్యూనిజం ఎలా విఫలమౌతుందో" నిరూపించటానికి ఈ సంఘటనపై గొంతులు చించుకొంటున్నారు.

అసలు ఈ సోల్జెనిత్సేన్ ఎవరు ? అతడు దేనికి ప్రాతినిధ్యంవహిస్తున్నాడు ? సామ్రాజ్యవాద 'బాకాగాళ్ళ' నోళ్ళలో ఈ విధంగా ఎందుకు పొగడబడుతున్నాడు ? సోవియటు అధికారుల కోపానికి ఎందుకు గురి అయ్యాడు ? అనే విషయాలు మనం పరిశీలించుదాం.

అమెరికా రష్యాలు నిరాయుధీకరణ సంధి (Deten'te) కి రావటం చాల పెద్ద విషయమని భావించే సోవియటు మేధావుల గ్రూపుకు చెందినవాడు ఈ సోల్జెనిత్సేన్.

సోవియటు ప్రజల హక్కులను కాలరాస్తున్న సోవియటు నిరంకుశపాలకులపై నానాటికి పెరుగుతున్న అంతర్జాతీయ ఒత్తిడి ఈ సంధివలన తగ్గిపోతుందేమోనని వీరి భయం. ఈ సంధిలోని అంశాలకు హద్దులుండాలని భావించే అమెరికా పాలకవర్గంలోని కొందరు వీరి భయాన్ని, సోల్జెనిత్సేను నిర్బంధ ప్రవాసాన్ని తమ అటలో పాచికగా వాడుకొంటున్నారు. వీరెవరయ్యా అంటే— అణ్వాయుధాలను, పెద్ద ప్రమాణాలు కలిగిన సాంప్రదాయక విమానాలు మొదలుగాగల ఆయుధాల నుత్పత్తి చేసే సంస్థలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయవేత్తలు. ఈ నిరాయుధీకరణ సంధిలోని అంశాలకు హద్దూ-పొద్దూ లేకుండావుంటే, ప్రభుత్వంతో చేసుకొనే కంట్రాక్టులు, తద్వారావచ్చే లాభాలు ఈ కంపెనీలకు తగ్గిపోతవి కదా!

మరోవైపు Deten'te వ్యూహానికి కీలకపురుషుడైన స్టేట్ సెక్రటరీ కిసింగరు లాంటి "ప్రముఖ వ్యక్తుల" అభిప్రాయమేమంటే— నేడు అణ్వస్త్రాల యుద్ధమంటే ప్రజల్లో పెరుగుతున్న తిరస్కారభావం కారణంగా ఈ సంధి అవసరము వచ్చిందని, ఈ సంధి చేసుకొన్నంతమాత్రాన సోవియటులోని సామాజిక వ్యవస్థను, దేశాంగ విధానాన్ని మనం అంగీకరించినట్లు కాదని— సమర్థించుకొంటున్నారు.

ఇంతమాత్రాన, అమెరికా పాలకవర్గంలో- అణ్వస్త్రయుద్ధాన్ని కావాలనేవారు, వ్యతిరేకించేవారుగాగాని- రష్యాతో సంధిని బలపర్చేవారు, వ్యతిరేకించేవారుగాగాని- రెండు గ్రూపులుగా చీలిపోయారని అర్థం కాదు. అమెరికాలోగాని ప్రపంచంలోని అణగారిన పీడితప్రజల పోరాటాలను ఎంత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా అణచివేసినా, అది న్యాయసమ్మతమేనని పాలకవర్గంలోని వీరందరూ సమర్థించేవారే. కాని ఆచరణలో ఏయే ఎత్తుగడలనవలంబించాలి అనే విషయంలో తేడాలున్నాయి. వివిధ మిలిటరీ వ్యూహాలపై ఎంత వరకు ఆధారపడాలి? దోపిడీలోని లాభాల్లో ఎక్కువ భాగం పాలకవర్గంలోని ఏ ముఠా ఎక్కువ అనుభవించాలి? ప్రపంచంలోని ఏ ఏ ప్రాంతాలు పెత్తనానికి, దోపిడీకి కీలకపాత్ర వహిస్తాయి? రష్యాతో డిటెంట్ ఎంత వరకు కొనసాగించాలి? ఏ ఏ పరిస్థితుల్లో న్యూక్లియర్ ఆయుధాలను వాడాలి? ఏ పరిస్థితులో న్యూక్లియర్ ఆయుధాలను చూపించి బెదిరించాలి?— ఇలాంటి అనేక విషయాలపై విభిన్న అభిప్రాయాలు కలిగినవారు పాలకవర్గంలో వున్నారు.

ప్రపంచ ప్రజల పోరాటాలను అణచివేయటానికి సోషలిజానికి వ్యతిరేకంగా విప్లవ ప్రతిఘాత చర్యలు తీవ్రతరం చేయటానికి అమెరికా సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు దగ్గరకు చేరి అంగీకారానికివస్తూనే— మరోవైపు సోవియట్ పాలకముఠాపై నానాటికీ పెరుగుతున్న అసంతృప్తిని, అసహ్యాన్ని ఆసరాగాతీసుకొని సోవియట్ సోష

ల్ సామ్రాజ్యవాదంపై నైతికంగా దాడిచేయటానికి, ఇంకా ముందుకుపోయి విప్లవాన్ని సోషలిజాన్ని అపనిందలపాలు చేయటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

సోల్జెనిత్సేన్‌లాంటి వ్యక్తులను పోషించి, ప్రచారంచేసే ఈ దేశంలోని పాలక వర్గ ప్రముఖులు సోవియట్ యూనియను చూపించి— "కమ్యూనిజం చాల ఘోరమైన సామాజిక విధానమని" ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. కాని ఈ దుష్ప్రచారం అమెరికా రష్యాల మధ్యగల సంబంధాలు జెడిసికొడతాయేమోననే భయంతో జాగ్రత్తగా అంచనావేసి వాడుతున్నారు. కనుక ప్రపంచంలోని వివిధ దేశాలు జాతులు, ప్రజలు తమ స్వాతంత్ర్యంకోసం, విముక్తికోసం, సోషలిజంకోసం, సాగించే పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయటానికి సోవియటు సోషల్‌సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అవుతూనే, మరోవైపు పలుకుబడి ప్రాంతాలకోసం సోవియట్ యూనియన్‌తో పోటీపడుతున్న— అమెరికా జనరల్ పాలసీలో భాగంగానే సోల్జెనిత్సేన్ ఉదంతం ఇమిడివుంది.

రష్యాలో పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ

సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ అధికారంలోకి వచ్చినప్పటినుండి పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరింపబడింది. పెట్టుబడిదారీ. సామ్రాజ్యవాద దేశాల లక్షణాలైన నోట్ల ముమ్మరం, నిరుద్యోగం, జాతుల అణచివేత, స్త్రీపురుషులమధ్య అసమానత, దురాక్రమణ, ఇతర దేశాలతో యుద్ధాలు— లాంటి అనేక దుష్ఫలితాలు, దుర్భర పరిస్థితులు నేడు రష్యాలో మనకు కనపడతాయి.

సోవియటుపార్టీ బూర్జువా పార్టీగానూ, సోవియటు రాజ్యాంగం బూర్జువా నియంతృత్వంగా మార్చబడడంతో, నేడు సోవియటు పాలనాయంత్రాంగం ఫాసిస్టు నియంతృత్వంగా మారిపోయింది. ఇంతకుముందు రష్యాలో వున్నది కొద్దిమంది కాపిటలిస్టు దోపిడీగాళ్ళపై అత్యధిక ప్రజల నియంతృత్వం. కార్మికవర్గం, దాని పార్టీ నియంతృత్వం. కాని నేడో ? దానికి విరుద్ధంగా కొద్దిమందిగావున్న కాపిటలిస్టుల లాభాల కొరకు ప్రజాస్వామ్యాన్ని దోచుకొని, పాలించే యంత్రాంగంగా- పార్టీలోనూ పాలనా యంత్రాంగంలోను అధికారాన్ని చేజిక్కించుకొన్న ఉన్నతాధికారుల, బ్యురోక్రట్ల యంత్రాంగంగా మార్చివేయబడింది.

వివిధ రంగాలలో వివిధవర్గాలకు చెందిన సోవియట్ ప్రజలు ఫాసిజానికి వ్యతిరేకంగా సమ్మెలు, ప్రదర్శనలు ఇంకా అనేక నిరసనచర్యలద్వారా ప్రతిఘటించుతున్నారు. బూర్జువా శక్తులు పార్టీనాయకత్వాన్ని వశపర్చుకొన్నాయని, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరింపబడిందని, ఇవే నేటి దోపిడీకి అణచివేతకు కారణాలని సోవియటు ప్రజలకు

తెలియజెప్పటానికి, ఈ పాలక ముఠాను కూలద్రోసి దానిస్థానంలో శ్రామికవర్గ నియంతృత్వాన్ని తిరిగి నెలకొల్పటానికి ప్రజలను పోరాటాల్లోకి ఆర్గనైజుచేయటానికి సోవియటు యూనియన్‌లోని మార్క్సిస్టు-లెనినిస్టు శక్తులు రహస్యంగా సంఘటితమైనాయి. రహస్యపోలీసులకు వీరి ఆచూకీ తెలిసినప్పుడల్లా, ఈ మార్క్సిస్టు-లెనినిస్టులను తమ ఫాసిస్టు నిర్బంధానికి, చిత్రహింసలకు, భీభత్సానికి, పైశాచిత్వానికి గురిచేస్తున్నారు. "సోల్జెనిత్సేన్ రకం"లా వీరిని ఏమాత్రం సహించటంగాని, వదిలివేయటంగాని జరగటం లేదు.

సోషలిజానికి బద్ధశత్రువు - సోల్జెనిత్సేన్

సోల్జెనిత్సేన్ వాస్తవంగా మొదటినుండి సోషలిజానికి బద్ధశత్రువుగానే వున్నాడు. (లెనిన్ మరణానంతర) స్టాలిన్ నాయకత్వంలో రష్యాలో సోషలిస్టు సమాజ నిర్మాణం జరుగుతున్నసమయంలో, సోల్జెనిత్సేన్ కార్మికవర్గంయెడల, సోషలిస్టు సమాజంయెడల తనకున్న కసిని, అసహ్యాన్ని కొంతకాలం దాచుకోవలసివచ్చింది. ఆరోజుల్లో సోషలిజాన్ని 'బలపరచటం' పేరిట 'విమర్శలు' చేస్తూండేవాడు.

జారు నిరంకుశ పాలన నుండి భూస్వాముల పెట్టుబడిదారుల ఘోరమైన దోపిడీ నుండి అనంత త్యాగాలుచేసి తమ విముక్తిని సాధించిన సోవియటు కార్మికవర్గం, జారు పాలన గూర్చి బంగారు కలలుకనే వారినికాని, ఆ రోజులు తిరిగిరావాలని చెప్పే బహిరంగ ఆర్గనైజేషన్లుకాని, బోధనలుగాని సహించే స్థితిలో లేదు ఆనాడు:

రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో, సోవియట్ సైన్యంలోకి అధికార పదవులలోకి ఎగబ్రాకిన సోల్జెనిత్సేన్‌లాంటి చీడపురుగులు- నాజీలు, దాని ఫాసిస్టు తొత్తులను ప్రతిఘటిస్తూ సోవియట్ యూనియన్ జీవన మరణ పరిస్థితుల్లో పోరాడే సమయంలో- స్టాలిన్‌కు కార్మికవర్గ రాజ్యాంగయంత్రానికి వ్యతిరేకంగా విషప్రచారాన్ని ప్రోత్సహించారు. ఈ విద్రోహానికి సోల్జెనిత్సేన్ 8 సంవత్సరాలపాటు జైల్లో బంధింపబడ్డాడు. కాని అతని విద్రోహానికి ఇది చాల ఉదారమైన, తక్కువ శిక్ష!

విప్లవ ప్రతీఘాతుక సాహిత్యం

సోల్జెనిత్సేన్ 'సాహిత్య రచనల'ని పిలువబడేవన్నీ అతని జైలుజీవితం, విప్లవ ప్రతీఘాతుక కుట్రలకు పరిమితమైనవే అతని రచనలలో, ఇటీవల వెలువడిన (The Gulage Archipelago-1918-1950) తో సహా, అన్నిటిలో నాజీలవైపుకు ప్లేటుఫిరాయించిన వ్యాసోవ్ అనే సోవియటుజనరలును బహాటంగా సోల్జెనిత్సేన్ సమర్థిస్తాడు. యుద్ధంలో పోలెండు దేశస్త్రీలను మానభంగంచేసిన రష్యన్ సైనికులను జైలులో నిర్బంధించినందుకు, స్టాలిన్‌ను సోల్జెనిత్సేన్ విమర్శించాడు.

అతని రచనలన్నీ మనంచూస్తే- రష్యావిప్లవానికి ముందున్నరోజులకోసం ఆస హనంతో నిరీక్షిస్తున్నట్లు, జాతుల అణచివేయటంలోనూ, రష్యాప్రజలనణచివేయటంలో దారుణానికి, క్రూరత్వానికి ప్రపంచ రికార్డుసృష్టించిన జారుపాలనలోని జీవితంకోస తహ తహలాడటం మనకు కొట్టొచ్చినట్లు కన్పడుతుంది. మురికిగుంటలోని కుళ్ళునూ, ప్రే మించే సోల్జెనిత్సేన్‌లాంటి ఈ అభివృద్ధి నిరోధకులు అందుకనే జారుపాలనను 'స్వర్ణ యుగంగా' చిత్రించారు.

ఇక్కడే మరోప్రశ్న వుదయిస్తుంది. సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరింపబడితే. ఇప్పుడు 'నయాజారుల'పాలనలోవుంటే, జారుపాలనను కాంక్షించే సోల్జెనిత్సేనుకు నేటి సోవియటుపాలకులకు మధ్య ఘర్షణ ఎందుకువచ్చింది?

చరిత్రను పరిశీలిస్తే, స్టాలిన్‌పైన శ్రామికవర్గ నియంతృత్వంపైన నీచమైన దాడులు చేయటానికి కృశ్చేవ్ మొదట్లో సోల్జెనిత్సేన్‌లాంటి విద్రోహులను పైకితీసుకు వచ్చి వారిని సిద్ధాంత సాంస్కృతిక రంగాలలో వాడుకొన్నాడు. స్టాలిన్‌ను 'నియంత' అని, 'పిరికివాడ'ని 'మూర్ఖుడ'ని సిగ్గువిడిచి ఒకవైపు వాగుతూనే, మరోవైపు "స్టాలి నిజంలోని భయంకరదినాలు"అని సోల్జెనిత్సేన్‌వ్రాసిన (One day in the life of Ivan Denisovich) అనే పుస్తకాన్ని, కథలను సోవియటు యూనియన్‌లో పబ్లిష్ చేయించాడు. దాంతో సామ్రాజ్యవాదులనుండి, అప్పటివరకు పోరాటంలోనూ, పార్టీ లోనూ దాగివున్న ట్రాట్స్కీ అనుచరులవరకు గల సోషలిజం, కార్మికవర్గపాలనకు బద్ధశత్రువులయిన విప్లవ ప్రతిఘాతుక కుట్రదారులందరూ తమ ముసుగులుతీసిపారేసి. కమ్యూనిజానికి వ్యతిరేకంగా జరిగేకుట్రలో బహాటంగా పాల్గొనటానికి, సోవియట్ యూనియన్‌లో కాపిటలిజం పునరుద్ధరించటమనే "పవిత్రకార్యం" లో ఈ కుట్రదారు లందరూ శక్తి వంచనలేకుండా పనిచేశారు.

భీభత్సం - అణచివేత

సోవియటు యూనియనులో అణచివేత, భీభత్సం స్టాలిన్‌కాలంలో అమలులో పెట్టబడింది. కాని పాత, నయాజారుల పాలనలోవలె ప్రజానీకంపైగాక, పూర్వపు దోపిడీగాళ్ళమీద నిర్బంధం ప్రయోగింపబడింది. సోషలిజం నిర్మాణంలో కార్మికవర్గ అధికారాన్ని బలపరచటానికి, పెట్టుబడిదారీవిధానం పునరుద్ధరణను నివారించటానికే ఇది వుద్దేశింపబడింది.

సమాజంలో రెండురకాల ప్రజాస్వామిక నియంతృత్వాలున్నాయి, 1. అసం ఖ్యాక ప్రజలకు ప్రజాస్వామ్యం. కొద్దిగానున్న దోపిడీగాండ్రపై ఈ అత్యధిక ప్రజల

నియంతృత్వం. 2. కొద్దిగానున్న ఈ దోపిడీగాళ్ళకే ప్రజాస్వామ్యం అసంఖ్యాక కార్మిక ప్రజలపై అమానుష నియంతృత్వం. సమాజం వర్గాలుగా విభజింపబడివున్నంత కాలము, పెట్టుబడిదారీ విధానంనుండి కమ్యూనిజంలోకి పరివర్తనచెందే ఈ కాలమంతటిలో పై రెంటిలో ఏదో ఒకటే ఆచరణలో వుంటుంది. కార్మిక నియంతృత్వం ఏర్పాటుకు, దాన్ని పటిష్టంచేయటానికి జరిగే పోరాటంపై దాడిచేయటమన్నా, నీళ్ళుగార్చటమన్నా, అంటే అర్థం కొద్దిగానున్న దోపిడీగాళ్ళ నియంతృత్వాన్ని ఏర్పాటుచేయటానికి బలపడటానికి దోహదంచేయడమే సమాజగతి చక్రాలను వెనక్కు మళ్ళించటమే. వేలాది ప్రపంచ శ్రామికులు తమ రక్తాన్ని ధారపోసిగడించిన గుణపాఠమిది.

సోవియట్ యూనియన్ వునికిలోకివచ్చిన రోజునుండి, విప్లవ ప్రతిఘాతుకుల నణచివేయటం అత్యంతవసరమయ్యింది. కార్మికుల ఈ నూతనరాజ్యాన్ని రూపురేఖలు లేకుండా నాశనంచేయటానికి, రష్యాలోని భూస్వామ్య పెట్టుబడిదారీవర్గాలతో మిలాఖత్ అయి అమెరికాతోసహా 14 సామ్రాజ్యవాదదేశాలు, రష్యాను చుట్టుముట్టి, దాడిచేసినప్పుడు, విప్లవ ప్రతిఘాతుక కుట్రదారుల నణచవలసిన అవశ్యకత యింకా ఎక్కువయ్యింది.

1937లో సోవియట్ యూనియన్‌పై హిట్లరు దాడికి సిద్ధమయినప్పుడు, మిగిలిన సామ్రాజ్యవాదదేశాలు ఈ కుట్రలో హిట్లరుకు ప్రోత్సాహించినప్పుడు, రష్యాలోని అభివృద్ధి నిరోధకశక్తులు నాజీలతో చేతులుకలిపి తమ విప్లవ ప్రతిఘాతుక కుట్రలన్నిటినీ పెద్దఎత్తున ఉధృతంచేశాయి. శ్రామికవర్గ పరిపాలన పటిష్టంచేయాలన్నా, సోషలిస్టు సమాజ నిర్మాణం కొనసాగించాలన్నా, ఫాసిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా దేశ రక్షణను పటిష్టంచేయాలన్నా, పై విద్రోహశక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేయకుండా, పార్టీనుండి, పాలనా యంత్రాంగంనుండి ఈ చీడపురుగులను పెకలించి పారవేయకుండా సోవియటు యూనియన్ అస్తిత్వమే అసాధ్యమయిన పరిస్థితి యేర్పడింది.

ఈశోధనా కార్యక్రమమంతా ఉక్కుమనిషని మన్ననలుపొందిన స్టాలిన్ నాయకత్వంలో విజయవంతంగా కొనసాగింపబడింది. ఆయన సమర్థవంతమైన నాయకత్వంక్రింద రెండవ ప్రపంచయుద్ధంలో ఫాసిస్టుకూటమిని చిత్తుచిత్తుగా ఓడించి, ప్రపంచ ప్రజల అశాజ్యోతిగా, మార్గదర్శిగా సోవియట్ యూనియన్ ముందుకువచ్చింది.

కొన్ని పొరపాట్లు

విప్లవ ద్రోహులను నిర్దాక్షిణ్యంగా అణచటంలో తప్పులేమైనా కొన్నిజరిగినవా? పార్టీనుండి, పాలనాయంత్రాంగంనుండి ఈ చీడపురుగులను పెకలించివేయటంలో అతిగా

(Exeess) ఎక్కడన్నా జరిగినవా? నిస్సందేహంగా కొన్ని జరిగాయి. స్టాలిన్ అతిగా జరిగిన కొన్ని పొరపాట్లను తనంతతానే గుర్తించి, విమర్శించాడు.

స్వదేశీ, విదేశీ అభివృద్ధినిరోధకుల కుట్రలను భగ్నంచేస్తూ, కార్మికవర్గ పరిపాలనను రక్షించడం, పటిష్టంచేసే క్రమంలో పైతప్పులు, ఆనాటికి ఇంకా పూర్తిగా గుర్తింపబడని తప్పులు జరిగాయి. అంతర్జాతీయ కార్మికవర్గం తమ పొరపాట్లను పరిశీలించి గుణపాఠాలు నేర్చుకొనేటప్పుడు, కమ్యూనిజం వైపు పురోగమించటానికై దోపిడీదారులను కూలద్రోయటం, అణచివేయటమనే చారిత్రక క్రమంలోనే ఈ తప్పులు దొర్లాయిగాని స్టాలిన్ కక్షతో వ్యక్తిగత ప్రత్యర్థులను అణచివేయటానికి చేయలేదనే వాస్తవాన్ని గుర్తుంచుకొంటారు.

ఈ సందర్భంలోనే, సోల్జెనిత్సేన్‌వంటి 'పంచమాంగ దళాలు' కార్మికవర్గ పాలనను, వారి నాయకత్వాన్ని విమర్శించటానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకో ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు శత్రువుతో సిగ్గువిడిచి చేతులుకలిపి వారిని సమర్థించే నీచస్థితికికూడ దిగజారిపోయారు. దీనితో ఆగక సోల్జెనిత్సేన్ స్టాలిన్‌కు వ్యతిరేకంగానే కాక, ఇంకా ముందుకుపోయి లెనిన్‌ను, సోవియట్ యూనియన్‌లోని సోషలిస్టువిప్లవాన్నే కించపర్చటానికి, అపనిందలపాలుచేయటానికి పూనుకొన్నాడు. దీనితో వాడి అసలు స్వభావం పూర్తిగా బట్టబయలయింది.

సోవియటు యూనియన్‌లోని ఈనాటి పాలకవర్గంయొక్క అసహనానికి, కోపానికి సోల్జెనిత్సేన్ గురికావటానికికూడ ఇదే ప్రధానకారణం. ఈ నాయకులూ బూర్జువా లీడర్లే. కాని వీళ్ళు సోషల్‌సామ్రాజ్యవాదులు. అంటే మాటల్లో సోషలిజం, ఆచరణలో సామ్రాజ్యవాదమన్నమాట. అందుకనే తమ సామ్రాజ్యవాద పథకాలను కొనసాగించాలంటే, స్వదేశంలోని, విదేశాలలోని ప్రజలను తాము సోషలిస్టులమేనని చెప్పి మోసగించాలంటే, ఆయాదేశాలప్రజల కోర్కెలకు ప్రాతినిధ్యంవహిస్తున్నట్లు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సోషలిజంకోసం వారు జరిపే పోరాటాలను బలపరుస్తున్నట్లు కన్పిస్తూనే వారిని దోపిడీచేయాలంటే– ఈ విప్లవద్రోహులకు లెనిన్ అనుచరులమనే ముసుగు చాల అవసరం. తమ ముసుగు బయటపడకుండా తమస్థితి దిగజారిపోకుండా వుండటానికి లెనిన్‌ను, సోవియటు విప్లవ చరిత్రను తమ పథకాలకనుగుణంగా ప్రజలు తెలుసుకోలేనట్లు వక్రీకరించే సిద్ధాంతవేత్తలు వీరికికావాలికాని, బహిరంగ విమర్శకులు కాదు కావలసింది.

లెనిన్ రచనల వక్రీకరణ

లెనిన్ రచనలను, ఆయన విప్లవాత్మకపాత్రను సోల్జెనిత్సేన్‌వంటి 'జారు చక్రవర్తుల గులాముగాళ్ళు' వక్రీకరించారు. సామ్రాజ్యవాద దురాక్రమణలను, యుద్ధాలను

వ్యతిరేకించాలని చెప్పిన లెనిన్ రచనలకు బూర్జువా ప్రవక్తల శాంతివచనాలకు పోలిక వున్నదని కనుక న్యాయమైన ప్రజా ప్రతిఘటన యుద్ధాలతోసహా అన్ని యుద్ధాలను వ్యతిరేకించాలని; ప్రపంచవ్యాపితంగాకలిగే పీడిత ప్రజల విప్లవపోరాటాలను సమర్థించుతూ లెనిన్ శ్రామికవర్గ అంతర్జాతీయత పేర ఆయా దేశాల ప్రజలపై సోవియటు పెత్తనాన్ని ప్రచారంచేయటానికి ప్రయత్నించాడని వక్రీకరించి లెనిన్‌పై దుమారాన్ని లేపారు.

అంతేకాక, అంతర్జాతీయ పెత్తనంకోసం రెండు అగ్రరాజ్యాలమధ్య జరుగుతున్న పోటీలో సోల్జెనిత్సేన్ సోవియటు సోషల్ సామ్రాజ్యవాదంతోకాక, అమెరికా సామ్రాజ్యవాదుల కొమ్ముకాశాడు రెండు అగ్రరాజ్యాలు ఒకదానితో ఒకటి మిలాఖత్ అయినా అమెరికాదే పైచేయి కావాలని. అమెరికాచెప్పినట్లు రష్యావినాలని ప్రచారంలో పెట్టాడు. సోవియటు నయాజారులతో సోల్జెనిత్సేన్ చిక్కులు కొనితెచ్చుకోటానికి ఇది మరో ప్రధాన కారణం.

ఇదేసమయంలో సోవియటు పాలకులు, దాని తోకలయిన "అమెరికా కమ్యూనిస్టు పార్టీ (C.P.U.S.A.)" సోల్జెనిత్సేన్‌పై కుప్పలు కుప్పలుగా విమర్శలను, నిందలను కురిపించారు కాని సహజంగానే, వారి విమర్శల్లో తమ బూర్జువా స్వభావాల్ని కప్పిపెట్టుకోలేకపోయారు ఉదాహరణకు "అమెరికా కమ్యూనిస్టుపార్టీ" తన వార్తాపత్రిక (Daily World) ఫిబ్రవరి సంచికలో అనేక వ్యాసాలను ప్రచురించింది. స్టాలిన్‌ను నిందించినందుకు సోల్జెనిత్సేన్‌ను ఈ వ్యాసాల్లో తీవ్రంగా విమర్శించారు. కాని సోల్జెనిత్సేన్ శ్రామికవర్గ నియంతృత్వంపై దాడిచేశాడనిగాదు వీరి విమర్శ. చచ్చినపామును ఇంకా చావకొడుతున్నాడట. అంటే 'అమెరికా కమ్యూనిస్టుపార్టీ' దృష్టిలో "ప్రజలు ఏనాడో మరచిపోయిన" స్టాలిన్‌ను మరల బయటకుతీసి విమర్శిస్తున్నందుకేనట వీరిబాధ. మరోవైపున, స్టాలిన్‌పైన, శ్రామికవర్గ నియంతృత్వంపైన ఈనాటికికూడ దాడిచేస్తూ, సోల్జెనిత్సేన్‌లాంటి ద్రోహులను మించిపోయిన ఈనాటి సోవియట్‌నాయకుల బండారాన్ని కప్పిపుచ్చటానికి (CPUSA) శాయశక్తులా ప్రయత్నించింది.

ఇంతేకాక, విప్లవాలను అణచివేయటానికి ప్రపంచ ప్రజలపై పెత్తనం చెలాయించటానికి. దోపిడీ కొనసాగించటానికి, అమెరికా తోడుదొంగగామారిన సోవియటు సోషల్ సామ్రాజ్యవాదుల ఆశలను, డిటెంటును వ్యతిరేకిస్తున్నందుకు (Daily world) సోల్జెనిత్సేన్‌ను తీవ్రంగా విమర్శించింది.

ఫాసిజం దాని స్వభావం

నాజీలతో చేతులుకలిపిన సోల్జెనిత్సేనును సమర్థిస్తూన్న (Newyork Times) ఎడిటర్లను బుజ్జగిస్తూ బూర్జువాలమీద వారి సిద్ధాంతాలమీద తమకుగల అపారమైన భక్తిని CPUSA వెళ్లబుచ్చుతోంది. సోషలిజానికి వ్యతిరేకంగా ఫాసిజంతో చేతులు కలిపేటంతటి తీవ్రమైన అసహ్యం, కసి సోషలిజంమీద మీకువుందా"అని CPUSA పై ఎడిటర్లను బ్రతిమాలుతోంది.

'మామూలు పరిస్థితుల్లో' ప్రజాస్వామ్యంపై బూర్జువాలువిధించే నిర్బంధంకన్నా మరంత నగ్నంగా, భీభత్సంగా, బాహాటంగా ఉపయోగించేపెట్టుబడిదారీ నియంతృత్వమే ఫాసిజమని నిజమైన కమ్యూనిస్టు ప్రతిఒక్కడికీ తెలుసు. సోషలిజాన్ని అరికట్టటానికి తమదేశంలో, అవసరమైతే ఫాసిస్టు పాలనను నెలకొల్పటాన్ని, అలాగే సోషలిస్టు దేశంపై ఫాసిస్టుదేశాలదాడిని The New York Times లాంటి కాపిటలిస్టు పాలక వర్గాల ప్రతినిధులు తప్పకుండా బలపరుస్తారు. తద్వతిరేకంగా ఎప్పుడైనాజరిగితే, తమ సామ్రాజ్యవాద స్వంతప్రయోజనాల దృష్ట్యానే అలాజరుగుతుంది. ఇదికూడ తాత్కాలికంగామాత్రమే. రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో 'ప్రజాస్వామ్యదేశాల'ని చెప్పబడే అమెరికాలాంటి సామ్రాజ్యవాద దేశాలు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఫాసిస్టుకూటమిని పొదిగి పెద్దచేసినాయి. కాని ఈ ఫాసిస్టుకూటమి తమ స్వంత ప్రయోజనాలకే ప్రమాదం తెచ్చేటప్పటికీ, సోవియటు యూనియన్, ఇతరదేశాల్లోని విప్లవోద్యమాలతో ఈ "ప్రజాస్వామిక సామ్రాజ్యవాదులు" తప్పనిసరిగా సంధిచేసుకోవల్సిన అగత్యంపట్టింది. అంతమాత్రాన సామ్రాజ్యవాదులు "ఫాసిస్టు వ్యతిరేక స్వభావం" కలిగివుంటారని ఎప్పుడూ కలలోకూడ ఊహించకూడదు. అంతర్జాతీయ కార్మికవర్గం, ప్రత్యేకంగా సోవియటు యూనియన్ కార్మికవర్గం అంతులేని రక్తాన్ని మూల్యంగా చెల్లించి గడించిన గుణపాఠంయిది.

కాని ఈనాడు సోవియటు పాలకవర్గాలు, CPUSA లాంటి దాని భజంత్రీగాళ్ళు ఈ గుణపాఠాలను కప్పిపెట్టాలని, రష్యా విప్లవచరిత్రనంతా తారుమారుచేయాలని ప్రయత్నిస్తున్నారు.

కాని ప్రపంచంలో ప్రప్రథమ సోషలిస్టుదేశపు వున్నతాదర్శాన్ని, అంతర్జాతీయ శ్రామికవర్గ పోరాట అనుభవాలను, సోవియటు ప్రజలుగాని, ప్రపంచ ప్రజానీకంగాని మరచిపోలేరు. సోవియటు ప్రజలు నయాజారులచే అణగదొక్కబడిన వివిధ దేశాలప్రజలు ఈ అభివృద్ధినిరోధక పాలనను వీరోచితంగా ప్రతిఘటిస్తున్నారు. సోవియట్ యూనియన్‌లోని అణచబడిన జాతులు, పట్టణాల్లోని గ్రామీణ ప్రాంతాల్లోని

కార్మికులు, సైన్సు సాహిత్యం కళారంగాలలోని అభ్యుదయవాదులు రోజురోజుకి ఈ పోరాటంలోకి సమీకృతులౌతున్నారు. పోరాటరంగము నానాటికి విశాలమౌతున్నది.

ఈ ప్రతిఘటన పెరగటం ఎంత సహజమో, న్యాయసమ్మతమో; దానితో పాటుగా మార్క్సిస్టు-లెనినిస్టులు అభివృద్ధిచెంది సోవియటు ప్రజలకు, ఈ పోరాటాలకు నాయకత్వం వహించుతారనేదికూడ అంతవాస్తవము, చారిత్రిక సత్యంకూడ.

ప్రపంచంలో పీడిత తాడిత ప్రజలందరకు సోషలిజం వెలుగుబాటను చూపింది. సోవియటుప్రజలు, సోవియటు కార్మికవర్గమేకాని సోల్జెనిత్సేన్‌లాంటి గుంటనక్కలు కాదు. సోవియటు సమాజంలోని నిజమైన వీరులు ఈ సోవియటు ప్రజలే సోవియట్ యూనియన్ విప్లవ వారసత్వాన్ని ఈ ప్రజలే తప్పకుండా పునరుద్ధరించుతారు.

అనువాదం: ప్రసాదు

సమీక్షలు :

సామ్రాజ్యవాదమూ, సామ్రాజ్యవాదులూ: వి. ఐ. లెనిన్

1912 నవంబరు, 1920 డిసెంబరుల మధ్యకాలంలో లెనిన్ వేరువేరు పత్రికలలోనూ, ఉపన్యాసాలలోనూ సామ్రాజ్యవాదం గురించీ, సామ్రాజ్యవాదులను గురించీ, మొదటి ప్రపంచయుద్ధం గురించీ చెప్పిన అనేక విషయాలు ఈ గ్రంథంలో క్రోడీకరించారు. మొదటి ప్రపంచయుద్ధం సామ్రాజ్యవాద దేశాలమధ్య వలసల పునఃపంపకం కోసం జరిగింది. దరిమిలా మరో ప్రపంచయుద్ధం జరిగింది. ఇది నిస్సందేహంగా మొదటి యుద్ధానికి పుట్టిన బిడ్డే; ఆ మొదటి యుద్ధంలో చితికిపోయిన జర్మనీ తాను చావుదెబ్బతిన్న దేశాలనుంచే పుంజుకుని, ఫాసిజం చేపట్టి, ఈసారి ప్రపంచమంతటినీ ఆక్రమించాలనుకున్నది. అయితే ప్రపంచ పరిస్థితిలో మధ్యకాలంలో చాలామార్పు వచ్చింది. ఇప్పుడు సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించటానికి బలమైన సోషలిస్టు రష్యా, ప్రపంచంలో ఆరోభాగం ఆక్రమించి ఉన్నది. ఈ రష్యాను అణచటానికే సామ్రాజ్యవాద దేశాలు జర్మనీకి కోరలూ, గోళ్లూ పెంచాయి. అందుచేత ఈ రెండో ప్రపంచ యుద్ధం మొదటి ప్రపంచయుద్ధంలాగా కేవలం సామ్రాజ్యవాదులమధ్య అంతర్యుద్ధంగా కొనసాగలేకపోయింది. సామ్రాజ్యవాదం స్వభావం ఏమిటో, దాని లక్ష్యాలు ఏవో లెనిన్ ప్రపంచానికి స్పష్టంగా చెప్పిఉన్నాడు. ఈ రెండో ప్రపంచయుద్ధంలో సామ్రాజ్యవాదం నడుము విరిగింది. సామ్రాజ్యవాదులు, ఫాసిజంరూపం ధరించిన సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించటానికి— అయిష్టంగానే కానివ్వండి— సోవియట్ రష్యాతో చేతులు కలపవలసి వచ్చింది. ఫాసిస్టువ్యతిరేక యుద్ధభారాన్ని సగం రష్యా ధరించింది.

రెండవ ప్రపంచ యుద్ధంతో జర్మనీ, ఇటలీ, జపానులు పూర్తిగా చితికిపోతాయనీ, రష్యాకికూడా తిరిగి కోలుకోలేని స్థితి ఏర్పడుతుందనీ సామ్రాజ్యవాదులు యుద్ధ కాలంలో అంచనావేసి ఉండవచ్చు. అలా జరగలేదు. తూర్పు యూరపు అంతటా పెట్టుబడిదారీ ఇగిరిపోయింది మరికొద్ది కాలానికి చీనా మరొక సోషలిస్టు భూతంగా ఆవిర్భవించింది. చావుదెబ్బతిన్నది వలసవిధానం. పోయిన వలసలుపోగా, మిగిలినవి విమోచన యుద్ధాలకు పూనుకున్నాయి. ఈ పరిస్థితిలో నయావలసవిధానం అవతరించింది. ఇది వెనుకబడిన ప్రాంతాలను ముందుకురాకుండాచూస్తూ, ఆర్థికంగా వాటిని దోస్తూ వాటిమధ్య కలహాలను పెంపొందిస్తూ, మారణాయుధాలు అందిస్తూ, వాటి రాజకీయాలను పరోక్షంగా శాశిస్తూ, వాటిపైన పరభృతాలుగా జీవించే ప్రక్రియ.

ప్రపంచం ఇంతగా మారిపోయి, ఇన్నిదశాబ్దాలు గడిచినాక ఆనాడు లెనిన్ అన్న మాటలు ఈనాడు మనకు ఉపకరిస్తాయా ? చూతాం.

లెనిన్ మాటలు

"జీవనవ్యయం పెరుగుతున్నది... వేతనాలు అవసరమైన శ్రమశక్తి వ్యయం కంటె ఎంతో నిదానంగా పెరుగుతున్నాయి. దీనిపక్కనే పెట్టుబడిదార్ల ఐశ్వర్యం కండ్లు తిరిగే వేగంతో పెరుగుతున్నది. ...తిండీ, బట్టలూ, యింధనమూ, అద్దె అన్నీ ఎక్కువ ఖరీదు అయినాయి. కార్మికుడు పరమంగా దరిద్రుడౌతున్నాడు." (1912)

ఇది పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అవలక్షణమైతే మనం సోషలిజంకేసి పురోగమించటంలేదు.

"పెట్టుబడిదారీ ఆటవికత్వం ఏ నాగరికతకంటెనైనా బలీయమైనది."

మనదేశంలో నాగరికతఅన్నది అంతంతమాత్రంగనక పెట్టుబడిదారీ ఆటవికత పైశాచికత్వంగా పరిణమించి ప్రజల రక్తాన్ని తాగుతున్నది!

"కార్మికవర్గాన్ని మోసగించడానికీ, ఒకేఒక నిజమైన విమోచన యుద్ధంనుండి–తమ సొంత దేశంయొక్క, పరాయిదేశంయొక్క బూర్జువా వర్గాలకు వ్యతిరేకమైన అంతర్యుద్ధంనుండి– కార్మిక దృష్టిని మరల్చడానికి... ప్రతి దేశపు బూర్జువావర్గమూ, దేశభక్తిని గురించిన బూటకపు మాటల సహాయంతో, తన సొంత జాతీయ యుద్ధం యొక్క ప్రాముఖ్యాన్ని ప్రస్తుతించడానికి ప్రయత్నిస్తున్నది."

మన బూర్జువా వర్గానికి పాకిస్తానుతో యుద్ధాలూ, చీనాతోయుద్ధమూ, ఈవిధంగా తోడ్పడలేదా? మన కార్మికవర్గం ఈనాటికైనా "విమోచన" యుద్ధానికి అయత్తమయిందని చెప్పగలమా ?

"సకలదేశాల ప్రభుత్వాలూ, బూర్జువావర్గాలూ, కార్మికులను అనైక్యపరచటానికీ, ఒకరిమీద ఒకరిని ఉసికొల్పడానికీ మరింత తీవ్రంగా ప్రయత్నించేకొద్దీ...సకలదేశాల లోని 'దేశభక్తియుత' బూర్జువాముఠాల అదుపులేని జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా తన వర్గ సంఘీభావాన్నీ, తన అంతర్జాతీయతనూ, తన సోషలిస్టు విశ్వాసాలనూ రక్షించుకోవలసిన బాధ్యత వర్గచైతన్యంగల కార్మికవర్గంమీద మరింత యెక్కువగా ఉంటుంది" (1914)

విప్లవ పోరాటాలు యుద్ధాలను నివారిస్తాయన్న మావో సిద్ధాంతానికి బీజం ఇందులో ఉన్నది. జాతీయ దురహంకారమూ, అంతర్జాతీయ శ్రామిక దృక్పథంలో గండీలూ, యుద్ధాలకు మంచికవచాలు, వాటికి నిజమైన విరుగుడు జాతీయవిమోచన విప్లవ పోరాటాలు.

"ఫ్యూడలిజమూ, నియంతృత్వమూ, పరాయిపీడనా కూలదోయబడకముందు, సోషలిజంకొరకు కార్మికవర్గ పోరాటం అనే ప్రశ్న ఉద్భవించదు."

వెనుకబడిన దేశాలలో ఈ ప్రశ్న ఉద్భవించకతప్పదు. కాని ఈ పోరాటంలో రైతాంగంపాత్ర ప్రముఖంగా ఉండడమేగాక, ఈ పోరాటం ఫ్యూడలిజమునూ, నియంతృత్వాన్నీ, పరాయిపీడననూకూడా నిర్మూలించేవిధంగా సాగాలి. ఈ శక్తులకు కట్టే గోరీలే సమసమాజానికి పునాది.

"ఫైనాన్స్ పెట్టుబడియుగంలో పరాయిదేశంలోనైనా పోటీని తొలగించడం ఆర్థికంగా సాధ్యమా? నిశ్చయంగా సాధ్యం. పోటీదారుని ఫైనాన్షల్ పరాధీనతద్వారా, అతని ముడిసరుకులనిధులనూ, కాలక్రిమాన అతని వ్యాపారసంస్థలన్నిటినీ కొనేయడం ద్వారా అది జరుగుతుంది. రాజకీయ పరదేశ స్వాధీనంలేకుండా ఆర్థిక పరదేశ స్వాధీనం పూర్తిగాసాధ్యం."

అందుచేతనే మనదేశం రాజకీయ పరాధీనతనుంచి బయటపడికూడా ఆర్థికంగా ఇతర దేశాల వలల్లో చిక్కుకుపోయింది.

"ప్రజాస్వామ్య రిపబ్లిక్ పెట్టుబడిదారీవ్యవస్థను 'తార్కికంగా' వ్యతిరేకిస్తుంది; యెందుకంటే, అది ధనికులనూ, బీదలనూ 'అధికారికంగా' సమానంగాపెడుతుంది. అది ఆర్థిక వ్యవస్థకూ, రాజకీయ ఉపరినిర్మాణానికీ ఉన్న వైరుధ్యం. సామ్రాజ్యవాదానికీ, రిపబ్లిక్‌కూ మధ్య అదేవైరుధ్యంవుంది...మరి పెట్టుబడిదారీవ్యవస్థ ప్రజాస్వామ్యంతో యెలా రాజీపడుతుంది? పెట్టుబడియొక్క నిరవధికశక్తిని పరోక్షంగా అమలు పరచడంద్వారా!"

నల్లసొత్తును అంటకపోవటంద్వారా, ధరలను అదుపుచేసే చర్యలద్వారా వాటిని పెంచటంద్వారా, ధనికులను మరింత ధనికులనుకానిచ్చి ప్రజాజీవితం నరకప్రాయం చెయ్యటంద్వారా అందామా?

"ఫైనాన్స్ పెట్టుబడి యేదేశంలోనైనా, 'స్వతంత్రదేశంలోకూడా' పెత్తనం చెయ్యగలదని మార్ధీసీసులు చెప్పుతాయి" అన్నాడు లెనిన్. ఆ ఫైనాన్స్ పెట్టుబడిపెత్తనం మనను కట్టి కడుపుతున్నది.

"ఫైనాన్స్ పెట్టుబడి పెత్తనంకొరకు పాటుపడుతుంది. స్వేచ్ఛకొరకు కాదు. రాజకీయ ప్రగతి వ్యతిరేకత అద్యంతం సామ్రాజ్యవాదంయొక్క విలక్షణగుణం"

అందుకే అమెరికా జాతీయ పరిశ్రమలకు సహాయపడదు, ఆయుధాలిస్తుంది.

"కొద్దిపాటి గొప్పరాజ్యాలచేత వలసలదోపిడీ 'నాగరిక' ప్రపంచాన్ని అంతకంతకూ ఎక్కువ అనాగరిక జాతులలోని కోటానుకోట్ల జనంమీద బతికే పరరక్తోపజీవిగా మారుస్తుంది...అధునిక సమాజం అధునిక నిరాస్తిపరులమీద బతుకుతున్నది."

ఈ సామ్రాజ్యవాదలక్షణం ఈనాటి పెట్టుబడిదారీ సమాజాలకన్నిటికీ వర్తిస్తుంది. పెట్టుబడిదారీ ఉండేదేశాలన్నిటా ధనికులు నిర్ధనులమీద జీవిస్తున్నారు. సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గం "పైపొర" వలసలలోని పేదశ్రామికులమీద పరభృతంగా కొంతవరకు జీవించగలిగింది. ఇప్పుడు మనదేశంలోనే అలాంటి కార్మిక వర్గపు "పైపొర"ఏర్పడుతున్నది. యూనియన్‌లమధ్యపోటీ, యూనియను నాయకులహత్యలూ "పైపొర"కోసం పోరాటాన్ని సూచిస్తాయి. శ్రామికశక్తులు రాజకీయశక్తులను శాసించే దశపోయి, వాటితో చేతులుకలిపే దశ ఏర్పడుతున్నది.

యుద్ధమూ, శాంతిగురించి లెనిన్ ఇలా అన్నాడు:

"యూరప్‌లో శాంతిరాజ్యంచేసింది: కానీ యిది యెలాసాధ్యమైందంటే, వలసలలోని పదులకోట్ల ప్రజలమీద యూరపియన్‌జాతుల పెత్తనం నిత్య, నిరంతరాయ, అనంత యుద్ధాలద్వారా నిలపబడింది: యీ యుద్ధాలను యూరపియన్ జాతులు యుద్ధాలుగా పరిగణించాయి, యెందుకంటే తరచుగా యివి యుద్ధాలలాగాకాక, పాశవిక హత్యాకాండలాగా, నిరాయుధప్రజల మూకుమ్మడి వధలాగా ఉండినాయి."

రష్యా ఈనాడు చేసే శాంతిజపం లెనిన్ చెప్పిన 'పాశవిక హత్యాకాండమూ', నిరాయుధ ప్రజల 'మూకుమ్మడి వధ'నూ పరిగణిస్తున్నట్టు కనబడదు. ఇది శాంతేనా? అణ్వస్త్రాలతో జరిగేదే యుద్ధమా? జాతీయ విమోచన యుద్ధాలూ, విప్లవ పోరాటాలూ సాగుతూఉన్నంతకాలమూ సామ్రాజ్యవాదులమధ్య కొంత ఐక్యత ఉంటుంది. ఇప్పుడు

అదేదశలో ప్రపంచం ఉన్నదనుకోవచ్చు. ఈ విమోచన యుద్ధాలూ, విప్లవ పోరాటాలూ విజయవంతమైన అనంతరం సామ్రాజ్యవాదానికి అవకాశమే ఉండదు. రష్యా అంతర్జాతీయయుద్ధాలు రాకుండా చూడదలిస్తే ఈ విమోచనపోరాటాలనూ, విప్లవపోరాటాలనూ బలపరచాలి. వాటిని అణచే దేశాలకు ఆయుధాలివ్వరాదు, చీనా సరిహద్దున సేనలను మోహరించరాదు. తనతో మైత్రీ, వాణిజ్యసంబంధాలు పెట్టుకున్న దేశాలను దోచుకోరాదు.

రష్యా "సోషల్ సామ్రాజ్యవాదం" అనుసరిస్తున్నదని కొందరు ఒప్పుకోవటం లేదు. 1917లో లెనిన్ అడిగినట్టు "పరదేశ స్వాధీనానికి జర్మన్‌లకూ, బ్రిటిషువాళ్ళకూ(ఈనాడు అమెరికన్‌లకూ) వర్తించే నిర్వచనం దయయుంచి యివ్వండి"అనిమనం అడగవచ్చు.

"విప్లవకరప్రకటనలు రాయడంద్వారా జనాలను మోసగించే పెట్టుబడిదారీ కళలో మనకంటె ఎక్కువ అనుభవంగల యితర జాతులు ఎప్పుడో ప్రపంచ రికార్డులన్నిటినీ అధిగమించినారు."

మన పాలకులు ఈనాడు ఈ అడుగుజాడలలో తప్పటడుగులు వెయ్యటానికి చేతగాని ప్రయత్నాలు చేస్తున్నారు.

1917లోనే లెనిన్, బ్రిటిషు సామ్రాజ్యవాదులు 1947లో చెయ్యబోయేదిచెప్పాడు. "తెలివిగల సామ్రాజ్యవాదులు యిలా అనుకుంటారు: నిజమే. చిన్నజాతుల గొంతు పిసకకుండా మేము మా లక్ష్యాలు సాధించలేము, కానీ ఆ పని చెయ్యటానికి ఒకోసారి యెక్కువ నమ్మకమైన, లాభదాయకమైన పద్ధతి ఏమిటంటే, రాజకీయంగా స్వతంత్రమైన రాజ్యాలు సృష్టించడంద్వారా... అవి ఫైనాన్షల్‌గా పరాధీనంగా ఉండేటట్లు చూస్తాము!"

1918లో లెనిన్ అమెరికన్ కార్మికులకు రాసిన లేఖలో "నా ఎత్తుగడలన్నీ... యావత్తు నాగరిక ప్రపంచపు వర్గచైతన్యపూరిత కార్మికవర్గం ఆమోదిస్తుందని నాకు పరమ స్పష్టంగా తెలుసు...అమెరికన్ ప్రజలు తమ విప్లవానికి లాభకరంగా ఈ ఎత్తుగడలకు యేనాడో పూనుకున్నారు స్వాతంత్ర్యంకొరకు చేసే తమ కష్టమైన యుద్ధంలో అమెరికన్ ప్రజలుకూడా పీడకులను బలహీనపరచి, పీడనకు వ్యతిరేకంగా విప్లవకరంగా పోరాడేవాళ్ళను బలపరచడానికి, పీడితప్రజల ప్రయోజనాలకు ఉపకరించడానికి కొంతమంది పీడకులకు వ్యతిరేకంగా మరికొందరితో ఒప్పందాలు చేసుకున్నారు. అమెరికన్ ప్రజలు ఫ్రెంచి, స్పానిష్, బ్రిటిష్ వాళ్ళమధ్యగల తగాదాలను వినియోగించుకున్నారు"అని జ్ఞాపకం చేశాడు.

"పరిశ్రమల విధ్వంసనానికిగానీ, 'టెర్రర్'కుగానీ మమ్మల్ని నిందించడం కపటం... విప్లవయుగాలలో వర్గపోరాటం సర్వదా, అనివార్యంగా, ప్రతి దేశంలోనూ అంతర్యుద్ధరూపం ధరించింది. మరి అంతర్యుద్ధం అనేది మహా తీవ్రమైన విధ్వంసమూ టెర్రరూ...లేకుండా దురూహ్యం" అనికూడా లెనిన్ ఈ లేఖలో తెలిపాడు. "బ్రిటిష్ బూర్జువాలు తమ 1649 నీ, ఫ్రెంచి బూర్జువాలు తమ 1793 నూ మరచిపోయినారు. బూర్జువాలు తమ సొంత ప్రయోజనం కొరకు ఫ్యూడలిజంకు వ్యతిరేకంగా టెర్రర్‌కు పూనుకున్నప్పుడు అది న్యాయంగా, చట్టబద్ధంగా ఉండింది. కార్మికులూ, బీదరైతులూ బూర్జువాలకు వ్యతిరేకంగా టెర్రర్ ఉపయోగించడానికి సాహసించినప్పుడు అది రాక్షసమూ, నేరమూ అయింది! ఒక పీడక మైనారిటీని తొలగించి, దానిస్థానంలో మరొక పీడక మైనారిటీని పెట్టడానికి ఉపయోగించినప్పుడు టెర్రర్ న్యాయంగా, చట్టబద్ధంగా ఉండింది. ప్రతి పీడక మైనారిటీనీ కూలదోయడానికి అపారమైన వాస్తవ మెజారిటీ ప్రయోజనాలకొరకు, కార్మికవర్గంయొక్క, బీదరైతులయొక్క ప్రయోజనాలకొరకు ఉపయోగించడం ప్రారంభమైనప్పుడు, టెర్రర్ రాక్షసమూ, నేరమూ అయింది!"

ఇదే తేడా ఈనాడు మనదేశంలో విప్లవకారుల వర్గశత్రువుల నిర్మూలనకూ, పోలీసుల విలయతాండవానికీ పాటించబడుతున్నది.

విప్లవాచరణలో జరిగే పొరపాట్లను గురించి లెనిన్ ఇలా స్పష్టంగా చెప్పాడు: (ఈ కిందివాక్యంలో 'మన' అని ఉన్నచోటనల్లా 'మా' ఉండటం అవసరం.)

"మన విప్లవం చేసే ప్రతి పొరపాటును గురించీ కలుషిత బూర్జువా పత్రికలు యావత్ప్రపంచానికీ కేకలువేయనీ, మన పొరపాట్లకు మనం జడవం. విప్లవం ప్రారంభమయింది గనుక ప్రజలు మహర్షులు కాలేరు. శతాబ్దులుగా పీడింపబడి, అణగదొక్కబడి, బలవంతంగా దారిద్ర్యపు, పశుత్వపు, అజ్ఞానపు పంజరంలో బంధింపబడిన శ్రామికవర్గాలు విప్లవం చేసేటప్పుడు పొరపాట్లను పరిహరించలేరు. ప్రతి నూరు పొరపాట్లకూ 10,000 గొప్ప వీరోచిత కార్యాలు చేయబడుతున్నాయి... మనం చేసిన ప్రతి వంద సరైన చర్యలకు 10,000 పొరపాట్లు చేసినప్పటికీ, అప్పటికీ మనవిప్లవం గొప్పదిగా, అజేయంగా వుంటుంది."

ఇదీ నిజమైన విప్లవ విశ్వాసం!

"విప్లవాలు కోరికప్రకారంగానీ, ఒప్పందంప్రకారంగానీ జరగవని మాకు తెలుసు. పరిస్థితులు సోషలిస్టు కార్మికవర్గంలోని మా రష్యన్ దళాన్ని ముందుకుతెచ్చింది మా సుగుణాలవల్లకాదనీ, రష్యాయొక్క అసాధారణమైన వెనుకబాటుతనంవల్లననీ,

ప్రపంచ విప్లవం ప్రజ్వలించేముందు పలు విడివిడి విప్లవాలు ఓడిపోవచ్చుననీ మాకు తెలుసు."

విప్లవాలకు మూలకారణం విప్లవ పరిస్థితులేగాని, విప్లవ అపజయాలు విప్లవ పురోగమనాన్ని ఆపవు. ఓటమినుంచి ఆచరణదృష్ట్యా విప్లవకారులు గొప్ప పాఠాలు నేర్చుకుంటారు. మావో చెప్పినట్టు అపజయాలు న్యాయంగా విజయానికి సోపానాలు— విప్లవకారుల దృష్టిలో.

"యీనాటి విప్లవ ప్రపంచంలో మనం ఉపయోగించుకోవలసిన మేలిక వైరుధ్యాలేమైనా ఉన్నాయా?" ఇది విప్లవకారులు అడుగడుగునా వేసుకొనవలసినప్రశ్న. ఈ మేలిక వైరుధ్యాలను ఉపేక్షచేసి విప్లవచర్యలు సాగించటం గుడ్డెద్దు చేలోపడినట్లవుతుంది.

అనువాదం

లెనిన్ రచనలు లోగడ తెలుగులో అనువాదమయాయి. విషయం క్లిష్టమైనది కావటంచేత కానివ్వండి, మన భాష ఇలాంటి శాస్త్రీయ విషయాలను వ్యక్తీకరించటానికి అనుకూలంగా పరిణామంచెంది ఉండని కారణంచేత కానివ్వండి, ఆ అనువాదాలు తృప్తికరంగా ఉండలేదు— అంటే మామూలుమనుషులు కొత్తగా ఈ పుస్తకాలుచదివి, వీటిలోని విషయం గ్రహించటానికి అనుకూలంగా ఉండలేదు.

ఇప్పుడు మాస్కోనుంచి వెలువడిన ఈ రచనలోకూడా ఇదేలోపం కనిపిస్తుంది. అనువాదకుడికి భాష వచ్చు, విషయం తెలుసు, కాని దాన్ని ఇతరులు గ్రహించేటట్టు చెయ్యటానికి ప్రయత్నించలేదు.

మాస్కోవారు ప్రచురించిన అనువాదాలను గురించి నాకు కొద్దిగా అనుభవం వున్నది. స్టాలిన్ కాలంలో రష్యన్ పుస్తకాల ఇంగ్లీషు పుస్తకాల స్వేచ్ఛానువాదాలు వెలువడ్డాయి. కాని స్టాలిన్ అనంతరం ఇంగ్లీషునుంచి ఇతరభాషలలోకి జరిగే అనువాదాలు రష్యన్ మూలానికి తూచా తప్పకుండా ఉండేటట్టు చూడాలన్న ధోరణివచ్చింది. ఇంగ్లీషు స్వేచ్ఛానువాదాలనుంచి చేసే అనువాదాలు రష్యను మాతృకకు 'ముక్కశ్చ ముక్కః'గా ఉండటం సాధ్యంకాదు; అయినా సోవియట్ అధికారులు నా తెలుగు అనువాదాన్ని అలా దిద్దించారు.

ఇలాటి యాంత్రిక నియమాలవల్ల అనువాదంలోకి "బైబిల్ భాష"లాటిది ప్రవేశిస్తుంది. ("ఆకాశమందున్న ఓ తండ్రీ, నా అనుదినమైన రొట్టెను నాకిమ్ము" "తట్టుడీ తెరువబడును") ఈ అనువాదం రష్యను మూలంనుంచి జరిగిందో, ఆంగ్లానువాదంనుంచి జరిగిందోగాని, ఇందులో అనేకచోట్ల వాక్యనిర్మాణం తెలుగేకాదు.

"గుత్తాధిపత్యం ఉద్రేకంగా సవాల్ చేయబడుతున్నది", "అర్థనిర్మిత దాదాపు పార్టీ", "బూర్జువావర్గంలోకి పారిపోవడం"లాటి ప్రయోగాలు అలా ఉంచి, ఈ కింది వాక్యాల నిర్మాణం చూడండి.

"లాయిడ్ జార్జి బూర్జువావర్గానికి అద్భుతంగా సేవ చేస్తాడు. సరిగ్గా కార్మికుల మధ్య దానికి సేవచేస్తాడు. సరిగ్గా కార్మికులమీద దానిప్రభావం నెరపుతాడు. ఎక్కడైతే బూర్జువావర్గానికి అది అత్యవసరమో, యెక్కడైతే జనాలను నైతికంగా లోబరచుకోవడం దానికి మహా కష్టంగా ఉంటుందో అక్కడ." (119 పేజీ)

"సార్వజనీన వోటుహక్కూ, యెనిమిది గంటల పనిదినమూ, రిపబ్లిక్ కూడానూ సామ్రాజ్యవాదానికి తార్కికంగా అనుగుణమే- సామ్రాజ్యవాదం సుముఖంగా ఉండకపోయినప్పటికీ (!!), కనుక వాటిని సాధించటం మహాకష్టమైనప్పటికీ? అని కీయెవ్‌స్కీ రాసినాడు" (పూర్తి పేరా 96 పేజి)

"కీ యెవ్‌స్కీ మనమీదికి విసరే 'మంత్రగాడు'అనే కోపపుమాట భయం గొల్పేదిగా ఉన్నప్పటికీ, మనం ఒక విషయం గుర్తుచేయక తప్పదు. ఆర్థిక పరిశీలనఅంటే యేమిటో అతనికి అర్థంకాలేదని...మనం చర్చిస్తున్నది రాజకీయ కాక. ఆర్థికపరిశీలన అయినప్పుడు..." (92 పేజి)

ఇటువంటి భాషకు మనవాళ్లు ఏనాడో బైబిల్ తెలుగు అని పేరు పెట్టారు. మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాల అనువాదం నిర్దుష్టమయిందని చెప్పను గాని, వాటినాణ్యం ఇటీవల చాలా అభివృద్ధి అయింది. అయినప్పుడు 1974 లో వెలువడిన ఈఅనువాదం ఇంతకన్న చాలా బాగా ఉండి ఉండవలసింది.

— కొడవటిగంటి కుటుంబరావు

సామ్రాజ్యవాదమూ, సామ్రాజ్యవాదులూ. వి. ఐ. లెనిన్

ప్రగతి ప్రచురణాలయం, మాస్కో

ఎన్నెస్ కథలు

ఎన్నెస్ ప్రకాశరావు విప్లవ తరానికి చెందిన రచయిత. సమాజంలోని దోపిడీ శక్తులతో నిరంతరం పోరాటం సాగించిన కళాకారుడు. మార్క్సిస్ట్ లెనినిస్ట్ రాజకీయాల నాయకత్వాన ఎర్రజెండాకింద జనం పిలుపుకి కదలిన మేధావి. ప్రజా సంఘాల నిర్మాణంలో యువకరం చొరవతో మిలిటెన్సీతో సాంస్కృతిక రంగంలో చైతన్యవంతమైన పాత్రని నిర్వహించిన కార్యకర్త. వర్గరాజకీయాల పునాదిగా సమాజాన్ని లోతుగా అవగాహన చేసుకున్న విద్యార్థి. శాస్త్రీయమార్గాన పరిశోధనలు చేసిన రిసెర్చి స్కాలర్. శ్రామిక ప్రపంచంపట్ల అపారమైన ప్రేమ, జాతి విముక్తికోసం దృఢమైన

దీక్ష, సమాజ ప్రయోజనాలు జీవితలక్ష్యంగా ఎంచే ఔన్నత్యం, పీడితుల పక్షాన పోరాటంలో ఎదురయ్యే ప్రమాదాలను ఎదుర్కోగల సాహసం, తిరోగమన వాదాలని, బూటకపు విప్లవ నినాదాలని ఎండగట్టగల చేవ- ఇవన్నీ ఎన్నెస్‌ని ఎరిగిన స్నేహితులకు తెలిసిన నిజం. ఎన్నెస్‌ని అర్థంచేసుకోవాలంటే విశాఖ సముద్రం హోసులో అతడితో తిరిగిన అనుభవం ఉండేవి. అక్కడ ఎన్నెస్ ఒక ఉద్యమం. ఆ ఉద్యమం యొక్క పుస్తకరూపమే సాగర గ్రంథమాల తెచ్చిన 'ఎన్నెస్ కథలు'.

ఈ సంపుటిలో పదిహేడు కథలున్నాయి. వాటిల్లో ఆరంభించి ముగించనివి మూడు. ఇవికాక తన డైరీల్లో రాసుకున్న నోట్స్ ప్రకారం ఇంకో ఇరవై ఎనిమిది కథలథీమ్స్ ఉన్నాయి. 'విద్యావిధానం మారాలి 'విప్లవ కథకుల సమస్యలు' 'తెలుగు కథ-ఇటీవల ధోరణులు' అన్న ఈ మూడు వ్యాసాలనుకూడా చేర్చి ఈ సంపుటిని సమగ్రంగా తీసుకొచ్చింది సాగర గ్రంథమాల యజ్ఞం. కాళీపట్నం రామారావు కథలు క్రమంలో ఎన్నెస్‌కథలు తీసుకురావడం తెలుగు కథమీద సాగర గ్రంథమాల కృషికి నిదర్శనం.

* * *

"పేదవాళ్ళను ఉద్ధరించటానికి నేనున్నానని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వ పరిపాలనలో పాతికేళ్ళయినా పేదవాడి పరిస్థితి మరింత అధోగతి పాలయిందేతప్ప మరోలా జరగలేదు. అంతేకాదు, పదిహేడేళ్ల ఏకఛత్రాధిపత్యంగా పాలించిన సోషలిస్ట్ నాయకుడు నెహ్రూగారే స్వయంగా తన పరిపాలనలో- 'పేదవాళ్లు మరింత పేదవాళ్లుగానూ, ఉన్నవాళ్లు మరింత ఉన్నవాళ్లుగానూ అవుతున్నా'రని చెప్పేడు. "ఈ పరిస్థితుల్లో- తిరుగుబాటుతప్ప మరోమార్గంలేని పేదవాళ్లు విప్లవిస్తే- విచారణ అన్నది లేకుండానే నడివీధిలో పోలీసుకాల్పులు; జైలు గోడలమధ్య రాజకీయ ఖైదీల మూకఉమ్మడి హత్యలు; పసివాళ్ళన్న విచక్షణైనా లేకుండా interrogation పేరుతో హింసించి హింసించి వాళ్ళను మతిభ్రష్టులుగానో, జీవితాంతం వికలాంగులుగానో చేస్తోన్న పరమపవిత్ర అహింసా సోషలిస్టు వ్యవస్థ మనది.

"ఈ పరిస్థితిలో నోరుమూసుకున్న రచయితలకన్నా దేశద్రోహులు వుండరు. ప్రచారసాధనాలన్నీ గుప్పెట్లో పెట్టుకున్న ఈ ప్రభుత్వానికి అవి చాలవన్నట్టు తమ కలాల్నికూడా అమ్ముకుని అనుకూల ప్రచారంచేసిపెడ్తున్న రచయితలు అంతకన్నాహీనులు."

ఈ నిరంకుశ సామాజిక పరిస్థితుల చారిత్రకదశలో సృజనాత్మకమైన సాహితీ కృషి సాగించిన రచయిత ఎన్ని గురుతర లక్ష్యాలను తనలో నింపుకున్నాడో బోధపడుతుంది. '67 డిసెంబరులో నీతికథలు అని రాసుకున్న సిద్ధాంత వ్యాఖ్యానాలని పరిశీలిస్తే ఈ ఎన్నెస్ కథల జీవనాడి మనకు దొరుకుతుంది.

1. బూర్జువా వ్యవస్థ ఎంత కట్టుదిట్టమైనదైనా ప్రజావెల్లువలో కొట్టుకుపోక తప్పదు.

2. మహోన్నతమైన విప్లవం కోసం చేసేపనులు అతి చిన్నవయినా ఎంతో ఆనందాన్ని (చేసేవాళ్ళకి) ఇస్తాయి.

3. ఏ కళైనా— న్యాయాన్ని నిలబెట్టటానికీ, అన్యాయాన్ని ఎదిరించడానికీ మనుషులను పురికొల్పేదే కళ.

4. ప్రజలకు సాయంచేసే కవులే నిజమైన కవులు. ప్రజాకవుల్లాగ పోజుపెట్టి ప్రజలను దోచేవాళ్ళని ఓ కంట కనిపెట్టాలి.

5 ఇంటెలిక్చుయాలిటీ పేరుతో సమాజాన్నించి మనిషిని వేరుచేస్తారు, కేపిటలిస్ట్ సమాజంలో. 'నా చిన్న బొజ్జకు శ్రీరామరక్ష!'

6. ప్రజాభావాన్ని అంచనా కట్టలేక ప్రజల్ని నాశనంచేయాలనుకున్న శత్రువు తానే నాశనమవుతాడు చివరికి.

ఈ ఆరు సిద్ధాంత వ్యాఖ్యానాలను '67 డిసెంబరులో డైరీలో రాసుకున్నాడు ఎన్నెస్. అప్పటికి విరసం లేదు. విశాఖ రచయితల సంఘం (విరసం) ఉంది. అక్కడ రావిశాస్త్రి, కాళీపట్నం రామారావుల శిక్షణలో పర్యవేక్షణలో సహచర్యంలో సామాజిక దృక్పథంతో, వర్గచైతన్యంతో, మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత అధ్యయనంతో యువతరంలో సృజనాత్మకమైన కృషి సాగుతున్న దనటానికి ఎన్నెస్ రాసుకున్న సిద్ధాంత వ్యాఖ్యానాలు సాక్ష్యం. అక్కడికి మూడేళ్ళతర్వాత విప్లవ రచయితల సంఘం జూలై 4 ఉదయాన అవతరించింది. విప్లవ శక్తులు సంఘటితం అవటానికి ఎన్నెస్ లాంటి యువరచయితలు రాష్ట్రమంతటా ఒక సంక్షోభాన్ని సంచలనాన్ని సృష్టించారు. నక్సల్బరీ సాయుధరైతాంగ పోరాటం ఆధారంచేసుకుని లేచిన యీ సంచలనం విప్లవ రచయితల సంఘం నిర్మాణదిశగా ఒక వేగాన్ని ఊపునీ బలాన్నీ ఇచ్చింది. సాహితీ రంగంలో వచ్చిన ఈ పరిణామాలన్నీ సామాజిక రంగంలోని సంక్షోభం, రాజకీయ రంగంలో విప్లవశక్తుల విజృంభణ నిర్మాణాత్మకమైన ప్రాతిపదికను ఏర్పరచాయి ఈ ఆరేళ్ళకాలంలో అంటే '67 నించి ప్రకాశరావు మరణించినంతవరకు— అంటే 73జూన్ వరకు— ఎన్నెస్ చేసిన సాహిత్యకృషి ఈ సంపుటిగా లభించింది.

గొప్ప కళ యొక్క ప్రధానమైన స్వభావం ఏమిటంటే అది వర్తమాన చరిత్ర కళ్ళెంని చేతిలో పట్టుకుంటుంది. చరిత్రకారులు పరిపాలకుల దృష్టితో చరిత్ర నింపుతారు. రచయితలు ప్రజల జీవితాన్ని, సామాజిక చరిత్ర స్వభావాన్ని తప్పించుకుని రాయలేరు. అందువలన రచయితల రచనలనుండి చరిత్ర ఆధారాలు వెతుక్కుంటాం.

శ్రామికవర్గ షనాదితో రాసిన ఎన్నెస్ కథలలో వర్తమాన భారతదేశ సామాజికచరిత్ర కళాఖండాలుగా కన్పిస్తుంది. మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహన ఉన్న కళాకారుడు మిగిలిన కళాకారులమీద ఎంత సమర్థుడో ఇక్కడే స్పష్టమవుతుంది.

* * *

పేపర్ టైగర్, దిఫ్రెండ్స్ ఈ సంపుటిలో కొడవటిగంటి, రావిశాస్త్రి, కాళీపట్నం కథలస్థాయిలో, పరిణతతో రాసినకథలు. ఈ కథల్లో ఎన్నెస్ సొంతముద్ర స్పష్టంగా కన్పిస్తుంది. ఎన్నెస్ రచనల్లోనూ, జీవితంలోనూ ఉన్న ఒక విలక్షణత ఏమిటంటే బూటకపు మేధావులను, కళాకారులను ఎండగట్టడం. కొన్నిసార్లు వాళ్ళను కవ్వించడం, మరికొన్నిసార్లు వాళ్ళను సూటి వ్యాఖ్యానాలతో ఖండించడం, గడుసుగా వాళ్ళు చెప్పేది- వాళ్ళ ఖర్చయేంతవరకు ఊఁగొట్టూ వినడం, అట్నుంచి నరుక్కురావడం- ఇవన్నీ కథల్లోకనిపిస్తాయి. రెండోపక్క కళాకారులు, కష్టజీవులు, చిత్తశుద్ధి నిజాయితీఉన్న మేధావులపట్ల ప్రేమ అభిమానం, నిర్మాణంలోకి, కార్యోన్ముఖులనుచేసే కార్యకలాపాల్లోకి ఇమడ్చే చొరవ, ఎల్లప్పుడూ నేర్చుకొనే స్వభావం అవి కొట్టొచ్చి కన్పిస్తాయి.

పేపర్ టైగర్‌లో వరప్రసాదరావు సీనియర్ లాయర్. నరసింహంగారిని స్వీయ ఘనత వెళ్ళబోసుకోనిస్తాడు. తీరా రోగిష్టి ముసలితాతను తీసుకుని ఇంట్లో చొరబడిన పడుచుపిల్లదగ్గర- బెదిరించలేక హడలుకొట్టలేక, భయపెట్టలేక బొమ్మపులిలాగ అవుతాడు. ఇన్నేళ్ళు కోర్టులను, జడ్జీలను గడగడలాడించిన ఘనకీర్తిగల నరసింహంగారికి పట్టినగతి అది. ఇంతసేపు తన ఐశ్వర్యాన్నీ, అదృష్టాన్నీ, దైవప్రసాదాన్నీ కలగలిపి ఆత్మశ్లాఘనచేసుకున్న నరసింహంగారి నిజరూపంబయటపడింది వరప్రసాదరావుకి. శ్రామిక శక్తితో పోరాటస్వభావానికి రోగిష్టి ముసలితాతని తెచ్చిన పడచుపిల్ల ఒక ప్రతినిధిఅయితే దోపిడీవర్గాల ప్రతినిధి నరసింహంగారు మధ్యతరగతి నిత్యశంకితుడు వరప్రసాదరావు పోరాటంలోతప్ప పేపర్ టైగర్ బలం బయటపడదు. దోపిడీ శక్తులన్నీ పేపర్ టైగర్లే. వరప్రసాదరావుకి అదే అర్థమయింది

రోగిష్టి ముసలి తాతను వాననించి కాపాట్టానికి నీడకి తెచ్చిన పడుచుపిల్ల పాత్ర కథ చివర్లో ఒక మెరుపులాగ గాలీవానలాగవచ్చి కథా లక్ష్యంమీద జెండా ఎగరేస్తుంది. బాణంలాగ వచ్చి శత్రువు గుండెను చీల్చుకు పోతుంది.

'ది ఫ్రెండ్స్'లో ఇద్దరు ప్రొఫెసర్లు- వాళ్ళల్లో ఒకరు అసిస్టెంట్. ఒక కులం. స్నేహితులు మోణింగ్ వాక్‌లో సముద్రపు ఒడ్డున వీసీ విమానంలాంటి ఎర్రటి అమెరికా కారునిచూసి, వీసీ ఫేవర్ కొట్టేయటానికి ఆ చిన్న అవకాశాన్ని జారవిడుచుకోవ

టం ఇష్టంలేక రెండోవాడు అక్కడ దాపురించినందుకు శపించుకుని వాడిని వదలకొట్టు కోటానికి కుట్రలు పన్నుతూ వీసీతో మాట్లాడే ఈ అవకాశం జారిపోతే జీవితాలే పాడై పోతాయన్నంత బాధతో కుళ్ళిపోతారు. తీరా వీళ్ళకు ఎదురయింది వీసీ కుక్క. (వీసీ గారికుక్క) అక్కడితో కథ అయిపోతుంది.

మన విశ్వవిద్యాలయాల్లోని మేధావుల్లో ఒక వర్గం రాజకీయ వలుకుబడి ప్రాభవాల నిచ్చెన్లమీద అక్కడికివచ్చి వాళ్ళు సాగించే కుట్రలన్నిటినీ యీ కథలో ఎక్స్‌రే తీస్తాడు రచయిత.

"ఆయన(వైస్‌ఛాన్స్‌లర్) పరిపాలనలో కొన్ని కులాల ఉపాధ్యాయులూ, విద్యార్థులూ, ఇంజనీర్లూ, డాక్టర్లూ, కొందరు కొందరు కంట్రాక్టర్లూ బాగుపడ్డారు. బాగా డబ్బు చేసుకున్నారు. (కొందరు ప్రొమోషన్లు సంపాదిస్తే మరికొందరు పరీక్షలు ప్యాసయ్యారు. కొందరు ఉద్యోగాలు సంపాదిస్తే ఇంకొందరు విదేశాలకువెళ్ళే అవకాశాలు సంపాదించుకున్నారు) కొన్ని కులాలుమాత్రం తినడం, గట్టిదెబ్బే తిన్నారు. అసమ్మతి వర్గం బయల్దేరింది. అలజడి చెలరేగింది. వెంటనే ప్రభుత్వంవారు ఆయన్ని(వీసీని) మరో పెద్ద పదవికి పంపించేశారు."

విశ్వవిద్యాలయాల్లో ఇంకా యితర ఉన్నత పదవుల్లో ఒక తరగతి మేధావుల్లో విదేశాల డిగ్రీలు ఒక యోగ్యతగా బతుకుతున్నవాళ్లున్నారు. ఇక్కడ ప్రొఫెసర్ అమెరికాలోనూ, అసిస్టెంట్ ప్రొఫెసర్ రష్యాలోనూ డెప్యుటేషన్‌మీద ఉన్నత విద్య కోసం యూనివర్సిటీ ఖర్చుమీద వెళ్ళి ఉన్న విద్యతోనే తిరిగి వచ్చినవాళ్లు. సందర్భం వచ్చినదగ్గరల్లా 'రష్యాలోకూడా చలి విపరీతంగా ఉంటుందిగానీండి అదంతా అదోరకం బ్యూటీ సార్, నేను అక్కడకూడా అప్పుడప్పుడు మోణింగ్ వాక్‌కి వెళ్లేవాడిని వెండి కోటుజేబులో చిన్న వోడ్కాబాటిల్ పడేసుకుని–' ఇదీ వాళ్ళ ధోరణి. అమెరికా మీద ఈగ వాలనివ్వరు. వియత్నాం యుద్ధానికి వెతిరేకంగా అమెరికా ప్రజలే పోరాటం సాగిస్తున్నా ఈ విదేశీ సరుకు మాత్రం అమెరికా ప్రజాస్వామ్య స్వేచ్ఛను స్వాతంత్ర్యాన్ని గానం చేస్తుంది. ఈ కుహనా మేధావులను వాతలుపెట్టడం, స్నాబరీనీ విదేశీవ్యామోహాన్నీ, దేశీయతమీద చిన్న చూపునీ నిశితంగా ఎదుర్కోవడం ఈ కథల్లో ప్రధానంగా కనపడే ఒక బలమైన గుణం. మన ఆర్థిక రాజకీయ రంగాలన్ని తమ పట్టులోఉంచుకుని దేశాన్ని నయావలసగామార్చిన దోపిడీశక్తుల కాపలాకుక్కలే ఈ ఫారిన్‌రిటన్‌లు. విశ్వవిద్యాలయ రంగం వీళ్ళది. జాతీయ శక్తుల్నీ, విప్లవ శక్తులనీ అణిచేయటం కొరకు విద్యార్థుల్లో ఫాశిస్టుబలగాలని నిర్మించటం లేక బలపరచడం వీళ్ళ కార్యక్రమం.

పేపర్‌టైగర్‌లో నరసింహంగారు తన చిన్నకొడుకు అమెరికాలో స్థిరపడిపోయిన సంతోషంలో అంటాడు. "చిన్నప్పుడు వాళ్ళతాతగారు 'పెద్దయ్యాక' నువ్వేం

చేస్తావురా తాతా?"అని అడిగితే 'నేను అమెరికాపోతాను తాతగారు' అనేవాడు 'అమెరికా పోతాన్ అమెరికాపోతాన్' అంటూ వూఁదేవాడు. అఫ్‌కోర్స్ హిజ్‌లకీ భగవంతుడి దయవల్ల వాడికి స్టేట్స్‌లో సీటొచ్చింది. స్కాలర్‌షిప్ ఇవ్వనన్నారు 'పోండి వెధవల్లారా! దరిద్రులకీ ముష్టివాళ్ళకీ మీ స్కాలర్‌షిప్‌లుకాని నా కొడుక్కేం ఖర్మకాలింది?'అని పంపించేశాను. గొప్పతమాషా ఏమిటంటే వాడువెళ్ళేవరకు నాకూ తెలీదు." థియూలూ, లోన్‌నోల్‌లూ, చాంగ్‌కై షేక్‌లూ మిసెస్‌గాంధీలూ ఈ సంతతివాళ్ళే.

'దేవుడి నిజాయితీ'లో సూర్యారావు 'దేవుడుచేసిన మేలు'లో సూరిబాబు నాస్తికులు. హేతువాదం బలంతో నిలదొక్కుకున్న వ్యక్తిత్వాలు వాళ్ళవి. సూరిబాబుచెల్లెలు సుందరి పెళ్ళి అవాంతరాలవలన తప్పిపోయి వేరే సంబంధంకుదిరి పెళ్ళిజరిగిపోయింది. తర్వాత కొన్నాళ్ళకి మొదటిసంబంధం పెళ్ళికొడుకు రామారావు ఓ ప్రమాదంలో చచ్చిపోయాడు. దీన్ని వెంకటేశ్వరస్వామి మహాత్యంగా తల్లివర్ణిస్తే సూరిబాబుతల్లి మూఢనమ్మకాలని ఖండిస్తాడు. సూర్యారావూ అంతే పెళ్ళైనవెంటనే తలనీలాలు ఇస్తామని మొక్కుకున్నామని అత్తమామలు తిరుపతిరమ్మని బతిమాలితే గట్టిగా మొండిగా తిరస్కరిస్తాడు. యువకుల్లో హేతువాద దృక్పథం రాజీ ని భావపోరాటం, నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో నిర్ద్వంద్వత ఆ పాత్రల్లో కన్పిస్తుంది. దోపిడీ సంస్కృతి ఆయువుపట్టు దేవుడూ, మతమూ. హేతువాదంతో, శాస్త్రీయ దృక్పథంతో దాన్ని ఎదుర్కోనిదే నూతన సమాజ పరిణామానికి ప్రతిబంధకంగా ఉన్న మతోన్మాదం ఫ్యూడల్ సాంప్రదాయాల పునాది ధ్వంసంకాదు ఈ హేతువాద ధోరణులు కుటుంబరావుగారి కథల్లో కనిపించేంత బలంగా, స్పష్టంగా ఎన్నెస్‌కథల్లో కన్పిస్తాయి.

'పగ'లో శాంతమ్మ, 'రగులుకొనే రాక్షసిబొగ్గు'లో ఆనందరావు. 'డబ్బు'లో ఇంజనీరు నిరుద్యోగి సూర్యారావు, పేపర్‌టైగర్‌లో వరప్రసాదరావులు పీడితులు. దోపిడీవ్యవస్థ సృష్టించిన ఈసమాజంలో కుట్టుమిషన్‌మీద పనిచేసుకునే శాంతమ్మ, హైస్కూలులో హిందీపాఠాలు చెప్పుకునే ఆనందరావు. చదువుకు ఆస్తిఅంతా ఖర్చుపెట్టి ఉద్యోగం కొన్నాళ్ళుచేసి నిరుద్యోగయిన సూర్యారావులు మధ్యతరగతిలో కిందిమెట్టుమీదివాళ్ళు. సుఖవ్యాధుల భర్త వలన కలిగిన చచ్చుకాలు కొడుకు రాంబాబు జీవితాంతం మోయాల్సిన దుఖానికి భర్త అంటే జుగుప్స ఏర్పడింది శాంతమ్మకి. తర్వాత ఆ భర్త అనేకవ్యాధులకు బలయిపోతాడు. బురదను కడుక్కున్నట్టు తలిదండ్రులు పెళ్ళిచేసి వొదిలించుకుంటే వచ్చి భర్త జబ్బులకీ, అప్పులకీ, దరిద్రానికీ, సొట్టకాలు కొడుకుకీ- హక్కుదారయింది. కాశీవిశ్వేశ్వరుణ్ణి కళ్ళారాచూసేసి చచ్చిపోవాలనుకున్న తల్లి సాధింపులు. ఉద్యోగంలేని తమ్ముని నిస్సహాయస్థితి. చెల్లెలను పెళ్ళిచేయలేని

పేదరికము, భార్య జబ్బులకిసైతం మందులు కొనుక్కోలేని ఆనందరావుకు హిందీ వ్యతిరేకోద్యమం మరింత హింసిస్తుంది. ఇంజనీరు సూర్యారావు ఫ్యాన్ దగ్గర అప్పు కోసంవచ్చి భంగపడతాడు. చదువుమీద పెట్టిన పెట్టుబడంతా- చిన్నవర్తకుడు పెద్ద వర్తకుని మాయాజాలంలో నష్టపోయినట్టు- ఆస్తంతా పోగొట్టుకున్న సూర్యారావు-కథతో ఈ చదువుకూడా ఒక దోపిడీసాధనమే అన్న సత్యాన్ని నిరూపిస్తాడు రచయిత. ఈ బతుకులు ఇలా కాలిపోతుంటే దీనికి ఎవరుకారణం ఎందుకు ఎందుకు అని తపించిపోయే కళాకారుడు వ్యక్తినెవరినీ దోషిగా వేలుచూపించడు. వ్యవస్థపై పాఠకునికి ఆగ్రహం కలుగుతుంది. ఆ వ్యవస్థను రక్షించుకుంటున్నవర్గంపై ఆగ్రహం కసిగా మారుతుంది. ఇక్కడే సాహిత్యం గురిపెట్టిన భావవిప్లవం ఆరంభమవుతుంది. జాతి ఉజ్వల భవిష్యత్తును కోరే రచయితల అమ్ములు ఏ ఒక్కటీ వ్యర్థంకాకూడదు. నిరంకుశ కిరాతక దోపిడీ వ్యవస్థమీద దెబ్బమీదదెబ్బ నిరంతరంగా విజయం సాధించేవరకు సాగించడమే శ్రామికపక్షాన నిలచిన రచయితల లక్ష్యం.

'ఏకరువు', 'మంచి' సిద్ధాంత పరంగా రాసిన కథలు. 'ఏకరువు' ఒక కమర్షియల్ రయిటర్ ఏంగిల్‌నించి నరుకొచ్చిన కథ. వారపత్రికల్లో విరివిగా రేడియో సినిమాల్లో విపరీతంగా. ఎదురవుతున్న ఈ రచయితల ప్రధానఆశయం డబ్బు, తర్వాత కీర్తి. నిస్సందేహంగా జనాన్ని తప్పుదారి పట్టించటానికి కంకణం కట్టుకున్న చేత్తోనే కలం పట్టుకున్నారు ఈ రచయితలు అంటాడు ఎన్నెస్ 'తెలుగుకథ-ఇటీవల ధోరణులు' అన్న వ్యాసంలో, 'మంచి' కథలో అమాయకుడు గాంధీజీ, వినోబాబా, బాబాలూ చెప్పే మంచిమాటలతో మార్పు సాధించలేరని పోరాటంతో మాత్రమే మంచి సాధించుకోగలుగుతామని, ఆచరణతో అది సాధ్యమవుతుందని ఆమార్గాన పోతాడు. జానపదశైలిలో చెప్పుకుపోయిన కథ ఇది. బహుశా ఇలాంటి కథలు మన గ్రామాల్లోని చదువురాని ప్రజలకు వినిపించటానికి బాగా ఉపయోగపడతాయనుకుంటాను. పల్లెపాటల సౌలభ్యాన్ని విప్లవ కవులు తీసుకున్నట్టే జానపదశైలిలో కథచెప్పుకుపోయే పద్ధతి కథకులు సొంతం చేసుకోవచ్చు, కథలు వినిపించటానికి నెరేటివ్‌పద్ధతి పనికొచ్చినంతగా డిస్క్రిప్టివ్ పద్ధతి పనికిరాదు. 'మంచి' కథ తార్కిక భావాల గొలుసు. దోపిడీ వర్గం చివరికి తన సంతానాన్నికూడా క్షమించదు- వర్గప్రయోజనాన్ని కాదన్నప్పుడు. మానవత్వ విలువల పతనానికి ఇంతకంటెమించిన ఆధారంఉండదు ఫ్యూడల్‌రాచరికంలో తండ్రులు కొడుకులను చంపించడం, తల్లులు కొడుకులను చంపించడం, అన్నదమ్ములు చంపుకోవడం- ఈ హత్యలను రాజ్యాధికారంతో ముడిపెట్టి కీర్తించడం విపరీతంగాకన్పిస్తాయి. మొగలాయి దర్బారు కుట్రలు ఇలాంటివే. హింస పాశవికస్థాయికి నిరంకుశరూపాన్ని చేపట్టుంది వర్గసమాజంలో.

'సోల్ మెండర్' కథలో చెప్పులుకుట్టే అప్పలకొండ ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్స్ జూనియర్స్‌చేత చేయించే సిగ్గుమాలిన పనులను మెత్త మెత్తగా మందలిస్తాడు. పితృహృదయం వాడి మాటల్లో ధ్వనిస్తుంది. శ్రామికవర్గంలో ఉదాత్తత, ప్రేమ, కరుణ ఆ మాటల్లో వినిపిస్తాయి. అందుకే ఈ చదువుల్ని 'నాకు తెలకడుగుతాను, ఇదే నేటి మీ ఇంజనీరు సదువులో సెప్పేది? ఎందుకు బాబూ యీ సదువులు. తోటి మనిసితో మెసలడం తెలకపోనాక?' అంటాడు. నైతికంగా పతనమైపోయిన విద్యాప్రమాణాలను, సామాజిక ప్రయోజనాలకు దూరమైపోయిన విద్యావిధానాన్ని ఎత్తిచూపుతాయి ఆ మాటలు. ఇలాంటిదే చదువుకున్నోళ్ళకంటె చాకలి నయం అన్న సూక్తి. బూర్జువా చదువులు ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువ మూర్ఖులు అవుతారన్న దోపిడీ చదువుల వెనక కుట్రను బట్టబయలు చెయ్యటమే యిక్కడ రచయిత ఉద్దేశం.

'మనిషి-మహిషి' 'మొదటిరాత్రి' 'దరమ పెబువులు' ఎన్నెస్ తొలి కథలు. వాటిల్లో సాంసారిక జీవితంలోని సాధారణమైన ఘట్టాలను తీసుకున్నాడు. మొత్తం రచనలను సంపుటిగా తెచ్చిన ప్రయత్నంలో వాటిని చేర్చడం జరిగింది. మిగిలిన కథల స్థాయిలో చూస్తే ఇవి కొత్తలో రాసినవి అన్నది స్పష్టంగా కనబడుతుంది. మార్క్సిస్ట్ అవగాహనకి ముందురాసిన కథలు అవి.

అసంపూర్తి కథలు మూడున్నాయి. వాటిల్లో 'నటపూజ' తారల అభిమాన సంఘాల మీద గురిపెట్టిన రచన. మృత్యుంజయరావుని రిమాండ్‌లో ఉంచి పెట్టున్న చిత్రహింసలు వస్తువుగా, నికృష్టమైన పోలీసుల బతుకులను చిత్రిస్తూ సాగిన మరో అసంపూర్తి రచన- పేరుకూడా పెట్టకుండా- మైకెలేంజలో, లియొనార్డ్ దావిన్సీల పూర్తిచేయని అపూర్వ కళాఖండాల్లాంటి రచనలు. వాటి ఎత్తుగడే మనల్ని ఆకట్టుకుంటుంది. మృత్యుంజయరావు సెల్లో పచ్చిపుండులాగ వున్న శరీరంతో పోలీసు చిత్రహింసలకు బాధపడుతుంటాడు. సెల్ బయిట పోలీసు, అప్పలకొండ ఆకలితో నకనకలాడిపోతుంటాడు. రైటర్ బూతుకథల పుస్తకాన్ని అప్పలకొండ దగ్గర్నించి తీసుకునిదాంట్లో మునిగిపోతాడు... ఈ కథ ఎక్కడికి వెళ్ళేదో మృత్యుంజయం(నక్సలైట్) ఏం చేసేవాడో, ఆ జైలు ఏమయ్యేదో-

ఎన్నెస్ ప్రతి కథలోనూ కొత్త శిల్పాన్ని, కొత్తధ్వనిని, భిన్నమైన వేగాన్ని, విలక్షణమైన ఒక వాతావరణాన్ని సృష్టిస్తాడు. కళారూపంలో నిండుతనం, వైవిధ్యం సాధిస్తాడు. కొత్త కోణంనించి ఆరంభమవుతుంది ప్రతీ కథ. తన పాత్రలకీ, కథా వస్తువుకీ అవసరమయిన ఒకానొక సంఘటన తీసుకుని అక్కడ ఆరంభిస్తాడు రచనని.

మోణింగ్ వాక్‌లో 'ది ఫ్రెండ్స్', నర్సింహంగారి బంగ్లాలో 'పేపర్ టైగర్', అర్థ రాత్రి పీడకలతో 'రగులుకొనే రాక్షసిబొగ్గు'. ప్యూన్ రావులు గేదెలసాలదగ్గర అప్పు కోసం తచ్చాడుతూ 'డబ్బు'; చాలాసార్లు ఒకే సంఘటనలో కథ పూర్తవుతుంది. ఇది ఎన్నెస్ పాటించిన మరొక సూత్రం. విశాఖ మాండలీకాన్నీ, నుడికారాన్నీ బలంగా ఉపయోగించుకోవడం ఎన్నెస్ మరొక విలక్షణత. ప్రజల భాష ప్రజలతో సంబంధ మున్నవాళ్ళకే అలవడుతుంది. పత్రికల్లో, పుస్తకాల్లో చదివి నేర్చుకున్నభాషకీ, ప్రజల దగ్గర్నించి నేర్చుకున్నభాషకీ చాల పెద్ద భేదముంది. ప్రజల భాష కమర్షియల్ రచ యితలకి ఒకంతట కొరుకుడు పడదు. వీళ్ళు తమ భాషా ప్రయోగాలతో తమ దొల్ల తనాన్ని కప్పిపుచ్చుకుంటారు. స్వీయాత్మక ధోరణులకీ, మానసిక ప్రపంచానికి వీళ్ళు బందీలయి అసలు ప్రపంచాన్ని భౌతికంగా చూట్టానికి భయపడే మనస్తత్వాన్ని పెంచు కుంటారు. ప్రజల భాష నేర్చుకోవాలన్న సిద్ధాంతాన్ని అంగీకరించలేక చివరికి ప్రజల ప్రయోజనానికి సామాజిక బాధ్యతలకి దూరమవుతారు. ప్రజల భాష, పలుకుబళ్లు నేర్చు కునే రచయిత ప్రజల ఆలోచనలు, వాళ్లు బతుకుతున్న వ్యవస్థను మరింత సన్నిహితంగా వస్తుగత అవగాహనతో, సామాజిక చైతన్యంతో రాయగలుగుతారు. ప్రజలభాషలో రాయటం అర్థం చేసుకోవటం రెండూ మధ్య తరగతినించి వచ్చిన రచయితలకి శ్రమతో కూడుకున్న సాధన. తొందరగా అలవడదు. రాచకొండ, కాళీపట్నం యీ దారిలో చేసిన కృషివలన వారి ప్రభావంలోవున్న యువరచయితల్లో యీ మాండలిక నుడికారం బలంగా కన్పిస్తుంది. ఎన్నెస్ భాష అందానికి ఇదొక కారణం. కుటుంబరావుగారి శైలిలోని తార్కిక స్వభావం ఎన్నెస్ వాక్యంలోవుంది. భావ తీవ్రత ఆలోచనల్ని రేకె త్తిస్తుంది. చప్పున చల్లారిపోదు. నివురుగప్పి మండుతుంది. ప్రవాహశీలత కలిగి వుంటుంది. చేతితో గుండెను స్పర్శించినట్టుగా ప్రాకృతమైన ఒక బలం ఆవాక్యాల్లో. అప్రయత్నంగా, నిరాడంబరంగా సాగుతుంది రచన.

ఈ కథలన్నీ కదిలేవీ, కదిలించేవీ, మునుముందుకు నడిపించేవీ అని పురాణం సుబ్రమణ్యశర్మగారు పరిచయంలో చెప్పారు. ఎన్నెస్ తన వ్యాసంలో రాసినట్టు 'తెలుగు కథానికకి ఇది రావిశాస్త్రి యుగం' ఆ యుగంలో వచ్చిన గొప్పకథల్లో 'ఎన్నెస్‌కథలు' నిస్సందేహంగా పేర్కొందగ్గ సంపుటి.

— శ్రీపతి

'ఓటమి తిరుగుబాటు'- నగుబాటు

(గత సంచిక తరువాయి)

జ్వాలాముఖికి మార్క్సిస్టు పదజాలంతోనూ పరిచయంవుంది. కమ్యూనిస్టు పార్టీ అర్ధశతాబ్దంనుంచీ వుందికదా. మార్క్సిజం తెలిసినా తెలీకపోయినా పదజాలంమాత్రం చాలా మందికి పట్టుబడింది. జ్వాలాముఖి రాసిన "హింస విప్లవానికి మంత్రసాని"అనే రచనలో ఈ పదజాలం కనిపిస్తుంది. ఇది కూడా కొత్త పంగనామం. ముందు దాని దిగంబరనామం 'శస్త్ర చికిత్స'. ఇంతకీ ఇక్కడ 'బలప్రయోగం'అని వుంటే 'హింస' అని మార్క్సిస్టు సూత్రీకరణే మార్చేశాడు 'బలప్రయోగం' అనే మాటలో ధ్వనించే విప్లవార్థం 'హింస'లో ధ్వనించదని తెలిస్తేగదా ! ఈ రచనలో 'మార్క్సీయమైన ఒక సూత్రాన్ని తీసుకొని వర్గరాజకీయాలకు దేశీయంగా పరిష్కారాన్ని సూచించాను' (P XI) వర్గరాజకీయాలకు ఎక్కడైనా ఏ దేశంలోఅయినా పరిష్కారం ఒక్కటే- అదే విప్లవం. పరిష్కారాలు దేశీయంగా వుండవు. కాకపోతే విప్లవం తీసుకునే రూపంలో తేడాలు వుండవచ్చును. "పాత సమాజపు గర్భంలో కొత్త సమాజం యిమిడి వుంటుంది" అని మార్క్సిస్టులు చెపుతారు. దీన్ని 'భారతమాత' గర్భంగా తీసుకొని పురాణకథలో గర్భధారణ వుదంతాలను స్ఫురింపచేసే విధంగా ఒక కాశీమజిలీ కథ అల్లాడు జ్వాలాముఖి. నూతన సమాజం కోసం పడే ప్రసవవేదన చాలా వున్నతమైనదశ. దాన్ని "ప్రవర్ధమాన ప్రసవవేదన గడ్డకట్టిన వ్రణమై బాధిస్తున్నది". "విషమై వేధించే గర్భభారం" గర్భంలో ధరించినది నూతన సమాజంకదా. అది విషమై వేధించటం ఏమిటి ? ఈ స్థితిలో "భరతమాతను శాశ్వత రోగినిచేసి చెరిచాయి"అని రాయటం ఏమిటి ? భరతమాత అనే ప్రచారంతో నాటి బంకింనుంచీ నేటి-కాంగ్రెసు, జనసంఘం వాళ్ళవరకు దేశంలో సంకుచిత దేశభక్తిని, జాతీయ వున్మాదాన్ని పెంచటానికి వుపయోగించుకుంటున్నారు ఇదే తెలిస్తేకదా !

"సామాజిక మౌలిక పరివర్తనకు హింస ప్రజాసేనాని" అట- (ఇది దిగంబరంగా రాసినప్పుడు లేదు- విప్లవకవిగా అవతారం ఎత్తింతర్వాత చేర్చాడు) ప్రజాసేనాని మార్క్సిస్టు సిద్ధాంతం. ఆ సిద్ధాంతం ఆచరణలోపెట్టి జనసమూహాన్ని పురోగమింపచేసే కార్మిక విప్లవ పార్టీ విప్లవ హింస ఎప్పుడూ హింస అనివార్యతను చెపుతూ, బూర్జువా, ఫాసిస్టు హింసలను హింసతో ఎదుర్కొంటుంది. 'ప్రజాసేన'లేనిదే విప్లవం వుండదు. విప్లవాన్ని నడపటానికి, విప్లవాన్ని కాపాడుకోటానికి, విప్లవాన్ని ముందుకు తీసుకుపోవటానికి ప్రజాసేన అవసరం. హింసకు సేనాధిపత్యం యిచ్చేవాడు ఫాసిస్టు. మార్క్సీయమైన సూత్రాన్ని తన చచ్చు కవిత్వం కోసం దిద్ది ఫాసిస్టు పరిష్కారాన్ని ఇస్తున్నాడు జ్వాలాముఖి.

ఆవేశం వుండటం అవసరమే. అందునా కవికి ఆవేశం సహజం. మార్క్సిస్టులు 'Emotional Consciousness' అని ఆవేశాన్ని చైతన్యంలో అంతర్భాగంగా, ఒక రకం చైతన్యంగా అంగీకరిస్తారు. "In his Conscious existence man is not only aware of things in preception and thought, but also feels his active relationship with things emotionally" ఆవేశంతోకూడిన చైతన్యంకూడా జీవితంలో అత్యవసరమైనభాగమే. జ్వాలాముఖిది చైతన్యానికి విడాకులిచ్చిన ఆవేశం. అదే దురావేశం. చిందులుతొక్కటానికి, విలువల్ని పాడుచేయటానికి అంటే వ్యక్తిగత అరాచకవాదానికి, శూన్యవాదానికిమాత్రమే దురావేశం పనికివస్తుంది. ఇలాంటివాళ్లు ఒక తీవ్రతనుంచీ మరోతీవ్రతకు అనాలోచితంగా పరుగుపెడుతుంటారు. ఈ స్వభావం వ్యక్తికీ వుద్యమాలకూ కూడా నష్టం. 'ఓటమి తిరుగుబాటు' రచన యీ దురావేశానికి రంగస్థలం. గణాచారి వేపమండల్తో చిందులుతొక్కినట్టుంది కానీ వ్యక్తిలో సామాజిక చైతన్యం, ఆ చైతన్యంనుంచీ వర్గపోరాటం, వర్గపోరాటం విప్లవస్థాయికిపోవటంమొదలైన క్రమగతులన్నిటికీ జ్వాలాముఖి ఈరచనలో 'తిలోదకాలు'ఇచ్చాడు. విప్లవాన్నిగూర్చి, తిరుగుబాటుగూర్చి పీడిత చైతన్యంగూర్చి విప్లవ ప్రతీఘాతుక అవగాహనకు ఈ 'ఓటమి తిరుగుబాటు' ప్రత్యక్షనిదర్శనం. ఇందులో ఒక వ్యక్తి తనను బాధపెట్టేవాళ్ళమీద తిరుగుబాటుచేస్తాడు. ఆ తిరుగుబాటు చేయటాన్ని ఒక గజ్జికుక్క ఆత్మరక్షణకోసం తనను హింసిస్తున్న జనంమీదపడి కరవటాన్నిచూసి నేర్చుకుంటాడు. ఈ విధంగా ఆ వ్యక్తి ఓటమినుంచీ తిరుగుబాటులోకి వస్తాడు. జ్వాలాముఖికూడా అలాగే తన ఓటమిని తెలియజేసే తన కవిత్వంనుంచీ తిరుగుబాటును చాటే కవితారచనస్థాయికి ఎదిగాడు ఇది స్థూలంగా ఈ గేయ వస్తువు. ఇందులో కథానాయకుడు ఏ వర్గంవాడో తెలీదు. మొత్తంమీద పీడితుడు. ఆత్మహత్యకు పూనుకున్నాడు. ఈ అకార్యానికిపాల్పడదంటేనే చైతన్యంలేదని తెలుస్తోంది. రచనలో సన్నివేశాన్ని 'సంభవనీయత' (Probability) కు దగ్గరగా నిర్మించాలి లేకపోతే కవిత్వంలో వాస్తవికత దెబ్బతింటుంది. వాస్తవికతావాదాన్ని ఆదిలో చేపట్టిన బూర్జువాలు రానురాను వాస్తవికతకు వ్యతిరేకంగా తిరోగమించారు. అతిశయోక్తి వాస్తవికతకు శత్రువు గజ్జికుక్కను తరమటానికి పోనీ చంపటానికి "బొజ్జలున్న దోపిడీగాళ్ళ"నుంచీ మొత్తం మూడుపేజీల జనం ఎగబడింది ఇందులో—

"చల్లగరేసుకు తిరిగే
ప్రక్షిప్త కామాగ్నులు"

"శ్రేష్ఠస్థలనులు" కూడా చేరారు. ఈ చేరిన జనంమీదకూడా జ్వాలాముఖికి వర్గజ్ఞానంలేదు. దురావేశంలో అందరినీ చేర్చాడు. ఈ సన్నివేశంఅంతా అతిశయోక్తితో

నిండింది. అంతా పులుముడు. సరే ఆ కుక్క మొత్తం అందరికీఎదురుతిరిగింది. అందరినీ వేలాది జనాన్ని గాయపరిచింది. అంతా పరుగుతీశారు. ఇదొక అతిశయోక్తి. "గడ్డం పీకిపారేసినా, స్త్రీ చన్ను నూడబెరికినా" వాళ్ళ దగ్గర రాళ్లు వుండి. బరిసెలు వుండి. బడితెలు వుండి ఆ కుక్కను చంపకుండా వదిలేశారు. ఎందుకని ? జ్వాలాముఖి ఇష్టంకదా! ఇదిచూసి ఆ వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నాన్నివిడిచి ఆయుధాలను ధరించి విప్లవకారుడయ్యాడు ఇది కుక్క చైతన్యం. ఇదే జ్వాలాముఖి కథానాయకుని చైతన్యం. ఇది ఓటమి తిరుగుబాటుకాదు. ఓటమి–తిరుగుబాటు, నగుబాటు.

దిగంబర కవితల్లో విప్లవ కవిత్వ పదజాలాన్ని చేర్చటం. ఇది జ్వాలాముఖి సంస్కారానికి సంబంధించిన దోషం—

"వలస వ్యాధిగ్రస్త దేశాల్ని ఈ శతాబ్దపు వియత్నాం వ్రణాన్ని ఒకసారి పంచభూతాల్ని ఆపి పోరాటాల విముక్తి ఆరాటాల్ని చూపాలనుంది"

'సూర్యస్నానం' పేరుతో 65 లో రాసిన రచనలో ఇవి చేర్చాడు.

"పేదల ఆక్రందనల చిందుల్ని
వర్గసమాజం వినోదిస్తున్నది"
"వారిని పుద్యమాలు వాడుకున్నాయి
విప్లవాలు దారిలో విడిచి పోయాయి" (కిలికించితం)

"విముక్తి – విముక్తి
భూతకాలంనుండి విముక్తి
....
కొత్త కోసం
అసాంతం మార్పుకోసం గాఢానురక్తి" (విముక్తి)

ఇవి వాక్యాలకు వాక్యాలే చేర్చిన సందర్భాలు— దాదాపు వందసందర్భాలలో మాటల్ని మార్చటంవల్ల విప్లవ కవిత్వంగా భ్రమింపచేయటం— విప్లవ విముక్తి పోరాటాలు.

సామూహిక కుట్ర చట్రాల జాతీయ దాడుల అంచెలవారీ పథకాలు— (84)
ఈపోరాటాన్ని ఈ తిరుగుబాటును (82)
"శాంతి భద్రతలు సామరస్య వాదులు" (81)
దోపిడీగాళ్ళ ప్రజాస్వామ్యం వేటగాళ్లు (77)
"జ్యుడీషియరీ ఎగ్జిక్యూటీవ్ పార్లమెంటరీ
తత్వత్రియాల తొక్కిసలాటలో" (74)

ఇలా అనేక సందర్భాల్లో జ్వాలాముఖి విప్లవ పదజాలాన్ని చేర్చాడు. దీన్నిబట్టి దిగంబర పూర్వదశలోని కవితల్లోకూడా మార్పుచేశాడని భావించవచ్చును. విప్లవ

కవిత్వ పదాలు చేర్చినంతమాత్రాన దిగంబర కవిత విప్లవ కవిత్వం అయిపోతుందను కోవటం పెద్ద భ్రమ— దిగంబర కవిత్వంలో బూతులు అభ్యంతరంలేదు కానీ విప్లవ కవిత్వంలో ఎంతో అవసరమైతేనే వుపయోగించాలి— యువతరం దిగంబర ప్రభావం నుంచి విముక్తి కావాలి— వర్గశత్రువును, విప్లవవర్గాలను, వైరుధ్యాలఘర్షణను విప్లవ కవులు శాస్త్రీయ పరిజ్ఞానంతో గానంచేయాలి.

జ్వాలాముఖి దిగంబర, ఫ్యూడల్ ధోరణులనుంచీ బయటపడకుండా, విప్లవకవిత్వాన్ని ఆ ధోరణుల్లోకి తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్నాడు. విప్లవ కవిత్వాన్ని దిగంబరం చేసి సనాతనీకరిస్తున్నాడు, 'ఎరుపునిజం' విప్లవానికి నాటిన ఎరుపుగా చెప్పుకున్నాడు. ఆత్మవిమర్శ పేరుతో చేసుకున్న ఆత్మస్తోత్రానికి యిది పరాకాష్ఠ. 'ఎరుపు నిజం' కవితావస్తువుమీద విముక్తి పోరాటాల ప్రభావం వుంది. వర్గసమాజ చరిత్రలో తిరోగామివర్గాన్ని పురోగామివర్గం బలప్రయోగంతో ఓడించి అధికారాన్ని చేపడుతుంది. ఉత్పత్తి శక్తులకు వుత్పత్తి సంబంధాలకు వైరుధ్యాలు నిశితమైనప్పుడు సమాజం ఒక చారిత్రిక దశనుంచీ మరొక చారిత్రిక దశకు పురోగమిస్తుంది. సమాజ పరిణామాలకు వర్గాల ఘర్షణే పునాది. ఇది శాస్త్రీయమైన అవగాహన ఇందులో బద్ధంకానిది ఏదీ లేదు. 'అబద్ధ అధికారి'అని పాలకవర్గాలు బద్ధంకానివిగా జ్వాలాముఖి ఎరుపు నిజంలో చిత్రించాడు. ఇది అశాస్త్రీయం. ఇందులోనూ 'అహంత'లు 'నైవేద్యాల' వాసనలు వుండనే వున్నాయి. ఈ సంకలనంలోలేని, కావాలని చేర్చని విప్లవం ఆగదు సత్యం చావదు, విప్లవ త్రిశరణాలులాటి కొద్ది గేయాల్లో వస్తువుమీద పోరాటప్రభావం వున్నా శిల్పం విప్లవ కవిత్వానికి అనుగుణ్యంగాలేదు ముఖ్యంగా 'భాష'విషయంలో ఏమాత్రం అభివృద్ధి సాధించలేదు— కార్మికవర్గ రాజకీయాలు చెప్పటానికి గ్రాంధిక సన్నిహితమైన భాష పనికిరాదు

"Many artists and writers withdrawing themselves from the people into a void, are ofcourse unfamiliar with the people's language and thus their workes are not only written in a language without Savour or Sap but often Contain awkward expressions of their own language" –'MAO'

విప్లవకవి వర్గాలను, వర్గ సంబంధాలను, వర్గ మనస్తత్వాన్ని, వర్గ పదజాలాన్ని నిశితంగా అధ్యయనం చేయాలి. జ్వాలాముఖి అభివ్యక్తి, భాష, పదబంధాలు విప్లవవస్తువుకు తగినవి కావు.

"మృతకరాళరాత్రి రక్తాంగణాన"
పీడక కాముక రాత్రి
అనాది అహంత

జన్మసిద్ధ నైవేద్యం, నపుంసక వీర్యం కాముక కసి, దుస్సహ దుర్గంధ దీర్ఘ క్రూర గర్భాయాసం, సృష్టి స్థితి లయ వికారాల చక్రనక్రాల స్వాహాకారాలు, మర్మ కర్మాంగణా మంగళవాద్యాలు, విప్లవ త్రిశరణాలు, హింసారిరంసా కంటకతరూపరీరంభాలు, నాగరికతా జిజీవిషవర్ష ప్రహారాలు, విజ్ఞావేరమ్మదం, రాగద్వేషాల క్రకచాలు" లాటి గ్రాంధిక మైన కృతకపదబంధాలంటే జ్వాలాముఖికి చాలా ఇష్టం.

సుదీర్ఘ మైన తన పీఠికను జ్వాలాముఖి రెండుభాగాలుగా రాసుకున్నాడు. మొదటి భాగంలో ఆత్మవిమర్శపేరుతో ఆత్మస్తోత్రం చేసుకున్నాడు. విమర్శకులదృష్టిని తప్పు త్రోవల్లోకి మళ్ళించటానికి పెద్ద ప్రయత్నం చేశాడు. పాతకాలంలో ఒకప్పుడు "సర్వ స్వతంత్ర మైన మానవ జ్ఞాననేత్రం" వుండేదట. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మానవజ్ఞానం సర్వస్వతంత్రమయింది కాదనేది ఏమాత్రం శాస్త్రజ్ఞానంవున్నా తెలుస్తుంది. ఇలాంటి భావవాదధోరణులతో పూర్వపీఠిక నిండివుంది.

ఉత్తర పీఠికలో తనకు తాను ఒక ప్రవక్తలా అహంకరించాడు. విప్లవాన్ని గూర్చి, ప్రస్తుత ప్రజాపోరాటాలనుగూర్చి తన మిడిమిడిజ్ఞానంతో తప్పుడుసూత్రీకరణలకు సాహసించాడు. సాహిత్యం, రాజకీయాలు బింబ, ప్రతిబింబాలని అశాస్త్రీయమైన సిద్ధాంతం చేశాడు. సాహిత్యం, రాజకీయాలు బింబ, ప్రతి బింబాలుకావు బింబానికి ప్రతిబింబానికి ఏమీ తేడా వుండదు. ఇది స్వభావవాదం కానీ మార్క్సిజం కాదు. 'Theory of Reflection' మార్క్సిజానికి ప్రాణం. సాహిత్యంలో వ్యక్తమయ్యే వస్తువు, భావప్రతిమలు సమాజంలో వుండేవే- భౌతిక వాస్తవికతలే- కానీ సాహిత్యం భౌతికమైన పదార్థాలకు కేవలం ప్రతిబింబంకాదు- వాస్తవ పదార్థం, సమగ్రంగా, ఆకర్షణీయంగా, సార్వజనీనంగా, ఆలోచనతోనిండిన సజీవ అనుభవంగా, కవి వ్యక్తిగత నైపుణ్యంతో చెక్కబడి సాహిత్య కళారూపాల్లో వ్యక్తం అవుతుంది- దీన్నే 'ప్రతిఫలవాదం' 'Theory of Reflection' అని మార్క్సిస్టులు చెప్తారు. కళాసాహిత్యవిమర్శలో యీ వాదం బాగా వుపకరిస్తుంది. "వర్గచైతన్యం కొల్లగొట్ట బడింది" (P. 14) చైతన్యాన్ని కొల్లగట్టగలిగేవాడు ప్రపంచంలో వుండడు. వర్గచైతన్యం ఎప్పుడూ వుంటుంది. భౌతిక పరిస్థితులనుబట్టి అనేకరూపాల్లో వ్యక్తం అవుతుంది. "ఈ జనం తన వర్గచైతన్యాన్ని కోల్పోయింది"లాటి మాటలు మధ్యతరగతి అహంభావానికి, అజ్ఞానానికి చిహ్నం. "భావవిప్లవ తీవ్రవాదమట" మనది తీవ్రవాదమనేవాడు మన శత్రువు, మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానం మన విధానం. అదే మన దృష్టిలో నేటి మార్క్సిజం. సాహిత్యంమీద, చైతన్యంమీద ఇంత తప్పుడు అభిప్రాయాలను వ్యక్తంచేసిన జ్వాలాముఖి రాజకీయ కార్యాచరణకు, విప్లవకవితాచరణకు

బాలిశమైన గీతలు గీస్తున్నాడు. కవిచేతుల్లో రాజకీయాలు వుండటం ప్రమాదకరమట- సుబ్బారావు పాణిగ్రాహి సంగతి ఏమిటి ? ప్రపంచ విప్లవాలకు నాయకత్వం వహించిన అనేకమంది విప్లవకారులు కవులుకూడా- స్టాలిన్, మావో, హోచిమన్‌లు కవులుకదా! కవిహృదయం విప్లవకారుడికి అదనపు గుణమేకాని అవగుణంకాదు. జ్వాలాముఖిలాటి దురావేశపరుడు, దురహంకారి విప్లవానికి పనికిరాడు- విప్లవ సాంస్కృతికరంగానికి పనికిరాడు. ఎవరు ఏ రంగంలో పనిచేయాలి అనేది నిర్ణయించేది కార్మికవర్గ విప్లవ పార్టీ కానీ జ్వాలాముఖిలాటి వ్యక్తులు కారు. జనానికి అర్థమయ్యేటట్టు నాలుగువాక్యాలు రాయలేని జ్వాలాముఖి ఈ తలకుమించిన విషయాలజోలికి పోకుండా వుండటంమంచిది.

"సాహిత్యమూ, రాజకీయాలూ విడదీయరాని వర్గసమాజం వాస్తవాల"ట—వర్గ రహిత సమాజం సంగతి ఏమిటి ? ఈ రెండూ విడదీయరాని వాస్తవాలన్న సత్యం అనుభవంలోకి వర్గరహిత సమాజంలోనే జ్వాలాముఖి తననుగూర్చి "నాకు నా తలకు దారి చెడింది" అని చెప్పుకున్నది వాస్తవం.

— టి. యం. యస్.

"అజేయులం; ప్రపంచ విజేతలం"

"మేము సోషలిస్టులం" అంటే- మనుష్యులు స్వంతానికి ఆస్తిని సంపాదించుకోవడానికి వ్యతిరేకులం. వ్యక్తిపరంగా ఆస్తిసంపాదనవల్ల సంఘం విచ్ఛిన్నమవుతుంది. ప్రజలు ఒకరితో ఒకరు కలహిస్తారు. వ్యక్తిగతమైన లాభంకోసం, జనం ఒకరితో ఒకరు కలవకుండా విరోధపడుతూ వుంటారు. వైరుధ్యాన్ని కప్పిపుచ్చడానికి, సమర్థించడానికీ అబద్ధాలాడతారు. స్వంతఆస్తి జనాన్ని అబద్ధాలాడిస్తుంది. అవినీతిపరులను చేస్తుంది. దగా చేయిస్తుంది. ద్వేశాన్ని పెంచుతుంది ఏ సంఘం, వ్యక్తిని కేవలం కొద్దిమంది ధనవంతులనుచేసే సాధనంగా మాత్రమే భావిస్తుందో, ఆ సంఘం అమానుషమైనదనీ, మా ప్రయోజనాలకు భంగకరమైనదనీ మా విశ్వాసం. అలాటి సంఘం చెప్పే నీతులు శుద్ధ అబద్ధాలనీ, మోసపూరితములనీ భావిస్తూ వాటిని మేమంగీకరించడంలేదు. వ్యక్తిపట్ల ఈ సంఘం వ్యక్తపరిచే విద్వేషాన్నీ, దౌష్ట్యాన్నీ మేము ఖండిస్తున్నాం. ఈ సంఘం, వ్యక్తులను దాస్యశృంఖలాలతో బంధించడానికి చేసే సకల ప్రయత్నాలనూ మేము ఎదుర్కొంటాము. స్వార్థపరమైన ఆశకోసం మానవులను అణగదొక్కడానికి చేసే పనులను ప్రతిఘటిస్తాము. మేము కార్మికులం. అనగా ఎవరి కాయకష్టంచేత, పిల్లల ఆటవస్తువులు మొదలు పెద్దపెద్ద భారీయంత్రాలవరకూ తయా

రవుతున్నామో, ఆ కార్మికులం. అయినప్పటికీ మా మానవ ఔన్నత్యాన్ని రక్షించుకునే హక్కు మాకు లేకుండా చేయబడింది. తమ స్వార్థంకోసం ఎవరైనా మమ్మల్ని ఉపయోగించగలుగుతున్నారు. ప్రస్తుతానికి కొంత స్వేచ్ఛను సంపాదించాలనుకుంటున్నాం. ఆ స్వేచ్ఛమూలంగానే, యావత్తు శక్తినీ, మా కైవసం చేసుకోవలెననుకుంటున్నాం. మా నినాదాలు చాలా సూక్ష్మమైనవి. "వ్యక్తిగతమైన ఆస్తి నశించుగాక!" "ఉత్పత్తి సాధనాలన్నీ ప్రజల చేతుల్లోకి రావాలి!" "రాజకీయ అధికారమంతా ప్రజల చేతుల్లోకి రావాలి!" "పనిచేసే విషయంలో ఎవరికీ మినహాయింపులుండకూడదు!" ఈ నినాదాల వల్ల మేము కేవలం తిరుగుబాటుదారులం మాత్రమేకాదని మీరు తెలుసుకోగలరు.

"మేము విప్లవకారులం." ఎంతకాలమైతే, కొందరు ఏ పనిపాటలూ తాముచేయకుండా ఇతరులను ఆజ్ఞాపిస్తూ ఉంటారో, మరికొందరు పనిచేయడంతప్ప ఇంకేమీ చేయకుండా ఉంటారో, అంతకాలంవరకూ మేము విప్లవకారులుగానే ఉంటాం. జడ్జీలైన మీరు ఏ సంఘంయొక్క క్షేమ లాభాలను సంరక్షించడానికి ఆజ్ఞాబద్ధులై ఉన్నారో, ఆ సంఘానికి మేము బద్ధవిరోధులం. ఆ సంఘానికీ మీకూ కూడా మేము విరోధులం. మా పోరాటంలో మేము విజయాన్ని సాధించేవరకూ మనకు ఏవిధమైన రాజీ సాధ్యం కాదు. కార్మికులమైన మేము జయించితీరుతాం! మీ అధికారులు తామనుకునేటంత బలవంతులుకారు. దేనిని ప్రోవుచేసుకుని రక్షించుకోవడంకోసం తమ ఆధీనంలో ఉన్న లక్షలాదిజీవుల ప్రాణాలను వారు ఆహుతిచేస్తున్నారో, ఏదైతే మాపై అధికారం చలాయించే శక్తిని వారికిస్తున్నదో, ఆ వ్యక్తిపరమైన ఆస్తే, వాళ్ళల్లో వాళ్ళకు సంఘర్షణకు కారణమవుతుంది. దానిమూలంగానే వారు భౌతికంగాను నైతికంగానూకూడా నాశనమవుతారు. స్వంత ఆస్తిని సంరక్షించుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం.

నిజానికి మా యజమానులైన మీరంతా, మాకన్నకూడా ఎక్కువైన బానిసలు. మేము శారీరకంగానే బానిసలం- మీరు ఆధ్యాత్మికంగా బానిసలు. అభ్యాసం, ద్వేషం అనే కాడిని మీ మెడమీదనుంచి మీరు తొలగించలేకుండా ఉన్నారు. ఆ కాడే మిమ్మల్ని ఆధ్యాత్మికంగా చంపేసింది. ఆధ్యాత్మికమైన స్వేచ్ఛను అనుభవించడానికి మాకడ్డేమీ లేదు. మీరు మాచేత తినిపించే విషాలు మీరు ఇష్టంలేకపోయినా మా తలకెక్కించే విరుగుళ్ళకన్న బలహీనమైనవి. సత్యాన్ని గురించి మా విజ్ఞానం రోజురోజుకూ పెరుగుతోంది. ఆధ్యాత్మికమైన పవిత్రతగల వాళ్ళందరినీ, మీ వర్గాల్లోంచికూడా ఉత్తములైన వారినీ- ఈ సత్యం ఆకర్షిస్తోంది. కొంచెం పరిశీలించండి. మీ వర్గంయొక్క భావాలను సమర్థించగలవాడెవ్వడూ మీలో ఇప్పటికీ లేడు. చారిత్రక న్యాయంయొక్క వత్తిడినుండి మీరు అణిగిపోకుండా రక్షించుకోగల వాదనాసమర్థత మీలో ఏహ్యమైపో

యింది. మీరు నూతన భావాలను సృష్టించలేకపోతున్నారు. ఆధ్యాత్మికంగా మీరు శూన్యమైపోయారు. మా భావాలు పెరుగుతున్నాయి, బలాన్ని పుంజుకుంటున్నాయి, సామాన్య జనాన్ని ఉత్తేజపరచి వాళ్ళను స్వాతంత్ర్య పోరాటానికి సమీకరణం చేస్తున్నాయి. శ్రామికవర్గాలవారు తాము ధరించవలసిన పాత్రను గుర్తించిన కారణంచేత ప్రపంచంలో ఉండే శ్రమజీవులంతా ఒక్కటైపోతున్నారు. ప్రపంచానికి వాళ్ళు తెస్తున్న పునరుజ్జీవనాన్ని ఆపడానికి, క్రౌర్యమూ, పరిహాసమూ తప్ప మీదగ్గర మరేసాధనమూ లేదు. పరిహాసం స్పష్టంగానే కనబడుతోంది క్రౌర్యం మరింత రేప్పెడుతుంది. ఈనాడు మా కుత్తుకలమీదనున్న చేతులే రేపు మమ్మలను సోదరభావంతో కౌగలించు కుంటాయి. మీశక్తి బంగారాన్ని పెంచే యాంత్రిక శక్తి మాత్రమే. ఆశక్తే మిమ్మల్ని ఒకరినొకరు మ్రింగేద్దామనుకునే వర్గాలుగా చీలుస్తుంది. శ్రమజీవులందరూ ఒక్కటే నని రోజురోజుకూ వృద్ధవుతూన్న సజీవమైన మా శక్తి మా చైతన్యంలోనే ఉంది. మీరు చేస్తున్నదంతా అపరాధం; ఏమంటే, అవి ప్రజలను బానిసలుగా చేస్తుంది. మీ అబద్ధాలు, మీ ఆశలు, మీ దుర్మార్గం ఇవి ప్రజలను భయపెట్టే పిశాచాలూ, రాక్షసులూ ఉండే ప్రపంచాన్ని సృష్టించాయి. ఈ రాక్షసుల బారినుండి జనాన్ని తప్పించడం మావంతు మీరు మానవుడిని జీవితాన్నుంచి విడదీసి నాశనంచేశారు. మీరు నాశనం చేసిన ప్రపంచాన్ని సోషలిజం చేపట్టి, ఒక బ్రహ్మాండమైన ప్రపంచంగా పునర్నిర్మాణం చేస్తుంది దానినాపడానికి మీరేమీ చేయలేరు :"

[గోర్కీ– 'అమ్మ' నుండి– పావెల్ కోర్టు ఉపన్యాసం]

వెలుగుతున్న ప్రపంచ మానవుడు; నాయకుడు: లెనిన్

ఆయనరూపాన్ని చిత్రించడం చాలా కష్టమైన పని. ఆయన నిరాడంబరుడు, తాను చెప్పే మాటలలాగానే సూటియైన వ్యక్తి.

ఆయన పరాక్రమానికి యించుమించుగా ఏమీ బాహ్యమైన తళ తళలుండవు. రష్యాతో తరచుగాకానవచ్చే నిష్కపటుడైన, వివేకవంతుడైన, వినయశీలంగల విరాగి స్వార్థరాహిత్యం ఆయన పరాక్రమం; ప్రపంచంలో సాంఘిక న్యాయం సుస్థాపితం కాగలదన్న దృఢవిశ్వాసంగల వ్యక్తిపరాక్రమం, ఆయన పరాక్రమం: మానవసౌఖ్యం శ్రమించేందుకు ప్రపంచ సౌఖ్యాలన్నిటినీ పరిత్యజించిన వ్యక్తి పరాక్రమం, ఆయన పరాక్రమం... వక్తగా ఆయనకలిగించే అసాధారణమైన అభిప్రాయాన్ని తెలియజేయటం చాలా కష్టం.

ముందుకు చాచి కొస్తంత పైకిలేచిన ఆయనచేయి, తాను అనే ప్రతిమాటనూ తూచుచూ వున్నట్టుగా కనిపించే ఆయన అరచేయి—ప్రతికక్షుల మాటలను పారవేస్తూ వాటికిబదులుగా నికరమైన ప్రతిపాదనలను చేస్తున్నట్టుగా కనిపిస్తాయి. మితవాద బూర్జువావర్గం వెనుకనుగాని, పక్కగా సైతంకాకుండా, తన స్వీయమార్గాన సాగిపోవడానికి శ్రామికవర్గానికిగల హక్కులనునిరూపణగా కనిపిస్తాయవి. దీనిని లెనిన్ తనకు తానుగాక, చరిత్ర అభిమతమైనట్టుగా తెలుపుతారు. ఆయన ప్రపంచంలోని నిండుతనం సంపూర్ణత్వం, సూటిదనం, బలం, లెనిన్ యొక్క సర్వమూ— ఒక మహత్తర కళా రచనలావుంటుంది. దానిలో ప్రతి ఒక్కటీ వుంటుంది ఎక్కువగా ఏమీ వుండదు. బాహ్యాకర్షణలేవీ వుండవు- ఏవైనా వున్నట్టయితే మీకవి కనిపించవు ముఖానికి రెండు కళ్లు, చేతికి ఐదువేళ్ళు అవసరమైనంతగా అవి అవసరం.

ఇక కాలం విషయం. ఆయన తనకుముందర మాటాడిన వక్తలకంటె తక్కువగా మాటాడేవారు కానయితే అయన ఎక్కువగా మాటాడేరని అనిపించేది. ఇలా అనుకున్నవాణ్ణి నేను ఒక్కణ్నేకాదు. నాకు వెనుకనున్నవారు "యీయన ఎన్నో విషయాలు చెప్పా"రని సంతోషంగా గుసగుసలాడుకునేవారు.

అదలావుంచండి. ఆయనచెప్పే ప్రతి ఒక్కవాదన దానిలోని శక్తి ప్రోద్బలం దానంతటదే వెలువడేది.

ఆయనకు అయస్కాంతపు గుణం వుంది. అది శ్రామికుల హృదయాలను ఆయనవద్దకు ఆకర్షించేది. ఆయన నవ్వు అందర్నీ అంటుకునేది- మనిషి అవివేకాన్నీ మనస్సులో జరిగే గారడీలనూ గ్రహించగల నిశితమైన బుద్ధివుండికూడా, "సామాన్య హృదయం"గల పసితనపు అమాయకత్వంతో ఆనందించగల నిండయిని నవ్వు అది.

...విస్పష్టంగా వ్యక్తంచేయబడిన ఆయన జీవనదీక్ష, దానిలో కుళ్ళివున్న ప్రతి దానిపట్ల ఆయనకు గల తీవ్ర విద్వేషం నన్ను ముగ్ధుణ్ని చేసింది. తాను చేసిన ప్రతి ఒక్క పనిలోనూ ఆయన నింపిన యవ్వనోత్సాహాన్ని నేను మెచ్చుకున్నాను. పనిపట్ల ఆయనకుగల అమానుశశక్తి నన్ను ఆశ్చర్యపరిచింది. ఆయన కదలికలు తేలికగా, నేర్పుతో వుండేవి. దృఢంగావుండే ఆయన హావభావాలు ఆయన మాటలలో సమశ్రుతిలో వుండేవి. మంగోలియన్ జాతివారి తీరులోవుండే ఆయన ముఖంలో ఒక యోధుని నిశితమైన కళ్లు మండేవి, మెరిసేవి. అవి మండేవి, కాస్తగా మూసుకునేవి, తటపట కొట్టుకునేవి, వ్యంగ్యంగా చిరునవ్వేవి, ఆగ్రహంతో చిరునవ్వేవి! ఆగ్రహంతో జ్వలించేవి. ఆ కళ్ళలోని మెరుపు ఆయన మాటలను మరింత సూటిగా, స్పష్టంగా చేసేది.

అజేయమైన ఆయన ఆత్మబలం ఆయనకళ్ళలో మెరుస్తున్నట్టుగానూ, ఆమెరుపు నింపుకున్న మాటలు గాలిలో వెలుగుతున్నట్టుగానూ అప్పుడప్పుడు అనిపించేది. ఆయన మాటలు ఎప్పుడూ తిరుగులేని సత్యాన్ని తెలియజేసేవి.

ఆయనది ఉత్సాహకరమైనస్వభావం. కాని జూదగాని సాహసపుస్వభావం కాదు. తన లక్ష్యం గురించి దృఢవిశ్వాసంగల. ప్రపంచంతో తనకుగల సంబంధాలను బాగా గ్రహించి, ప్రపంచపు అరాచకంలో తనపాత్రను– అరాచక విరోధి పాత్రను నిజంగా తెలుసుకునివున్న వ్యక్తికి సహజమైన అపూర్వోత్సాహానికి చిహ్నం, ఆయనసాహసం. ఇంత ఉత్సాహంతోనూ ఆయన చదరంగంఆడగలిగేవారు, దుస్తుల చరిత్రను చదివేవారు. తన మిత్రునితో గంటలతరబడి వాదించేవారు, దక్షిణాది ఎండలకు మండే కాప్రీ రాళ్ళ దారులలో తిరిగేవారు. పొదల బంగారు రంగులనూ, జాలర్ల నల్లని పిల్లలనూ మెచ్చుకునేవారు.

....అద్భుతమైన దీక్షగల వ్యక్తి లెనిన్. బుద్ధి జీవులకుచెందిన అత్యుత్తమవిప్లవకారుల గుణాలు, ఆత్మహింసదాకా పోయే ఆత్మనిగ్రహం, లెనిన్‌కు అత్యున్నత ప్రమాణంలో వుండేవి. ఆకలి వ్యాపించి వున్న గడ్డు సంవత్సరం 1919 లో, తన కామ్రేడ్స్ నుండి, సైనికుల నుండీ, రాష్ట్రాల నుండి, రైతుల నుండీ వస్తువులువసే తీసుకోడానికి లెనిన్ సిగ్గుపడేవారు. ఏమంత బాగాలేని తన యింటికి ఆహారపదార్థాల పొట్లాలు వస్తే లెనిన్ చికాకుతో ముఖం చిట్లించుకుని వ్యాధిగ్రస్తులుగావుండే కామ్రేడ్స్‌కూ, ఆకలితో నీరసపడివున్న కామ్రేడ్స్‌కూ పిండినీ, పంచదారనూ, వెన్ననూ తొందర తొందరగా పంపివేసేవారు. ఒకసారి నన్ను భోజనానికి పిలుస్తూ ఆయన "పొగబెట్టిన హెర్రింగ్ చేపను మీకు పెడతాను. అది ఆస్ట్రఖాన్‌నుండి నాకు పంపబడింది" అన్నారు. తరవాత విశాలమైన తన నొసలు ముడతలుపడేలాగ చిట్లించి, సర్వమూ చూస్తూవుండే ఆ కళ్ళతో ఓరగాచూసి ఇలా చెప్పారు. "ఒక ప్రభువుకు పంపేటట్టుగా వాళ్లు నాకు ఆహారంపంపుతుంటారు: వాళ్ళనెలా ఆపాలో నాకు తెలియదు. నేను వద్దంటే వాళ్లు బాధపడతారు. నా చుట్టూరా వున్నవాళ్లు పస్తులు పడుతున్నారు."

ఎటువంటి ఆడంబరమూలేని, మద్యంగాని, పొగగాని అలవాటులేని, క్లిష్టమైన, కష్టమైన పనితో పొద్దుటినుండి రాత్రివరకూ సతమతమవుతూవుండే లెనిన్‌కు తనగురించి తాను ఎలా జాగ్రత్తపడాలో కొంచెంకూడా తెలియదు. కాని ఆయన తన కామ్రేడ్స్ గురించి ఎంతో శ్రద్ధ చూపేవారు.

...ప్రధాన శతఘ్ని శాఖకు వెళ్ళి, పూర్వం శతఘ్ని దళంలో పనిచేసిన ఒక బోల్షివిక్ తయారుచేసిన విమాన విధ్వంసక యంత్రాన్ని చూడమని నేనొకసారి ఆయనకు సూచించాను.

"అటువంటి విషయాల గురించి నాకేంతెలుసు?" అన్నారాయన. అయినా అక్కడికి వెళ్ళారు. ఆ చీకటిగదిలో, ఈ సాధనం వున్న బల్ల చుట్టూరా ఏడుగురు సేనానాయకులున్నారు. వాళ్ళంతా తలనెరిసినవాళ్లు, మీసాలతోవున్న వృద్ధులు. మామూలుదుస్తులు వేసుకునివున్న లెనిన్ నిగ్రహం, వారిమధ్య కంటికి ఆనకుండాపోయింది. ఆ యంత్రాన్ని తయారుచేసిన ఆయన తాను కనిపెట్టినదానిని వివరించడం మొదలు పెట్టాడు. అతను చెప్పినది ఒక నిమిషం విన్నాక, లెనిన్ దానిని ఆమోదిస్తూ 'అలాగా?' అని, ఆయనను రాజకీయ విషయాలగురించి పరీక్షిస్తూన్నంత సునాయాసంగా ప్రశ్నలడగడం మొదలు పెట్టారు.

"ఈ యంత్రపు పనిని ఎలా సమన్వయించగలిగారు? యంత్రపు పనిని చూపే భాగాన్ని శతఘ్నిదారిలో స్వయంచలనకంగా కలపడం సాధ్యపడదా?"

ఆయన అది గుళ్ళను వెదజల్లే ప్రదేశం గురించీ, యింకా దేనినో గురించీ అడిగాడు. ఆ యంత్ర నిర్మాత, జనరల్స్ సమాధానాలు చెప్పారు. మర్నాడు యంత్ర నిర్మాత నాతో యిలా అన్నారు:

"ఒక కామ్రేడ్‌తో మీరు వస్తారని, నేను జనరల్స్‌తోచెప్పాను. ఆ వచ్చేదెవరో నేను చెప్పలేదు. వారు లెనిన్‌ను పోల్చుకోలేదు. అట్టహాసమూ, అంగరక్షకులూ లేకుండా ఆయన వస్తారని వారు వూహించలేనట్టుంది."

"ఆయన సాంకేతిక నిపుణుడా? ఆచార్యుడా?" అని వాళ్లు నన్ను అడిగారు. "ఆయన లెనిన్!" అని నేను చెప్పితే వాళ్లు కంగారుపడ్డారు.

"ఏమిటీ! అసాధ్యం! మన రంగంగురించి ఆయనకు అంతగా ఎలాతెలుస్తుంది? ఆయన వేసిన ప్రశ్నలు ప్రవీణులడగవలసిన ప్రశ్నలు? ఆ రోజున లెనిన్ తమవద్దకు వచ్చారని వాళ్ళకింకా నమ్మకం కలుగలేదనుకుంటాను..."

ఇక లెనిన్ విషయం. శతఘ్ని ప్రధానస్థావరంనుండివస్తూ ఆయన ఉద్రేకంతో నవ్వుతూనే వున్నారు. ఆ యంత్రనిర్మాత గురించి మాటాడుతూ "రూపాన్నిబట్టి ఎవరినైనా సరిగా అంచనా వేయలేము! ఆయన నిజాయితీగల పాత కామ్రేడ్ అని నాకు తెలుసు, కాని అతను నక్షత్రాలను అందుకునేతరహా మనిషని అనుకోలేదు. కాని అతను సరిగ్గా అటువంటివాడే అయ్యాడు! మంచివాడు! ఆచరణలో దాని విలువను నేను సందేహించినప్పుడు ఆ జనరల్స్ ఎలా ముఖం చిట్లించుకున్నారో మీరు గమనించారా? నేనది కోరుండే చేశాను. ఆ తెలివైన సాధనం గురించి వాళ్లేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి."

ఆయన మళ్ళీ నవ్వుతూ యిలా అన్నారు: "ఆయన యింకొకటి కనిపెట్టారని మీరు అంటున్నారు. అది దేన్ని గురించి? ఆయన కనిపెట్టడంతప్ప ఇంకొకటి చేయ రాదు. ఈ సాంకేతిక నిపుణులకు మనం మంచి పరిస్థితుల్ని కల్పించగలిగితే! ఇరవై ఐదేళ్ళలో రష్యా ప్రపంచంలోకల్లా అగ్రరాజ్యమైపోతుంది."

అపును, కామ్రేడ్స్‌ను ఆయన పొగడుతూవుండడం నేను అనేకసార్లు విన్నాను. తాను సానుభూతిని చూపనివారితోకూడా ఎలా మాటాడాలో, యివ్వవలసిన విలువఎలా యివ్వాలో ఆయనకు తెలుసునని అంటారు.

శాశ్వతంగా సంస్మరించదానికి అర్హతగల వ్యక్తి, లెనిన్ వంటివారు ఇంకెవరూ లేరు. ఆయన ప్రతిభకూ, దీక్షకూ వారసులు జీవించి వున్నారు. ఏ కలంలోనైనా, ప్రపంచంలో మరెక్కడైనా ఇంకెవరూ పనిచెయ్యలేనంత బాగా వారు జీవించివుటూ పనిచేస్తూనే వున్నారు.

'లెనిన్ గురించి మాక్సింగోర్కీ జ్ఞాపకాలు'
[వి.ఐ. లెనిన్ అన్న గోర్కీ పుస్తకం నుండి]

శ్రామికవర్గ సంస్కృతి

శ్రామికవర్గ సంస్కృతి అనేది ఆకాశంనుండి ఊడిపడిందేమీకాదు. శ్రామికవర్గ సంస్కృతిలో నిష్ణాతులం అని చెప్పుకునేవారి సృష్టి అసలేకాదు- అలా అనటం బుద్ధి తక్కువ వాగుడుమాత్రమే.

పెట్టుబడిదారీ, భూస్వామ్య, అధికార దర్ప సమాజాల పెత్తనంకింద నలుగు తూనే మానవజాతి సంచయించిన విజ్ఞాన భాండారంనుండి సహేతుకంగా పెంపొందినదే శ్రామికవర్గ సంస్కృతి.

మానవజాతి సృజించిన ఈ మహాసంపద అంతటితోనూ నీ మేధస్సును సంప న్నం చేసుకున్నపుడే నీవు కమ్యూనిస్టువు కాగలవు.

— లెనిన్

"బూర్జువావర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా ముఖ్యమైనదేదంటే బూర్జువా వర్గానికి గోరీకట్టేవాళ్ళే- బూర్జువావర్గ పతనం, కార్మికవర్గ విజయం అనివార్యం_"

— కారల్ మార్క్స్

సోషల్ సామ్రాజ్యవాదుల రష్యాలో నేడు ప్రజల మానప్రాణాలకు భద్రతలేదు.

అమెరికా కమ్యూనిస్టుపార్టీకి VVAW బహిరంగలేఖ

1. అమెరికా కమ్యూనిస్టుపార్టీ (CPUSA) న్యూయార్క్.
2. జేమ్సు ఫారెస్టు, అమెరికా సెక్రటరీ, ప్రపంచ శాంతి సంఘం, ఫిన్లాండ్ (WPC) : లకు

National Steering Committee of Vietnam Veterans Against the War (VVAW)/ Winter Soldier Organisation (WSO)- ఈ రెండూ సంస్థలు ఓహియారాష్ట్రంలో ఇటీవల జరిగిన తమ జాతీయసదస్సులో తీర్మానించి బహిరంగపరచిన నిరసనలేఖ ఇది- 1973 అక్టోబరులో 24 నుండి 31 వరకు జరిగిన ప్రపంచ శాంతి సభలలో పాల్గొనుటకు మాస్కోకువచ్చిన ప్రతినిధులపై మాస్కో హోటలులో జరిగిన అఘాయిత్యంగూర్చి నవంబరు 8న VVAW/WSO జాతీయ కార్యాలయంవారు మీకు లేఖ రాయటం జరిగింది. ఆలేఖలో పేర్కొనబడినవిధంగా శాంతి సభలకువచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు ఒక హోటలులో బసచేశారు. విచారించవలసిన సంగతేమిటంటే- VVAW/WSO కు చెందిన మహిళా ప్రతినిధి నిద్రిస్తున్న హోటలు గదిలోకి దుర్మార్గుడొకడు చొరబడి, ఆమెను భయపెట్టి తన పశుబలంతో బలాత్కారంచేసి, మానభంగంచేసి పారిపోయాడు. ఈ అఘాయిత్యానికితోడు, సోవియటు పోలీసు అధికారులు ఆ మహిళా ప్రతినిధితో ప్రవర్తించిన వైఖరి పుండుమీద కారం చల్లినట్లుగావుంది.

ఈ అవాంఛనీయ సంఘటన ప్రజలకు, వివిధదేశాల ప్రతినిధులకు తెలిస్తే ఉద్రేకాలు పెరిగిపోతాయని, శాంతిసభ తన ఆశయం సాధించకుండా అర్థాంతరంగా ఆగిపోవలసి వస్తుందేమోననే భయంతోనే, దీన్ని బయటకు పొక్కకుండా శాయశక్తులా ప్రయత్నించాము. కాని సోవియటు పోలీసు, అధికారులకు, మెడికల్ ఆఫీసర్లకు ఈ అఘాయిత్యంగురించి తెలిపినప్పుడు...... సోవియటు పోలీసు అధికారులు మా ప్రతినిధితో చాల హీనంగా, నీచంగా ప్రవర్తించారు. "పైవనికి నీవు ఇష్టపడ్డావా?" "అతనిని నీదగ్గరకు చేర్చుకోలేదా?" "అతనిని ప్రతిఘటించటానికి నీవు నిజంగా ప్రయత్నించావా?" అంటూ ఆమె నిజాయితీని శంకిస్తూ చికాగోలోని బీటు కానిస్టేబులులాగా సిగ్గులేని ప్రశ్నలడిగి తమ పోలీసు స్వభావాన్ని బయటపెట్టుకొన్నారు. అమెరికాలో వేశ్యాగృహాలలోనూ, మామూలుగానూ జరిగే ఈ బలాత్కార కేసులను అమెరికా పోలీసు అధికారులు ఎంత తక్కువ దృష్టితోనూ, నిర్లక్ష్యంగానూ చూస్తున్నారో, ప్రపంచశాంతి

సభలకు ప్రతినిధిగావచ్చిన ఈమెనుకూడా ఈ అఘాయిత్యంకేసులో అంత హీనంగా, నిర్లక్ష్యంగా సోవియటు పోలీసు అధికారులు ప్రవర్తించటం చాల విచారించవలసిన విషయం. "సోషలిస్టుదేశ"మనబడే రష్యాలో నైతిక విలువలు ఎంత అధోగతిపాలయ్యినవో పోలీసుల ప్రజా వ్యతిరేకధోరణి ఎంత కరుడుగట్టుకుపోయిందో పై సంఘటనే తెలుపుతున్నది.

పై సంఘటన క్షమించరానిదని. పై దురాగతాలకు క్షమాపణ ఇవ్వాలని, ఈ విషయాన్ని సోవియటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, కారకులైన దుష్టులను శిక్షించాలని—ప్రపంచ శాంతిసభలకు అమెరికా ప్రతినిధివర్గాన్ని అర్గనైజుచేసిన అమెరికా కమ్యూనిస్టుపార్టీ, అమెరికాలోని ప్రపంచశాంతి సంఘపు కార్యాలయానికీ లేఖలు వ్రాశాము. కాని మేమురాసిన లేఖలు పత్తాలేకుండాపోయినాయి. వాటితో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలోకాని, ప్రపంచ శాంతిసభల రిపోర్టులోగాని పైసంఘటన ఊసెత్తలేదు కూడ. అంటే ఈ దుర్ఘటనపై నిజాయితీతో పరిశీలన జరగడంలేదని తెలుస్తోంది.

ఈ నిర్లక్ష్యభావానికి, మానవత్వానికి మచ్చతెచ్చే ఈ అఘాత్యానికి CPUSA ను. సోవియటు పోలీసు అధికారులను. WPC అమెరికా సెక్రటరీ ఉదాసీన వైఖరిని. VVAW/WSO తీవ్రంగా ఖండించుతోంది. మాస్కోకు అమెరికా ప్రతినిధులను పంపిన CPUSA, WPC సంస్థలు, ఇంతదారుణం జరిగితే చీమకుట్టినట్టయినా వుండక పోవటం ఏమాత్రం క్షమించరాని విషయం. ఈ ఘోరం జరగటమేకాక, తర్వాత మా ప్రతినిధితో ప్రవర్తించినతీరు, కారకులైన దుర్మార్గులపై చర్యతీసుకోక పోవటం మా విమర్శకు జవాబుచెప్పకుండా నిర్లక్ష్యంగా చూడటంలాంటి సోవియటు పోలీసుల అహంకార ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాం. మా ప్రతినిధిఎడల, మా సంస్థ ఎడల మీరు తీసుకొన్న ఈ ఉదాసీనవైఖరిని మేము చూస్తూ కూర్చోలేం.

For National Sreering Committee,
The VVAW/WSO National office.
['The Call' మార్చి 74 నుండి కాలిఫోర్నియా]

[మనిషిని మనిషి దోచుకోడానికి. హింసించటానికి వీలులేకుండా ప్రజలందరకు రక్షణ కల్పించటానికై తమ జీవితాలనంకితంచేసిన లెనిన్ స్టాలిన్ల భూమిలో- ప్రపంచ శాంతిసభల ప్రతినిధుల మానప్రాణాలకే భద్రతలేకుండాపోతే సామాన్య ప్రజానీకం యొక్క పౌరహక్కులకు, ప్రాణాలకు విలువ యేమాత్రం వుంటుంది?. సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారిపోయిన సోవియటు యూనియన్‌లో నైతిక విలువలు. ప్రజాక్షేమం. ఎంత క్షీణించిపోయాయో తెలుసుకోవటానికి పైసంఘటన ఒక ఉదాహరణమాత్రమే].

నక్సలైట్ ఖైదీలఎడ రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నిరంకుశ చర్యలను ఖండించండి–

ఈ భారత అభివృద్ధి నిరోధక ప్రభుత్వం 27 సం॥ పరిపాలనలో బ్రిటిష్ వలస పాలన నాటి జైళ్ళలో ఏలాంటి మార్పులులేక వలసపాలన కంపుఘాటుగా యీనాటికీ కొట్టుచున్నది ఆనాటి వలసపాలన శిక్షణలో తర్ఫీదుపొందిన అధికారులే యీనాటికీ పరిపాలనలో ఉండి వలసపాలకులను మించిన నిరంకుశ పెత్తనంతో ఖైదీలను అణచుచున్నారు. ఆంధ్రదేశంలో అతిదారుణంగా, నిరంకుశంగా, ఖైదీలను అణచుచు, ఖైదీలను దోపిడీచేయుచున్న జైళ్ళలో రాజమండ్రి మొదటిది.

ఖైదీలకు యిచ్చు రేషన్ జైలుబయటే కంట్రాక్టర్లు, జైలు అధికారులు కుమ్మక్కయి అమ్మకొనుచున్నారు. లోపలకు వచ్చిన రేషన్‌లో సూపరింటెండెంట్ క్రింది ఉద్యోగులు తమ తమ వాటాలను పంచుకొంటారు. ఉప్పు, పప్పు, నూనె, కారము కూరగాయలులేని ఆహారపదార్థములు, ఖైదీలకు పంచుతున్నారు. సక్రమంగా రావల్సిన ఆహారం కోసరం పోరాడు ఖైదీలను కొట్టుచు, ఆలాంటి వారిని యితర జైళ్ళకు పంపుచు, పనిష్మెంట్సుయిస్తూ చిత్ర హింసలు చేయుచున్నారు.

ఖైదీలకు యివ్వవలసిన గుడ్డ సక్రమంగా ఇవ్వడంలేదు. ఖైదీలు అర్ధనగ్నంగా చినిగిన గుడ్డలతో బ్లాకులలో ప్రత్యక్షమవుతుంటారు. గుడ్డలకోసరం ఖైదీలు ఆఫీసర్లను అడిగారంటే వారికి పనిష్మెంటు, ట్రాన్స్‌ఫర్లు జరుగుతుంటాయి.

జైలు క్యాంటీనులో విపరీతమైన దోపిడీ జరుగుచున్నది. బయటినుంచి తెప్పించిన వస్తువులపైన విపరీతమైన ఎక్కువ ధరలతో జైలులో అమ్ముచున్నారు. టీ లో ఎక్కువ నీళ్లుకలిపి లాభాలు పొందుచున్నారు.

పైన జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా 1969 నుంచి అక్కడున్న కమ్యూనిష్టు పార్టీ(మా-లె) కార్యకర్తలు అనేక పోరాటములు జరుపుచున్నారు. తాత్కాలికంగా కొంత మెరుగుపరుచుచు, కొద్దికాలము జరిగినతర్వాత మరల మొదటివిధంగానే దోపిడీ చేయుచున్నారు.

జైలులో జరుగు దోపిడీకి వ్యతిరేకంగా, వారి నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా పోరాడగల శక్తిగల కమ్యూనిష్టు పార్టీ (మా-లె) కార్యకర్తలను అణచడానికి జైలు అధికార్లు స్థానిక పోలీసు అధికార్లతో కుమ్మక్కయి సరికొత్త కుట్ర పన్నినారు. అందులోని భాగంగానే జులై 31 వ తేదీ సాయంత్రం 5 గం॥లకు కమ్యూనిష్టు పార్టీ(మా-లె) కార్యకర్తలను లాకప్‌చేసి, రిజర్వు పోలీసులను జైలులోపలికి తీసుకొని వచ్చి ఒక్కొక్కరినే సోదాచేసి కండెం సెల్సులో నిర్బంధంలో వుంచినారు.

కండెంసెల్సు అంటే ఉరిశిక్షపడిన ఖయిదీలనుంచు బ్లాక్. ఆ బ్లాక్ చాలచిన్నది, గాలి, వెలుతురు సక్రమంగా అందవు. నీటికొళాయీలు లేవు, స్నానపుగదులు లేవు,

లేట్రిన్సు యిద్దరు ఉపయోగించడానికి మాత్రమే గలవు- అలాంటి బ్లాకులో కమ్యూనిస్టుపార్టీ(మా-లె)కార్యకర్తలను పెట్టి పగలుకూడ లాకప్‌లోపెట్టుచున్నారు. ఈ కార్యకర్తలంతా దీర్ఘకాలిక శిక్షలు పడినవారే. ఈ 1½ నెలలనుంచి వారు చాలబాధలకు గురగుచున్నారు. ఈ నిర్బంధమువల్ల కార్యకర్తల ఆరోగ్యం చాల దెబ్బతిన్నది. ఈ పాశవిక చర్యలను ప్రజలు ఖండించాలని కోరుచున్నాము.

కాం. కె. బండయ్య
కమ్యూనిస్టు పార్టీ(మా-లె)

23-8-74 అర్ధరాత్రి
పిచ్చిరెడ్డి కొట్టాల గ్రామ పేదరైతులపై జరిగిన పోలీసులదాడి

23-8-74 శుక్రవారం అర్ధరాత్రిపూట కనగానపల్లి సబ్‌ఇన్‌స్పెక్టరు అధ్వర్యంలో, కొంతమంది రిజర్వుపోలీసులు వెళ్ళి పిచ్చిరెడ్డికొట్టాల, గంగంపల్లి గ్రామాలలోని పేద వ్యవసాయకూలీల ఇండ్లపై దాడిజరిపి అమాయకులైన కొందరు యువకులను, కొట్టి, నానా భీభత్సంచేసి 8 మందిని అరెస్టుచేసి స్థానిక భూస్వాములు పెట్టిన తప్పుడుకేసులు నిర్వహించడానికి యీ పోలీసులు సహాయపడుతున్నారు.

దీనికి కారణమేమిటి,

19 8-5 మధ్యకాలంలో ధర్మవరం తా॥ నసనకోట ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యాన 'శివాయజమా' భూముల పోరాటంజరిపి కొన్నివేల యకరాలభూమిని పేదలు పంచుకొన్నసంగతి అందరికీతెలుసు కానీ 1957లో పార్టీ అనుసరించిన దివాలాకోరు రాజకీయాలవల్ల పేదలు స్వాధీనపరచుకొన్న కొంతభూమిని మధ్యతరగతి ధనిక రైతులకు దఖలుపరచడం జరిగింది. దాని ఫలితంగా ఆనాడు పోరాటంలో అనేక కష్టనష్టాలకు గురియైన కొందరు వ్యవసాయకూలీలు నిరాశ్రయులయ్యారు. ఆ తరవాత 1964లో కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలినపుడు మార్క్సిస్టుపార్టీవారు న్యాయం కలుగజేస్తారని అక్కడిప్రజలు ఎదురుచూచారు. ఐతే అప్పటికే గ్రామ రాజకీయాల్లో కూరుకుపోయిన మార్క్సిస్టులు ప్రజల పరిస్థితిని గమనించే స్థితిలోలేకపోగా, తమకనుకూలంగా లేని మరికొంతమందికి భూమిని దక్కకుండాచేశారు. యీవిధంగా ఆ ప్రాంతప్రజలు నిరాశకు లోనయ్యారు. అదనుకోసం ఎదురుచూస్తున్న స్థానికులైన ధనికరైతులు భూస్వాములు మళ్ళీ పేదవ్యవసాయ కూలీలమీద స్వారీచేయటానారు పరిస్థితులకు జడిసిన కొందరు వలసవెళ్ళడంకూడా జరిగింది

ఐతే, ఈ సంవత్సరం చైతన్యవంతులైన యువకుల ప్రోత్సాహంతో 1) యగవపల్లి, 2) ముత్యాలపల్లి, 3) నసనకోట, 4) గంగంపల్లి, 5) వెంకటాపురం, 6) పాతగేదగికుంట, 7) కొత్తగేదగికుంట, 8) పిచ్చిరెడ్డి కొట్టాల గ్రామాలలోని పేదలంతా ఐక్యమై బినామీ పట్టాభూములను, ఇంకా మిగిలియున్న శివాయిజమా భూములను ఆక్రమించుకోవడం జరిగింది. ఇదిచూచి కన్నుకుట్టిన కొందరు భూస్వాములు తుచ్ఛ

మైన ఎత్తుగడలకు పాల్పడ్డారు. పేదలకు అండగా నిలిచిన విప్లవరచయిత, మరియు రాష్ట్ర విప్లవరచయితల సంఘ కార్యవర్గసభ్యుడైన శ్రీ పరిటాల శ్రీరాములును దెబ్బ తీస్తేతప్ప పేదలు మనకు లొంగిరారనుకొని బాలసుబ్బారెడ్డి, వెంకరెడ్డి అను భూస్వాములు, పేదలమీద 8 కేసులను పెట్టారు. ఈ కేసులన్నిటిలో శ్రీరాములుగారిని చేర్చటం గమనార్హం. వీరు పెట్టిన కేసులన్నీ తప్పుడుకేసులే.

అరెస్టుచేసిన 24 గంట॥ లోగా కోర్టులో హాజరుపరచక పశువులను బాదినట్లుబాది తాగడానికి నీళ్ళు తినడానికి తిండిపెట్టక 3 రోజుల అనంతరం కోర్టులో హాజరుపరచడం జరిగింది. వీరిలో జేష్టనారాయణ, అది ఆంధ్ర సన్నోడు, మరికొందరికి బలమైన గాయాలు తగిలాయి.

ఇటువంటి చర్యలవల్ల గ్రామాలలో అశాంతిని సృష్టించి, ప్రజలను భీతావహులను గావిస్తున్న భూస్వాముల, పోలీసుల చర్యల్ని ప్రజాస్వామిక వాదులందరు ఖండించవలసిందిగా కోరుతున్నాము.

తా॥ వ్యవసాయ కూలీ సంఘం, ధర్మవరం.

కమ్యూనిస్టు విప్లవ నాయకులైన కా|మేడ్సు పాండు, మాలకొండయ్యలను వెంటనే కోర్టులో హాజరుపరచాలి.

5–10–74వ తేదీ వేకువజామున 2 గంటలకు కందుకూరు తాలూకా పలుకూరు గ్రామమునందు కమ్యూనిస్టు విప్లవకారులైన కా|మేడ్సు తిరుమలశెట్టి పాండురంగారావు, కోవా మాలకొండయ్యగార్లను పోలీసులు అరస్టుచేశారు. వారిని గుర్తుతెలియనిచోట వుంచి కాల్చిచంపాలని పోలీసులు కుట్రచేస్తున్నారు.

భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం కొనసాగుతున్న శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటానికి చేయూతగా వీరు యిరువురు 5 సం॥ రాలుగా రైతులతో సమ్మిళితమైయున్నారు. సమసమాజ స్థాపనకోసం జరిగే పోరాటాలలో పాల్గొనే ప్రాథమికమైన హక్కు ప్రతివారికుంది.

పౌరహక్కుల పరిరక్షణ పోరాటంలో భాగంగానే కా|మేడ్స్ పాండు, మాలకొండయ్యల ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత మనందరిమీద వుంది. కావున ప్రజాస్వామికవాదులు, కార్మిక కర్షక అశేష ప్రజానీకమంతాకూడా వారిరువురిని వెంటనే కోర్టులో హాజరుపరచటానికి ఆందోళన, తీవ్రపోరాటం చెయ్యాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

నెల్లూరుజిల్లా పౌరహక్కుల సంఘం, నెల్లూరు.

భారత-చైనా మిత్రమండలి కార్యవర్గం అక్టోబరు 5 న గుంటూరులో సమావేశమై ఈ క్రింది తీర్మానాలను ఆమోదించింది

1. అరెస్టులు :

ఆంధ్రప్రదేశ్ భారత–చైనా మిత్రమండలి కార్యదర్శి శ్రీ కె. వి. రమణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీ యం. టి. ఖాన్, కార్యవర్గ సభ్యులు శ్రీయుతులు వరవరరావు, చెరబండరాజు, సి. హెచ్. రోశయ్య గారలను అరస్టుచేసి ప్రభుత్వం వారిపై సికిందరాబాదు కుట్రకేసును బనాయించింది. మరొక కార్యవర్గ సభ్యుడు శ్రీ థామస్‌ను అరెస్టు చేసి అతనిపై చిత్తూరు కుట్రకేసును బనాయించినది. ఖమ్మంజిల్లా భారత-చైనా మిత్ర మండలి కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి కోటేశ్వరరావును కూడా సికిందరాబాదు కుట్రకేసులో యిరికించి అరెస్టుచేశారు.

ఇరుగు పొరుగు దేశాలైన భారత చైనాలమధ్య మైత్రి సాధించటానికి ప్రయత్నం సాగించే మేధావివర్గంపైకూడా భారత ఫాసిస్టు ప్రభుత్వం తీవ్ర దమనకాండ సాగించడాన్ని కార్యవర్గం ఖండించింది. వారి విడుదలకై ఆందోళన చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

2. సిక్కిం సమస్య :

భారత ప్రభుత్వం సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో సిక్కింను తన అనుబంధరాజ్యంగా ఏర్పాటుచేసుకొన్న చర్య భారత సిక్కిం ప్రజల వ్యతిరేకతనే కాకుండా భారతదేశపు యిరుగు పొరుగు దేశాల వ్యతిరేకతను మీదు మిక్కిలి ప్రపంచ ప్రజల వ్యతిరేకతనుకూడా కొనితెచ్చుకొంది.

ఆసియా ఖండంలో సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న విభజించి పాలించేవిధానంలో యిది ఒక భాగంగా ఈ సమావేశం అభిప్రాయపడుతోంది.

భారత ప్రజలు చైనా ప్రజలు యిరుదేశాలమధ్య సత్సంబంధాలు నెలకొల్పుకోవాలని తీవ్రంగా కాంక్షిస్తున్న ప్రస్తుత దశలో భారత ప్రభుత్వపు సిక్కింపై చర్య యీ యిరుదేశాలమధ్య మైత్రీ సంబంధాల పునరుద్ధరణకు ప్రతిబంధకంగా తయారైంది.

భారత ప్రభుత్వపు ఈ చర్యను ఈ సమావేశం తీవ్రంగా ఖండిస్తోంది.

3. కమ్యూనిస్టు చైనా విప్లవ రజితోత్సవం

1949 అక్టోబరులో విప్లవ విజయానంతరం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన, మావో-సే-టుంగ్ నాయకత్వాన చైనా అన్నిరంగాలలోనూ అమితమైన అభివృద్ధి సాధించింది. సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజ్యవాదుల కుట్రలను ఎదుర్కొంటూ, దేశంలో అంతర్గతంగా తలెత్తిన అతివాద, మితవాద ధోరణులను తుత్తునియలు చేస్తూ

మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు వెలుగులో పురోగమిస్తున్నది. ప్రపంచ విప్లవకేంద్రంగా పీడిత ప్రజల ఆశాజ్యోతిగా అలరారుతున్న జనచైనా ప్రజలకు ఈ సమావేశం జేజేలు అర్పిస్తున్నది.

వై. కాశీపతి,
నిర్వాహక కార్యదర్శి,
భారత-చైనా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్.

గుంటూరు,
5-10-74

అరెస్టులు – ఖండనలు :

కంఠాలకు ఉరితాళ్లు

చిన్ని చిన్న మంటలే
దావానలంగా మారునట్లు
ఇప్పటి ఈ
చిన్ని చిన్ని అరెస్టులే
విప్లవ విద్యుత్ జలపాతంలోకి
ధైర్యాన్నీ, ఉత్సాహాన్నీ
ఎంచక్కా నేర్పిస్తున్నాయి
ఇక్కడ శ్రీకాకుళం
లేకపోయినా,
నక్సల్‌బరీ లేకపోయినా
కారు చీకట్లని చిమ్ముకుంటూ
గండ్ర గొడ్డళ్ళలా
చిట్టి గొంతులు
గర్జిస్తున్నాయి.
తీగలాగితే
డొంకంతా కదిలినట్లు
ఒక్కొక్క అరెస్టు
లక్ష కంఠాలు
కలిపేస్తోంది
వంద గుణపాఠాలు
నేర్పుతోంది.

– జ్యోతి

* * *

చిత్తూరు బనాయింపు కుట్రకేసులో విప్లవ రచయితలైన భూమన్, జ్యోతులతో పాటు శివారెడ్డి, నాగేశ్వరరావు మల్లయ్య, ఈశ్వరయ్య మొదలగువారిని యిరికించిన ప్రభుత్వపు ఆటవిక చర్యను- చిత్తూరు, కృష్ణా, మహబూబ్‌నగర్ జిల్లా విరసం శాఖలు తీవ్రంగా ఖండించి వెంటనే వారందరి విడుదలను డిమాండ్ చేసినవి-

'నిజమైన వ్యక్తి స్వాతంత్ర్యం'

"కడుపుకాలుతున్న నిరుద్యోగికి 'వ్యక్తిస్వాతంత్ర్యం' గురించి చెప్పటం వ్యర్థమూ, అర్థరహితమూనూ.

దోపిడీ విధానం పూర్తిగా రద్దయినపుడు మాత్రమే, కొందరు ఇంకొందరిని అణచి వుంచగలగటం పోయినపుడు మాత్రమే, నిరుద్యోగానికీ, దారిద్ర్యానికీ స్వస్తి చెప్పినపుడు మాత్రమే, పని-యిల్లు-తిండి పోతాయేమోననే భయంలేని పరిస్థితులు నెలకొనినపుడు మాత్రమే నిజమైన స్వాతంత్ర్యం స్థాపించబడుతుంది.

అటువంటి సమాజంలో మాత్రమే కాగితాలమీది స్వాతంత్ర్యంగాక నిజమైన 'వ్యక్తిస్వాతంత్ర్యం' సాధ్యం–"

– స్టాలిన్

మహిళా ఉద్యమం : లెనిన్

"... మహిళల విముక్తి కమ్యూనిజంద్వారానే సాధ్యమని మీ థీసిసులో నొక్కిచెప్పాలి. ఉత్పత్తిసాధనాలపై యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులకున్నంత కాలం మహిళలు మానవమాత్రులుగా, సమాజ సభ్యులుగా జీవించజాలరని స్పష్టంచేయాలి. ఈ రెంటికిగల సంబంధం పరిష్కార సాధ్యంకాదని విశదీకరించాలి. 'మహిళల విముక్తి'కై సాగే బూర్జువా ఉద్యమాలనుండి మన ఉద్యమాన్ని వేరుచేసుకోవాలి. ఆ విధంగా మహిళా సమస్యను సామాజిక సమస్యలో భాగంగా, కార్మికవర్గ సమస్యలో భాగంగా పరిశీలించడానికి పునాది ఏర్పరచినవారమవుతాం. ఆ విధంగా దాన్ని శ్రామికవర్గ పోరాటంతో, విప్లవంతో దృఢంగా బంధించడం వీలుపడుతుంది. మహిళా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజా ఉద్యమంగా వుండాలి; మొత్తం ప్రజా ఉద్యమంలో అదొక భాగంగా వుండాలి. ఒక్క శ్రామికోద్యమంలో భాగంగానేగాక, పీడిత ప్రజలందరి ఉద్యమంలో, అణచబడినవారందరి ఉద్యమంలో, పెట్టుబడిదారీ విధానానికి బలిఅయ్యే వారందరి ఉద్యమంలో భాగంగా అదివుండాలి. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గంయొక్క చరిత్రాత్మక కర్తవ్యం. ఈ వర్గపోరాటంలో మహిళా ఉద్యమంయొక్క ప్రాముఖ్యత చాలావుంది. విప్లవ మహిళలలో ఉత్తములంతా నేడు అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థలో (కొమిన్‌టర్న్) ఉన్నారు. ఇలా చెప్పడానికి మనకు అన్నివిధాలా హక్కుఉంది. అయితే ఇది యింకా నిర్ణయాత్మకమైన విషయం కాలేదు మన పోరాటంలో. ముఖ్యంగా కమ్యూనిస్టు నిర్మాణంలో. పట్టణాలలోని, పల్లెలలోని శ్రామిక మహిళలను లక్షల సంఖ్యలో సమీకరించాలి. మహిళలు లేకుండా నిజమైన ప్రజాఉద్యమం ఉండజాలదు—"

(చివరి పేజీ తరువాయి)

కమ్యూనిజంల నిర్మాణానికై మహత్తరపోరాటం జరుపవలసిందని ప్రజలందరకు పిలుపిస్తున్నాము. ఆ మహత్తర పోరాటంలో భాగంగానే ప్రస్తుత భూస్వామ్య, దళారీ ఇందిరా ప్రభుత్వాన్ని ధ్వంసంచేసి, కార్మికవర్గనాయకత్వాన జనతా ప్రజాతంత్రపాలనను నెలకొల్పడానికై, సాయుధ విప్లవాన్ని ముందుకు తీసుకపోవల్సిందిగా పీడిత ప్రజలకు పిలుపిస్తున్నాము

— భారత కమ్యూనిస్టు (మా-లె) పార్టీకి చెందిన ఖైదీలు
జిల్లా జెయిలు, సికిందరాబాదు.

SRJANA Telugu Monthly Nov. '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

చట్టబద్ధ హత్యలు (ఉరిశిక్షలు) రద్దుకావాలి-

9-10-74 తారీఖున ఉదయం 5-10 గం॥ లకు సికిందరాబాద్ జిల్లా జైలులో రోశన్న, పాపన్న అనే ఇద్దరు పేదరైతులను, అభివృద్ధినిరోధక ప్రభుత్వం ఆజ్ఞపై ఉరి తీయడం జరిగింది. అందుకుగాను, అదే జైలులోని కమ్యూనిస్ట్ (మా-లె) పార్టీకి చెందిన ఖైదీలు అదేరోజు రాత్రి 8-30 గం॥ లకు సంతాపసభ జరిపారు.

ఐక్యరాజ్యసమితి తన తీర్మానాలద్వారా అన్నిదేశాల ప్రభుత్వాలను ఉరిశిక్షలను రద్దుచేయమని కోరింది. దాన్ని పురస్కరించుకొని దాదాపు 34 దేశాలు ఉరిశిక్షను రద్దు చేశాయి ఏ బ్రిటిష్ చట్టాలమీద ఆధారపడి భారత ప్రభుత్వం తన చట్టాన్ని రచించుకున్నదో ఆ బ్రిటన్‌కూడ ఉరిశిక్షను ఎన్నో ఏండ్లకిందనే రద్దుచేసింది. అయితే ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమని డంబాలు చెప్పుకొంటున్న ఈ అభివృద్ధినిరోధక ప్రభుత్వం ఆ తీర్మానాలను ఖాతరుచేయక అమానుషమైన ఈ 'చట్టబద్ధ హత్యల'ను కొనసాగిస్తున్నది. వీటిదృష్ట్యా పై సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు చేయడమైనది.

1. 'ఉరిశిక్షలు' అంటే మనిషిని మనిషి 'న్యాయం' పేరుతో హత్యచేయడం. వర్గసమాజ ఆవిర్భావంతో ప్రారంభమై, బానిసవిధాన ఉచ్ఛదశలోను, భూస్వామ్యవిధానయుగంలోనూ ఇవి బహుళంగా ఆచరించబడినవి. బూర్జువా సమాజంలోకూడ పైపద్ధతి సంపూర్ణంగా రద్దుచేయబడక పోవడానికి కారణం అదికూడ వర్గసమాజం కావడమే. పీడిత ప్రజలను 'చట్టం' 'న్యాయం' పేరుతో అణగద్రొక్కుటకు దోపిడీవర్గాలచేతిలో శక్తివంతమైన ఆయుధాలుగా ఈ ఉరిశిక్షలు అనేవి ఉపయోగపడుతున్నవి. కనుక, ఈ ఉరిశిక్షలను పూర్తిగా రద్దుచేయాలని (రాజకీయ ఖైదీలతోసహా) అందరి ఉరిశిక్షలను సంపూర్ణంగా రద్దుచేయాలనీ డిమాండు చేస్తున్నాం. ప్రజాస్వామికవాదులూ, పీడితప్రజలుకూడ పై విధంగానే డిమాండ్‌చేయాలని, ఆ డిమాండ్ సాధించుకోవడానికి సమర్ధవంతమైన ఆందోళన సాగించాలనీ మేము వారిని కోరుతున్నాము.

2. భారత కమ్యూనిస్టు (మా-లె) పార్టీకిచెంది, ప్రస్తుతం సికిందరాబాద్ జైల్లో గంజ్ (కండెమ్డ్ సెల్స్)లో నిర్బంధించబడిన కామ్రేడ్స్ కిష్టాగౌడ్, భూమయ్యలపై విధించిన ఉరిశిక్షలు రద్దుచేయాలనీ డిమాండ్ చేస్తున్నాం. వారి ఉరిశిక్షలు రద్దుచేసేటందుకై ప్రభుత్వంపై వత్తిడి తేవడానికి మహత్తరమైన ప్రజావుద్యమం నిర్మించమని మేము ప్రజాస్వామ్యవాదులకు, పీడిత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

3. వర్గసమాజం నాశనంకానిదే, దానినుండి పుట్టిన ఈ ఉరిశిక్షలవంటి చెడు పద్ధతులు సంపూర్తిగా మాసిపోవు. కనుక వర్గసమాజాన్ని నాశనంచేయుటకు వర్గరహితసమాజం

-(మిగతా ఇదే కవరు లోపలిపేజీలో)

SRJANA
Hanamkonda
Warangal 506001

Rs. 1-50